ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు

సంపుటము 42 సంచిక 7


**ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY**

అక్టోబరు 12 1949


వార్తా చిత్రాలు




జపాను గృహపరిశ్రమలను పరిశీలించి ఇండియాకు ఉపయోగపడేవేమో చూసే నిమిత్తం ఇండియానుంచి వెళ్ళిన ఇద్దరు ప్రతినిధులు బెప్పూ అనే ఊళ్లో వెదురుపట్టే పరిశ్రమ యజమానితో మాట్లాడుతున్నారు. ఈ గృహపరిశ్రమ వెదురు చేపలు పస్తుగాలాలు మొదలయినవి చేసి వీలకొలదిగా డాలర్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నది.



అమృతసర్ స్వర్ణదేవాలయంలో వందనసమర్పణం చేసుకుని బయటికివస్తున్న భారత సర్వసేనాని మేజర్ జనరల్ కరియప్ప.



రాజమహేంద్రవరం గాంధీజయంతి నిర్వాహకసంఘం ఏర్పాటు చేసిన గాంధీజీ జీవితగాథాచిత్రపటప్రదర్శనమునకు కనూ గాంధీ ప్రారంభోత్సవం జరిపినప్పటి దృశ్యం.



జమ్మూ కాశ్మీర్ జాతీయమహాసభసందర్భంలో శిశువుల ప్రదర్శనం ఒకటి ఏర్పాటు చేశారు. ప్రధానామాత్యుడు నెహ్రూ ప్రభృతులు హాజరైన ఆ ప్రదర్శనం తాలూకు చిత్ర మిది.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర, యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము **42**


సంచిక **7**

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర ఆశ్వయుజ బహుళ పంచమి బుధవారము



దనుష్కోటినుండి సింహళం వెళ్లనున్న స్టీమర్లు



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ అక్టోబరునెల 12-వ తేది బుధవారము

ఆంధ్రరాష్ట్ర నిర్మాణావకాశం

ఇతర భాషారాష్ట్రముల నిర్మాణముకంటే ఆంధ్రరాష్ట్ర నిర్మాణము సుసాధ్యమని భారత ప్రధానమంత్రి అధినివేశశాసనసభలో ప్రకటించి రెండుసంవత్సరము లైనది. అనంతరము రాజ్యాంగపరిషత్తుఅధ్యక్షుడు నియమించిన ధార్‌కమిషన్, జయపూర్ కాంగ్రెస్ ఏర్పాటుచేసిన నాయకత్రయసంఘము ఇంచుమించు ఇదే యభిప్రాయమును తెలిపెను. ఆంధ్రులు చెన్నపట్టణముపై తమ హక్కులను-అంటే ఆంధ్రులకు నగరముపై హక్కు గలదని నాయకత్రయము అంగీకరించినట్లే - వదలుకొనిన ఆంధ్రరాష్ట్రనిర్మాణమునకు అవసరమైన చర్యలు తీసుకొనవలెనని నాయకత్రయసంఘము ప్రకటించుట వలన రాష్ట్రనిర్మాణము మరొక అడుగు ముందుకు సాగినది. ఈ నాయకత్రయనివేదికను కాంగ్రెస్ కార్యవర్గము, భారతప్రభుత్వముకూడ అంగీకరించియున్నందున సత్వరాంధ్ర రాష్ట్రనిర్మాణమునకు - చెన్నపట్టణముపై ఆంధ్రులహక్కుల ఉద్ఘాటనలు, పునరుద్ఘాటనలు తప్ప-మరొక ప్రతిబంధకము లేదు. మొన్న మంగళవారము కాంగ్రెస్ కార్యవర్గము చేసిన తీర్మానము ఈ విషయమునే స్పష్టము చేసినది. "నాయకత్రయనివేదికయందు పేర్కొనబడినషరతులు నిర్వర్తింపబడిననే ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణము సాధ్యము"అని కార్యవర్గతీర్మానము హెచ్చరిక చేసెను.

చెన్నపట్టణముపై ఆంధ్రులకు గల హక్కు ఒక్కటే. నగరనిర్మాణము, అభివృద్ధి, ఆంధ్రుల కృషిఫలితము గనుక చెన్నపట్టణము ఆంధ్రరాష్ట్రములో చేరవలెను. చరిత్రను అలక్ష్యముచేసి, కేవలము నేడు నగర జనాభానే పరిగణించి చెన్నపట్టణమును తమిళరాష్ట్రములో చేర్చుటకు ప్రయత్నములు జరిగిన, అట్టి ప్రయత్నములను తాము ప్రతిఘటింతుమని, ఏ కారణముగనైన చెన్నపట్టణము ఆంధ్ర రాష్ట్రమున చేరకున్న, నగరమును, పరిసర ద్విభాషాప్రాంతములను ఒక ప్రత్యేక ఉపరాష్ట్రముగ చేయవలెనని ఆంధ్రులు నగరముపై తమ హక్కులను చాటుచుండిరి.

చెన్ననగరమువంటి బహుభాషా ప్రాంతము యథార్థమునకు ఏ ఒక భాషావర్గ ప్రాజాపత్యమునకు లోబడియుండరాదు. ద్విభాషానగరమైన-వాస్తవమునకు ఈ పట్టణము ఒరిస్సా రాష్ట్రమున చేర్చబడినసమయములో తెనుగుపట్టణమే - బరంపురము ఓఢ్రుల పరిపాలనలో నుంచుటవలన, స్థానికాంధ్రులస్థితి దుర్భరమైనట్లు గత పుష్కరఅనుభవము స్పష్టము చేసెను. కనుకనే బొంబాయినగరముపై మహారాష్ట్రులకును - తమకు చెన్నపట్టణముపై నున్నట్లే - పూర్తిహక్కులున్నను నాయకత్రయసంఘ మీ మహాపట్టణమును ప్రత్యేక రాష్ట్రము చేయవలెనని చేసినసిఫార్సును హర్షించి, చెన్నపట్టణమును అదేవిధముగ చేయవలసినదని ఆంధ్రులు కోరిరి. అంత వరకు ఆంధ్రులు నగరముపై తమకు గల హక్కులను వదలుకొనిరి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌సంఘము నాయకత్రయనివేదిక ప్రథమములో ఈ యభిప్రాయమునే ప్రకటించినది. కాంగ్రెస్‌కార్యవర్గము తిరిగి యభిప్రాయములను వ్యక్తము చేసి, ఆ నివేదికాంశము లెంతవరకు పాలింపబడినవో తెలుపవలసిందిగ కోరినది గనుక, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘము రాష్ట్ర సత్వరనిర్మాణమునకు దోహదము చేయగల తీర్మానమును చేయునని ఆశించుచున్నాము.

ఆంధ్రకాంగ్రెస్ సంఘముతో బాటు, తమిళకాంగ్రెస్‌సంఘము, చెన్నరాష్ట్ర ప్రభుత్వముకూడ నాయకత్రయనివేదికషరతులు ఎంతవరకు పాటింపబడినవో విచారించి కాంగ్రెస్ కార్యవర్గమునకు నివేదించవలసి యుండెను. ఇందుకు కార్యవర్గము నవంబరు 14వ తేదీ గడువుపెట్టినది గనుక నూత్న రాజ్యాంగమునందలి రాష్ట్రముల జాబితాలో ఆంధ్రరాష్ట్రమును పేర్కొనుట జరుగవచ్చును. కాని రాజ్యాంగరచనాసంఘఅధ్యక్షుడు డాక్టర్ అంబేద్కర్‌గారు ముసాయిదాలో తెలిపినట్లు కేవలము రాష్ట్రముల జాబితాలో ఆంధ్రను పేర్కొనినంతమాత్రమున నూత్న రాజ్యాంగము అమలునకు వచ్చుటతో బాటు ప్రత్యేకాంధ్ర రాష్ట్రము ఏర్పడదు.

కాంగ్రెస్‌కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావు, ఆంధ్రకాంగ్రెస్ అధ్యక్షుడు ఆచార్యరంగా, ఆంధ్రరాష్ట్ర నిర్మాణమువిషయమున కాంగ్రెస్ కార్యవర్గము ఆతురతగ నున్నట్లు సూచించిరి. కాంగ్రెస్‌కార్యవర్గం, కేంద్రప్రభుత్వ నిర్ణయములు నవంబరు 14వ తేదీలోపున ఆంధ్ర, తమిళ కాంగ్రెస్‌సంఘములు, చెన్నరాష్ట్ర ప్రభుత్వముకార్యవర్గమునకు పంపు నివేదికలపై నాధారపడి యుండును. నాయకత్రయనివేదికలో నిర్వచింపబడిన షరతులను ముఖ్యముగ అంగీకరించవలసినవారు ఆంధ్రులే. కనుక ఇపుడు, తమిళకాంగ్రెస్, చెన్నరాష్ట్ర ప్రభుత్వము ఆంధ్రుల షరతులను అంగీకరించిరా లేదా యను విషయమై తమ తీర్పు నివ్వవలసియున్నది. కార్యవర్గము ఆ తీర్పును పురస్కరించుకొని ఆంధ్రరాష్ట్రనిర్మాణమువిషయములో తమ నిర్ణయమును చేయును. ఈ కార్యవిధానము నాయకత్రయనివేదికాంశములకంటెను అవమానకరముగ నున్నదని చెప్పవలెను. "సత్వరాంధ్రరాష్ట్ర నిర్మాణము జరుగవలెనన్న రాష్ట్రమును వాంఛించువారు నగరముపై తమకు గల హక్కులను వదులుకొనవలెను." ఇది నాయకత్రయము విధించిన మొదటి షరతు. రెండవ షరతు సరిహద్దులకు సంబంధించినది: "ఆంధ్రులు నివేదికలో వివరింపబడిన మూలసూత్రములను అంగీకరించిన ఆంధ్రరాష్ట్రమును ఏర్పాటు చేయవచ్చును. అయితే ఈ రాష్ట్రము ప్రస్తుత చెన్నరాజధానియందలి ఇతర భాషాప్రాంతములవారి సమ్మతితో ఆంధ్రరాష్ట్రసరిహద్దులు నిర్ధారణ కావలెను. అట్టి రాష్ట్రనిర్మాణమునకు ఇతర భాషాప్రాంతములవారు అంగీకరింపవలసియుండును." ఈ షరతులను ఎవరు ఎంతవరకు పాలింతురో తమిళ కాంగ్రెసు, చెన్నరాష్ట్ర ప్రభుత్వము, ఆంధ్ర కాంగ్రెస్ సంఘము నివేదింపవలెను.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌సంఘము లోగడ "తెనుగుజిల్లాలతో వివాదగ్రస్తప్రాంతములను సరిహద్దునిర్ణయ సంఘమునకు వదలి, రాష్ట్రము ఏర్పడవలెనని తీర్మానించియుండెను. తరువాత, ఇతర ఆంధ్రసంస్థల నాయకుల అభిప్రాయముల ననుసరించి రాష్ట్ర కాంగ్రెస్‌సంఘ మీ తీర్మానమును మార్చుకొని, తుదకు జులై 26-వ ఆంధ్రప్రజాపరిషత్తు చేసిన తీర్మానమును ఆమోదించియుండెను. రాష్ట్ర కాంగ్రెసుసంఘము ఈ తీర్మానమునకే కట్టుబడియుండిన నాయకత్రయనివేదికయందలి ప్రధానసూత్రమే పాలింపబడలేదని కార్యవర్గము అభిప్రాయపడవచ్చును. కనుక ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రము వెంటనే ఏర్పడవలెనన్న రాష్ట్రకాంగ్రెసు సంఘము ఆచరణ సాధ్యమైన తీర్మానమును చేయవలసియుండును. రాష్ట్రకాంగ్రెసుఅధ్యక్షుడు ఆచార్యరంగాగారు రాష్ట్రకాంగ్రెసు సమావేశమై ఈ విషయములో తన యభిప్రాయమును వ్యక్తము చేయువరకు సభ్యులెల్లరు మౌనము వహించవలెనని విజ్ఞప్తిచేసిరి. దానినిబట్టి రాష్ట్రకాంగ్రెసు తన పూర్వనిర్ణయములను పునరుద్ఘాటన చేయుటకు పూర్వాపరము లన్నింటిని ఉద్రేకములకు తావివ్వక ప్రశాంతముగ విచారింపవలసిన యవసరమున్నట్లు రంగాగారభిప్రాయపడుచుండిరని భావింపవలసి యున్నది. రాష్ట్రకాంగ్రెసుసంఘము కేవలము తన యభిప్రాయమును ప్రకటించుటతో తృప్తిపడుటకంటె, కార్యవర్గతీర్మానమును మద్రాసుప్రభుత్వముతో, తమిళకాంగ్రెసుప్రతినిధివర్గమును నియమించుట ఉత్తమము. తమిళకాంగ్రెసు కూడ అట్టి ప్రతినిధివర్గమును నియమించిన కార్యనిర్వహణ సుకరము కాగలదు.

కాని మొన్నటిదినము ఆంధ్ర కాంగ్రెసుకార్యవర్గసభ్యుడు శ్రీ ప్రకాశంపంతులుగారు, రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుని విజ్ఞప్తితోబాటె కార్యవర్గ తీర్మానమును ఖండించుచు, "బొందిలో ప్రాణమున్నంతవరకు" నాయకత్రయ నివేదికను ప్రతిఘటించెదమని ఘోషించిరి. దాదాపు అదేరోజున చెన్నపట్టణం కార్పొరేషను, పౌరవ్యవహారములను విసర్జించి, రాజకీయాంశముల చర్చకు దిగి చెన్నపట్టణము తమిళరాష్ట్రభాగమని తీర్మానించెను. ఆ తీర్మానముపై తమిళసభ్యుల ప్రసంగములు ఎవరికిని గౌరవప్రదముగ లేవు.

వీటన్నింటిని గమనించిన ఆంధ్రరాష్ట్రనిర్మాణము, చెన్నపట్టణం భవిష్యత్తునిర్ధారణవిషయములో ఎట్టి జాప్యము జరిగినను, పరిస్థితులు విషమింపగలవని గ్రహింపవలసి యున్నది. నాయకత్రయనివేదికపై ఆంధ్ర, తమిళ కాంగ్రెసు సంఘముల యభిప్రాయము, చెన్నరాష్ట్రప్రభుత్వాభిప్రాయము ఒకేవిధముగ నుండజాలవు. ధార్ కమిటీప్రశ్నావళికి సమాధానమిచ్చుచు రాష్ట్రప్రభుత్వము "చెన్నపట్టణమును ప్రత్యేకరాష్ట్రముగ ఏర్పరచుటకు తాము విముఖులు"ని స్పష్టము చేసెను. తమిళరాజధాని రాష్ట్రములో మరొక కేంద్రనగరమున నుండవలెనని కొందరు తమిళనాయకులు ఆందోళన చేయుచున్నను రాష్ట్ర కాంగ్రెసుసంఘముమాత్రము చెన్నపట్టణము రాజధానిగ తమిళరాష్ట్ర

నవల

నాకబలి

వి.ఎస్. ప్రసాదరావు

౧౬

అతనిలో, ఆ నాటిఘాతానికి క్రోధరోషాలు గడ్డకట్టుకొనిపోయి, ప్రభావతివిషయ మేది అన్నా నిరాదరణతోనూ, తిరస్కృతితోనూ, మనస్సును కుంభించివేశాయి. ఆ మనస్థితిలో ఆ ఉత్తరాన్ని విప్పకుండానే అట్టే ఉంచి పడేశాడు. కాని సముద్రపు అలలను ఒడ్డుకు రానీయకుండా ఆపటం ఎంత అసాధ్యమైనా, ఆ మనస్తరంగాలను ఆ ఉత్తరంవైపుకు మొగ్గనీయకుండా చేయటం, అంత కష్టసాధ్యం గానూ ఉంది.

ఉండి ఉండి పైన అడ్రెసు, తపాలాముద్ర పరికిస్తూ కూర్చున్నాడు. ఆ దస్తూరి మనస్సును కలయిస్తూనే ఉంది. తనకు తెలియకుండానే ఉత్తరం చించి చదవసాగాడు. చివరిదాకా చదివి, దాదాపునిర్వికారంగానే ఉత్తరం మడిచి జేబులో పెట్టాడు. కాని తిరస్కృతికి మూలమైన క్రోధరోషాలు, కర్పూర శలాకలా కరిగిపోతున్నాయి.

అన్నిమాట్లు ఆ ఉత్తరం చదువుకొంటూ న్నట్లు అతనికే తెలియడం లేదు. ఆద్యంతాలూ చదవటం మానివేశాడు. మధ్యమధ్య ముక్కలే అనుకోకుండా పునశ్చరణ చేస్తున్నాడు.

"రాఘవా, ఈ ఉత్తరం ఎందుకు వ్రాస్తున్నానో ప్రస్ఫుటంగా నాకూ తెలియదు. నాతుది చర్యతో నీకు నామీద అమితమైన కోపమూ జుగుప్సా వస్తాయని, నిన్ను కొత్త ఎరిగున్న నాకు తెలుసును. కానీ అందుకు, నేను వెరవటం లేదు. నిజంగా ఆ కోపమూ జుగుప్సా నీలో అల్లాగే నిలచేట్టయితే, నీకూ నాకూ కూడా క్షేమంకరమని నాకు తెలుసును. కాని ఏ ఎరుకనుబట్టి నీకు కోపము వస్తుందని తెలుసుకొన్నానో, ఆ ఎరుకనుబట్టే, నీలాంటి సున్నితపు తత్వాల్లో ఆ క్రోధము పశ్చాత్తాపము గానూ పరివేదనగానూ మారి, ఏ మనిషిని కోపంతో అసహ్యంతో చూశావో, ఆ మనిషే ఆ పరితాపఘట్టంలో, దీనావస్థలో దుస్థితి కెరయైన దేవతాస్త్రీగా భ్రమ గొల్పి, నీలాంటివాళ్ల జీవితాన్నంతనూ పాడుచేయగలదనికూడా, నీతో గడిపిన స్వల్పకాలంలో నాకు అనుభవానికి వచ్చింది. రాఘవా! నీవు ఆ విధంగా ఆరాధించ కోవలసిన ఉత్తమత్వం ఏదీ నాలో లేదు."

ఉత్తరం మడిచి మళ్లీ చిరాకుతో ఆలోచించుకొంటున్నాడు. ఇంతదూరంనుంచీకూడా తన మనోగతుల క్షణక్షణపరివర్తనాన్ని ఈ అబోధిత స్త్రీశక్తి ఎల్లా అద్దంలో చూసినట్లు గ్రహిస్తూందో అతనికి అవగాహన కాలేదు, తనకు తెలియని అతీతమానసప్రవృత్తి, తన ప్రక్కనే ఇన్నాళ్లూ గడిపి, తన మనస్సును ఈ కించితస్థితిలో అట్టేబెట్టి ఉంచినందుకు చిరాకే అనుభవిస్తున్నాడు.

"ప్రేమయొక్క ఉత్తమస్వరూప మేదో, అల్లాంటిది ఉందో లేదో నే నెరుగను. కాని నీలో అల్లాంటి అత్యుత్తమభావనే నాపట్ల విలసిల్లిందని నేను ఎరుగుదును. ఆ కాలాలలో అంతకన్నా నా మనసును సంతోషంతో నింపిన భావన లేదు. కాని ఈనాడు ఆ భావనే, శాశ్వతత్వం అందుకొని నీలో నిలుస్తుందేమో ననుకొన్నప్పుడు, (అనుకొన్నంతసేపూ నాహృదంతరమంతా, సంతోషపు బుబ్బుతో పొంగిపోతున్నా) వెనువెంటనే, నిర్వేదంతో కుమిలిపోవాల్సివస్తూంది. రాఘవా - నీబాగు చూసుకోవటం నీకు తెలియదని ఒకనాడు అన్నాను. ఆనాడు నీస్వార్థము నన్ను ఆ విచిత్ర జీవితకల్పనలలోకి దింపిందేమోనని నువ్వు బాధపడ్డావు. కాదని నేనన్నమాట ఆనాడు నువ్వు నమ్మలేదు. ఈనాడూ నమ్మగల స్వార్థం నీలో లేదు. అందుకనే నాతో నీ పరిచయాన్నంతా, మధురభ్రమారహితంగా, లోకయాథార్థ్యదృష్టిలో మననం చేసికొమ్మని కోరుతున్నాను. ఒకనాడు యౌవనపుటుబలాటంలో, ఒక స్త్రీని మోహించి వెంటబడ్డావు. ఆమె కూడా, ఎరుగనిదానిలాగే ఉండి, నిన్ను బలీయంగా తన వజ్జను కట్టివేసుకొంది. ఆమెలోని వికారగుణాలన్నీ ఆ పసిదనపు విశాలహృదయంతో లెక్కకు రానీక త్రోసివేసికొని ఆకులటను సమ్మానించావు. గంగలో విహారానికి వెళ్లేనాటిదాకా క్రీడావస్తువుమాత్రంగానే నిన్ను భావించుకొన్నానంటే, పోనీ ఇప్పటికైనా నన్ను పూర్తిగా మరిచిపోగలవా?"

నిజంగా మరిచిపొమ్మంటూందో, లేక శాశ్వతంగా స్మృతిని బంధీకృతం చేసికొంటూందో! ఆమెకు తెలిసినంతవరకూ హృదయంలోనుంచి వచ్చిన యథార్థపు పలుకులే అని అనిపిస్తున్నాయి. కాని ఆమెకు తెలియకుండానే, "నన్ను జ్ఞప్తిలో ఉంచుకో"అన్న ఆక్రోశం, ఆ అక్షరాలలో ప్రవేశిస్తుంది. ఆనాటి గంగపైవిహారం జ్ఞప్తికి వస్తోంది. 'పడవ మనం నడుపుదామా' అంది. పది గజాలు స్వయంగా పడవ నడుపలేకపోయాడు. ఆనాడు కిలకిలనవ్వుతూనే పడవ నడకను పడవవాని కప్పచెప్పేశారు. ఈనాడు అల్లా నవ్వుకోగల పసితనం హృదయానికి రావటం లేదు. ఉత్తరంవంక చూపులేని చూపుగానే చూస్తున్నాడు. మధ్యమధ్య ఒకొక్కమాట చూపును మళ్లీ అరికట్టి, ఆ పరిసరాల అక్షరాలను చదివిస్తోంది.

"నేను పూజచేసికొంటూంటే చూసి సహనంతో చిరునవ్వు నవ్వి అవతలకు వెళ్లేవాడివి. ధర్మపథం తప్పినదానికి పూజ లేమిటని నీకు స్వల్పంగా అపహాస్యం మనస్సులో నిండి ఉండేది. కాని రాఘవా, ఉత్తమప్రకృతుల ధ్యానవిధాన మేదో నాకు తెలియదు. నీలో కొంత అట్టి ఉత్తమప్రకృతి ఉండటంమూలానినో ఏమో, పూర్వధర్మపథగతికం కాని మనస్సుకు, ప్రార్థన అనే ఆసక్కారం లేదనుకొంటూ, దైవము, దేవతార్చన, తీరదర్శనము అన్న పుణ్యలోభకార్యాల కన్నిటికీ విముఖత్వం చూపేవాడవు. కాని నాలాంటి సామాన్యప్రకృతులల్లాంటివి కావు. రాఘవా, నాకు దైవము, ఇష్టకామ్యాలను సిద్ధింపచేసేందుకే, ప్రయోజనకారి. నేను దైవాన్ని కోరుకొన్న కోరికలు ధర్మమా అధర్మమా అని నే నెన్నడూ ఆలోచించుకోలేదు. ధర్మమైనవైతే కోరికల పేరుతో అల్పంగా, అర్థించవలసినంత క్షుద్రంగా ఉండవనే భావించేదానిని. కేవలం అనుష్ఠానమే తప్ప, ఏ దైవాన్ని అర్థించవలసిన అల్పత్వం ధర్మపథంలో లేదనే అనుకొనేదాన్ని. కాని నాదేహం కోరికలపుట్ట. కోరికలకోసమే జీవిస్తున్నాననుకొన్నాను. దైవాన్ని ఎన్నో కోరికలు కోరుకున్నాను. నేను ఎన్నిఅక్షరాలు కోరుకొన్నానో, అన్నిఅక్షరాలు సంపూర్ణంగా ఫలించేటట్టూ చేశాడు. కాని ఆ ఫలితం స్వరూపం చూస్తేంటే తప్ప, నా కోరికలలోని అసంపూర్ణగుణాన్ని, సర్వజ్ఞహీనత్వాన్ని నేను గ్రహించలేకపోయాను. ఉత్తమస్త్రీలు ముందుజన్మలలో లభించాలని కోరుకొనే కోరికలనుగూడా, ఆత్రంతో అవ్యక్తమైన ఈజన్మలోనే లభించాలని కోరుకొన్నాను. జన్మలో అల్పభాగమైన జన్మగా భగవంతుడు నాకోర్కెలను సిద్ధింపచేసి నన్ను చూసి పకపక నవ్వాడు. ప్రభూ ఇంకే కోరికా కోరుకోనని తల వాల్చాను. కాని కోరిన కోర్కెలకు, సిద్ధించినఫలాలకు, అవి యుగమాత్రాలయినా, క్షణమాత్రాలయినా, వాటికి నేనేమీ పస్తాయించటం లేదు."

ఏమి టీవేదాంతం అంటూ విస్తుపోతున్నాడు. ఆమెవ్రాతలో ఒక క్రమము, ఏమీ కనబడటంలేదు. తనతో కాక ఎవరో అదృశ్యపురుషునితో, చెప్పుకొంటూన్నట్లు తన మనస్సులో కలిగే భావపరంపరనంతా, ఒక తీరూ తెన్నూ లేకుండా వ్రాసికొని పోతూంది. అది కేవలం మనస్సును నగ్నంగా విప్పిచెప్పుకొనే ఇంద్రియ ప్రకోపంగానే కనబడుతూంది.

"రాఘవా! త్యాగంచేయటం తేలికే! కాని ఏ వ్యక్తికోసం త్యాగం చేద్దామనుకొంటామో ఆ వ్యక్తి ఆ త్యాగభారాన్ని భరించటం కష్టమని నాకు తెలిసివచ్చింది. నేను నిజంగా ఏమీ త్యాగం చేయలేదు. నాకు కావలసిన కోర్కెలనే పొడుగునా వెంటాడాను. చివరికి, స్త్రీకున్న ఐహికఅపేక్షలలో కెల్లా అత్యున్నతస్థాయిలో ఉండే సంఘగౌరవస్థానంమీది అపేక్షనుకూడా నేను వదులుకోకుండా అట్టే నిలుపుకొన్నాను. కాని నే నేదో త్యాగంచేశానన్న భ్రమ నీలో వీడలేదు. ఆ త్యాగభారాన్ని భరించలేకనే ఉక్కిరిబిక్కిరై నీ సర్వస్వాన్నీ నిజంగా నాకోసం త్యాగంచేయటానికి సిద్ధమై మారంగా వదిలేసుకొన్నావు. కాని ఆ త్యాగాన్ని నేను భరించగల ఔన్నత్యంకానీ హైన్యం కానీ నాలో లేకపోయింది. ప్రేమ అనే శాశ్వతపదార్థ మొకటి ప్రపంచంలో ఉంటే అది పరస్పర త్యాగమూలకంగానే శాశ్వతత్వ మందుకోగలదని భావుకు లంటారు. కాని సామాన్యులలో త్యాగం చెయ్యగల సాహసం ఎక్కడైనా కద్దేమోతప్ప, ఉన్నతమనస్కతతో పరుల త్యాగాన్ని స్వీకరించగల గంభీరహృదయం ఉండటం అసంభవము. నేను సామాన్యులకన్నా హీనను. పరస్పరత్యాగాలను స్వీకరించే ఉన్నతులుగా శాశ్వతంగా 'ప్రేమను' సాధించగలగటం, గరళగ్రాహులైన పరమేశ్వరుడు పార్వతివంటి దేవతలకు మాత్రమే లభ్యమేమోనని అనుకొంటాను. తక్కిన లోకానికంతకు ఎక్కడైనా ఒకచోట యథార్థజీవితంలో క్షణికమాత్రంగా అనుభవమయి స్వాప్నికంగా శాశ్వతమధురస్మృతిగా మాత్రమే నిలిచిపోగలదేమోనని అనుకొంటాను. ఆ స్వప్నమైనా, నిత్య జీవిత వాస్తవికాన్ని జుగుప్సాకరంగా చూపిస్తూ నిలచేదయితే, భగవాన్ అదీ వద్దనికోరుకోగలటమే మానవులమైన మనం చేయగల పని. నా మధురస్వప్నం నా జీవితాన్ని పేలవం చేయటంలేదు...."

ఉత్తరం చదువుకొంటూ అచేతనుడై అల్లాగే కూర్చుని ఉండిపోతున్నాడు. విడిదినుంచి తన వాళ్లంతా పెళ్లి వారింట్లోకి వస్తున్నారు. పురోహితుడు పల్కరిస్తున్నాడు.

"ఏం, బాబూ! లే! నాగవల్లిపీటలదగ్గిరకు కదులు."


ఎవరో జనమేజయుడు పురోహితుడిని ప్రశ్నిస్తున్నాడు.

"ఏమండీ! "నాకబలి" అంటే ఏమైనా హోమం, బలులూ అవీ ఉంటాయాండీ!" పురోహితుడు నవ్వుతున్నాడు.

"అబ్బే అవేమీ ఉండవండి. చక్కగా ముగ్గులు అలంకరించి నాగవల్లిపీడతలని, అలంకరణం చేసి, వాట్లను దానాలూ అవీ ఇస్తారు. నల్లపూసలు పూజచేయించటం తదంగం కొంత ఉంటుంది. ఆలస్యమౌతూన్నట్లుందే, లే బాబూ లే! అయ్యో అదేమిటి! పెండ్లి ఇంట్లో కాగితాలు తగులబెట్టున్నావు."

రాఘవరావు ఆ వుత్తరం చిన్న చిన్న ముక్కలుగా చించిపోగుచేసి అంటిస్తూ, ఆనందహీనమైన మందహాసంతో, "నాకబలికి హోమం ఉండదన్నారు కాదండీ! అందుకని, ముందే కాస్త హోమం చేస్తున్నాను." అన్నాడు.

పురోహితుడు కించిత్తు చలించి మళ్లీ పని తొందరలో తేరుకొన్నాడు.



మేర్పడవలె నని తీర్మానించియుండెను. యథార్థముగ, పరిపాలనాసౌలభ్యమునకు ఆంధ్రులకుగాని తమిళులకుగాని చెన్నపట్టణము రాజధానీనగరముగ నుండుట వాంఛనీయము గాదు. రాజధాని వేరొకచోట నున్న చెన్నపట్టణము ఏ రాష్ట్రమునందున్నను, ప్రాముఖ్యత తగ్గిపోగలదు.

కనుక మధుర రాజధానిగ తమిళ రాష్ట్రమును, విజయవాడ రాజధానిగ ఆంధ్రరాష్ట్రమును, చెన్నపట్టణమును, పరిసరద్విభాషా ప్రాంతములను ప్రత్యేక ఉపరాష్ట్రముగను నియమించుటే ఈ సమస్యాపరిష్కారమునకు సరియైన మార్గము. ఆంధ్ర, తమిళ కాంగ్రెస్ సంఘములును, చెన్నరాష్ట్రప్రభుత్వమును నాయకత్రయ నివేదికను పరిశీలించునపుడు అధికజన సమ్మతమును, ఆచరణసాధ్యమును అయిన పరిష్కారమార్గమునే దృష్టియందుంచుకొనెదరని విశ్వసించుచున్నాము. ఉద్రేకమునకు లోబడుట వలన రాజనీతిజ్ఞత లోపమై సులభముగ పరిష్కారము కావలసిన సమస్య కూడ క్లిష్టమై సమష్టిప్రయత్నమును గూడ ప్రతిఘటింపగలదు.

సారంగపాణి పదములు-

శ్రీ తిప్పావఝల కోదండరామయ్య

సాహితీసమరాంగణ సార్వభౌము లయిన శ్రీకృష్ణదేవరాయలవారు విద్యానగరమునుండి పెద్దనాది కవిదిగ్గజములకు బ్రాపును బ్రోపునునై పెద్దయెత్తున సాహితీసమారాధనము చేయుచుండగా దేశములోని చిల్లరరాజులు, జమీందారులు, సంస్థానాధీశ్వరులు చేతులు ముడుచుకొని యూరక కూర్చుండలేదు. తెలుగునాట నాడు వెలయుచుండిన నూజివీడు, చల్లపల్లి, ముక్త్యాల, పిఠాపురము, పెద్దాపురము, గద్వాల, వనపర్తి, వెంకటగిరి, కాళహస్తి, కార్వేటినగరము మొదలగు రాజాస్థానములు సంగీత సాహిత్యవిద్యావినోదములు లేనివి కావు. సాహిత్యచరిత్రములో నది యొక సువర్ణఘట్టము! సాహిత్యపోషణ మానాటి సంస్థానాధీశ్వరుల కొక మధుర క్రీడ. పేరుపెంపులు లేని పిల్లజమిందారుడయినను పేరునకేని దనయాస్థానములో నొకకవీశ్వరు నుంచికొనును. అతనిచే గావ్యములు రచింపించుకొని యానందించును. అది యతనికి ముచ్చట! అం దతని కానందము!

కార్వేటినగరసంస్థానము సుమారు రెండు శతాబ్దముల కాలము కవితకు గళలకు బట్టుకొమ్మయై నిలిచినది. కార్వేటినగరప్రభువులు కవితాపట్టభద్రులు, పండితులు సరసులును. వారి సరసమధురకరసంస్పర్శమున తెలుగు సాహితీ కన్య యొక క్రొత్త చెలువు నొలసి పులకరించినది. వారి పోషణమున గవీశ్వరులు సుఖజీవనులై కావ్యరచనానందము సాగించుకొనినారు. నా రొసగుచుండిన కవిమేరలు వంశపారంపర్యముగా నేటికిని గొనసాగుచున్నవి. సాహిత్యసంప్రాట్టులు, సంగీత సరస్వతులు నయిన వారి సంస్థానములో సంగీత సాహిత్యములు రెండును సమానగౌరవముతో నసమానముగా వెలుగందినవి. సారంగపాణి యను కవీశ్వరుడు కార్వేటినగరమున వెలసిన శ్రీ వేణుగోపాలస్వామిపేర దదంకితములుగా శృంగార వేదాంత పదములు రచించి విఖ్యాతు డయినాడు. ఇతని పదములు సారంగపాణిపదము లని వేణుగోపాల పదము లని ప్రఖ్యాతి వడసినవి. ఈపదములు చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో నేటికిని బహుళ ప్రచారము వడసియున్నవి. తిరుత్తని, వెంకటగిరి మొదలగుచోట్ల దేవోత్సవాదివిశేషసమయముల యందు ఈ పదములు నాట్యాభినయముతో దేవవేశ్యలచే బాడబడుచున్నవి.

మోహనరాగము - చాపుతాళము

(పల్లవి)

"నీవే నా శాస్త్రము - నాచేత కాసుంటె
నీ యక్క యింకొక్కతె

(అనుపల్లవి)

అదిగాకుంటె — దానక్క మఱియొక్కతె
పోవె పో యెవ్వతైన పుణ్యానికి రాదు
దేవరంభ యైన తే తెమ్మనక పోదు
అతిమోహమున వచ్చి యడుగులపై వ్రాలి
బతిమాలినప్పుడీ బాలి యెక్కడ బోయె
పతక మిచ్చితెగాని పలుక నంటివో లేదో
మెతుకులు జల్లితే క్షితిలో కాకులు బాతే"॥
"ఆనాడు నగరిది అరవైరూపాయీల
తాను పెట్టెలో వుంచి నే నట్టె రా నసె
తాను పావడగూర్చి ధరియించుకోవలెను
వానలు గురిసితే వాతలు మానున"
"పాతర లాడుచు రాతిరి వేణుగోపాలా
యనుచు నన్ను పరతి గూడిన దల్ల
యీతగింజకథ తానై యున్నది గదే
యేతము వంగేది లోతునీళ్ళకే గాదా

ఈ పదములు, ఇట్టివి మఱికొన్ని పదములలోని తునుకలు వెంకటగిరి మొదలగు చోటుల ప్రజాసామాన్యము పలుకుబడులకు గూడా నెక్కినవి.

ప్రఖ్యాతసంకీర్తనకవులు, తాళ్ళపాక అన్నమయ్య, పెదతిరుమలాచార్యుల శృంగారసంకీర్తనములు, సరసని భావతో, సాహిత్యపు బలుపుతో నుండి పండితమాత్రైకవేద్యమై లోకము వెలుగు చూడజాలకపోయినవి. క్షేత్రయపదములు ప్రజాభాషలో ప్రజలకు సన్నిహితములై శృంగారరసమయములయి, యభినయోచితములగుటచే రసికులకు నాస్వాద్యములయి సులభముగా ప్రజాహృదయముల జొచ్చుకొనజాలినవి. మువ్వగోపాలపదములను కళావంతులు పాడి యభినయింపగా నాంధ్రప్రజ రసతన్మయమయినది. క్షేత్రయపదములకు దరువాత ప్రజాహృదయముల జొచ్చుకొనజాలినరచనానైశారద్యముతో, బహుళప్రచారముతో ప్రఖ్యాతి వడసినవి సారంగపాణి పదములు.

కార్వేటినగరమున తత్పరిపాలకు లొసగిన కవిమేరల ననుభవించుచున్న కవివంశ్యులు కవి శ్రీ చెరుకూరు కృష్ణయ్యగారు ఇట్లు వ్రాయుచున్నారు—

"శ్రీ సారంగపాణి యను పదరచయిత ఈగ్రామవాస్తవ్యుడై శ్రీ వేణుగోపాలస్వామి భక్తుడై యుండెను. ఆ పదములను బాడగా నేను కొన్నిట్టిని విన్నానుగాని నాకు బాఠము లేదు.

ఈ పదములకు 'వేణుగోపాలపదము' లను పేర ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములో రెండు వ్రాతప్రతులు కలవు. ఈ పదములు తొలుత ౧౮౭౭వ సం॥న మదరాసులో ముద్రింపబడినవి (చూడుడు భారతి—విరోధి జేష్ఠము) ఈపదములు మరల ౧౮౯౯వ సం॥న మదరాసులో ముద్రింపబడినవి. అందు ముఖపత్రము లో నిట్లున్నది:—

"శ్రీ కార్వేటినగరమందు వెలకొనియున్న శ్రీ మద్వేణుగోపాలనామాంకితంబుగా సంగీత సాహిత్యదేశీయకవిత్వరచనాచమత్కారి యగు సారంగపాణి యను మహాకవిచే రచియింపబడిన సారంగపాణిపదములు. ఇవి ఉప్పల రామానుజాచార్యుల వారిచే బరిష్కరింపబడి యద్దనపూడి సంజీవయ్యగారిచే చెన్నపట్టం పాతచాకలిపేటలో నుండు పమ్మి త్యాగరాయ శెట్టిగారి శ్రీ రాజరాజేశ్వరీనికేతన ముద్రాక్షరశాలయందు ముద్రింపించి ప్రచురింపబడియె. ౧౮౯౯వ సంవత్సరము"

క్షేత్రయ్య మనోహరముగా శృంగారరసమయముగా బదములను రచియింపగా నితడు తన కత్తికి రెండువైపులను పదును కల దని తెలుపుటకుగాబోలు శృంగారపదములను, వేదాంతపదములను విరచించినాడు. అన్నమయ్యకువలె నితడును శృంగారపదముల కున్నంత జిగిబిగులతో, చిన్నెలు వన్నెలతో వేదాంతపదముల విరచింపగలడు. తన వేదాంతపదముల నితడు సంకీర్తనము లని పేర్కొనినాడు. ఈతని పదములు ప్రధానముగా నాలుగు విభాగములుగా విభాగింపబడినవి. ఆ విభాగములు: శృంగారము, దేశీయము, జాతీయము, కీర్తనలు అనునవి. ఇందలి తొలి రెండు విభాగములలోని పదములుగూడ పురుషవాక్యము, స్త్రీవాక్యము, సఖీవాక్యము నను క్రమముతో రచింపబడిన ట్లున్నవి.

సారంగపాణి వైష్ణవుడు. కార్వేటినగరవాస్తవ్యుడు. కార్వేటినగరమున వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి భక్తుడు. కార్వేటినగరసంస్థానాస్థాన కవీశ్వరుడు. సంగీతసాహిత్యదేశీయకవిత్వరచనాచమత్కారి.

ఇంతకుమించి కవీశ్వరునిగూర్చి విశేషము లేమియు దెలియుట లేదు. ఇతని శృంగారపదములలో కార్వేటినగరసంస్థానాధీశ్వరు డగు మాకరాజు ప్రస్తావ మున్నది. అతనిపేర మూడు శృంగారపదములు కలవు. చూడుడు—

శంకరాభరణము — ఆదితాళము

పల్లవి

తేనె లూర మాట లాడకు
తెలిసె నీ నవరు

అనుపల్లవి

మానినీమనోహర శ్రీ సాధుక—
మాకరాజ కార్వేటి రాజేంద్రా...
పండు గనుచు వచ్చాని కడిగితే—
పల్లి పట్టురెండా - నావై
కొంగె కారిమెఱుగు మంచి బంగరు—
గొప్పగుంప్ల దండా
నింకుకొలువులో నీకలించితివా—
నలతకొప్పవిండా—యిక
పుంజకలద యిటుకంటి నేవ్వ—
యేయువిద నెనయుచుండేవదలకుండె...
ఎక్కువైన ముత్యాల పాపట—
యింతి కియ్యలేదాయెనో
లెక్క లాడి నా చేతి కిచ్చినది—
యొక్క చీర గాదా
నక్క వినయములు చేసేవారికి—
చిక్కని మరియాద — నే
నిక్క మేమంచి నోము నోచితే—
నీకేదయరాదా — యికమీద....
మరునికేళి మెప్పించినందుకు—
మగువ కింతధనమా — నా
సరస కేరి యేలుకొమ్మంటే—
సామీదండనమా
అడుగుచేసి యీ నెవిసే పాగడే—
వేరా నెరతనమా తన
వెరటి వెట్టు మందుకు నైకో దని—
పెద్ద లనగవినమా — యిదే ఘనమా....

జనంధశైరవి — ఆదితాళము.

పల్లవి

దాని కొవ్వరు సాటే - ఆ వెలది నీకే
తెరురాజ కిటికే

అనుపల్లవి

మానితవరగుణ సేటే నీపై—
మరులుకొన్నదిరా మాపోటే—యిక నిను
మానదుర భానుసమతేజ -
మాకరాజా కార్వేటిరాజా...
మగువను సఖుల నెన్నుదురు—
మాను నదలించు నెన్నుదురు ఆ
వగలాడిపల్వరుసకుదురు
వజ్రమణు లనుచు పల్కుదురు—యీ
జగతి దాని కెవ్వరు నదురు - విరి—
జాజులంపె నీకు నదురు—మంచి
నిగనిగలు గల మొగుడుతమ్మిల—
దొగడు చనుగవజొగసె తను నిక...
వనజగంధికనులతీరు - చూడ—
వలరాజు చేతికలి తీరు - ఆ
ఘనవేణి మెరుగునూగారు సౌరు—
గణుతింప ఘను లిడుగారు?
నిను రమ్మనె పలుమారు—తూపు—
మొనలకోర్వదు పలుమారు అను
దినమునను చెలిమనము సనువెన—
గొనిత మియింతనగ వశమా...
సుదతి నెన్నగ శ్రీల మిన్నా - దాని స్తనములవైకరి శ్రీలమిన్నా - ఆ
మదవతిలే గౌను సున్నా - నాదు మనవి
వినవా మన సున్నా
బెదరించు కురు లళుల కన్నా - గొప్ప
పిరుదులు చక్రములకన్నా - సామి
అద ని దని మరుకదనమున సతి -
నెనను తమిదలకను గదియర...

శంకరాభరణము - త్రిపుటతాళము

పల్లవి

వలదు యీ మాట లేలరా—మదిహితవైన—
వనితయి ల్లిది గాదురా

అనుపల్లవి

వెలయు శ్రీమాకరాజ వీరకార్వేటరాజేంద్ర
చెలులు దెలుపగ దెలిసె నీ
వగలు చాలు పదివేలు...
కరుణచేతను కోరి— మోహించియా—
కనకాంగి నిను జేరి
మఱిమఱి తమిమీరి— విరహాభరముచే—
తరము గాక తారి మరు బారి
తరుణిసురకుచగిరుల నరమున—
నోరసిమురివిన సరసమెల్లను
మరచి వత్తుర యేర యీ దారి
ఓరోరి ...
సగము నే వేళాయెనే—నీ రాకకై
సఖియ యెదురుజూచురా
తగని ముచ్చట లేలరా—నే నొక టంటె
నగటు బోచదటరా—బాగే నటరా—
మగువతెల్లను నగగ నీ విటు
అగడు సేయగ నగున జిగి బిగి
సొగసు మిగులగ మెనగ గల నటరా—
నన్నంటకురా...
పతితనమును చాల—మెచ్చియుండిన
జాణతనము లేల
పతినాలుకొనే దెలా—వినయములకు నే
నతిజేలనా యిల్లేల—చతురోక్తు లేల
తతిని పలుసుక అతివవలె బహు—గత్తుల
నిన్నుపరతుల—నెనయుచు
సతుల మేలన ఘనుడ నే జాల—నీ చర్యలేల ...
వనజాక్షి పోటు లెవరైనా—యిచ్చటయున్నా
వని దాని సముఖానా
మనవి జేసితైన నెరనమ్మిన
చనవరిసుంతైనా
కొనిసాడునాఅనవుగ ననుదినము యీ
జవ్వనిని గలసినపనులు హాయిలుగ
తనిసియున్నది నీకు మనమునా ...
పలుమారు యెంత కొసరిన—మునుపటివలె నే
బాళితో మన సిచ్చేనా
చెలువు నెనుచు జూచేనా యికమీదనా
యింటజేర రానిచ్చేనా చను విచ్చేనా
తొలుత చెలిమిని కళలు గులుకగ కలసి
మెలసిన వెలవు దలతున
కలపు తెలియని వలపు తగవేనా యేమైనా...

ఈ పదములయందు పేర్కొనబడిన మాకరాజునకు ఇతడు సమకాలికుడు. మాకరాజు నేటి కార్వేటినగరప్రభువునకు నాలుగవతరమువాడట! అగుచో నీ కవీశ్వరుడు సుమారు నూటయేబది యేండ్ల కింకను మునుపటివాడగును. * ఇట్లు సారంగపాణికాలము గుర్తింపనగుచున్నది.

మాకరాజు నాస్థానిలో గవీశ్వరుడుగా రాజసమ్మానము లందుచుండిన యీతడేమి కారణముననో రాజానుగ్రహము కోలుపోయినాడు. రాజాగ్రహమునకు బాలుపడి యనేక కష్టము లనుభవించి యుండవలెను! శృంగారపదముల విరచించుచు నంతదనుక రాజానుగ్రహముతో హాయిపచ్చిసుగా దిరుగుచుండిన యీతడు ఐహికవిముఖుడై శృంగారపదరచనము మాని భక్తియుతుడై కీర్తనముల రచింపదొడగినాడు. ఆ కీర్తనములలో దన పూర్వజీవితమును పేర్కొనుచు నవుడు తాను తెలియక చేసిన పాపములకై విలపించి చూడుడు.

అసావేరి - త్రిపుటతాళము

పల్లవి

నీ దివ్యమంగళమూర్తి ధ్యానము భక్తి
నిత్యము కృప సేయవే

అనుపల్లవి

వేదోద్ధారకుడైన వేణుగోపాల నీ
పాదద్వంద్వము నా హృత్పద్మమందున జేర్చి—
పుట్టిందిమొదలుగ భూపాలకుల గొలిచి—
పట్టెడన్నానికై పరుగులెత్తి—
పొట్టనింపక మతిలో పొంగుచుంటినిగానీ
పట్టుగ నొకనాడు ప్రద్యుమ్న యన నైతి...
నరక హేతువులైన దురితకృత్యములకు
నురగి కండ్లకావరమున
పరకాంతల మోము లరసి భ్రమసితిగానీ
పురుషోత్తమ నీపై బుద్ధి నిలుపనైతి.
పరమభాగవతుల ప్రల్లదముల పల్కి—
గురువుల నిందించి కుటిలుడనై

(22 వ పేజీ చూడుడు)

* మాకరాజు నేటి కార్వేటినగరప్రభువునకు నాలుగవతరమువా డని వినికినిబట్టి వ్రాయబడినది. మాకరాజు కాలమునుగూర్చి నిశ్చయపరిజ్ఞానము కలవారు దెలుపుదురుగాక!

విలువ తగ్గింపు

శ్రీమతి వేదుల మీనాక్షీదేవి

క్రిందటి నెల (సెప్టెంబరు) 19 వ తారీకునుండి ఇంగ్లీషువారు వారి పౌనువిలువ తగ్గించినట్లు బ్రిటిష్ ఆర్థికమంత్రి "క్రిప్స్" తెలియజేశారు. ఇలాగే 1931 వ సంవత్సరం సెప్టెంబరు 21 వ తేదీన పౌనువిలువ తగ్గించారు. ఆర్థికపరిస్థితి తిన్నగా లేకపోవడమే దీనికి కారణం. నానాటికీ జనులు రాజకీయ విషయాలయందు ఆసక్తిచూపడం ఎక్కువైంది. అందుఅయినా కాకపోయినా పేపరు చూడనివాళ్లూ, అందులో విషయాలు చర్చించనివాళ్లూ (యథాశక్తిగానే అనుకోండి) లేరనే చెప్పవచ్చు.

ఈ విలువతగ్గింపువిషయం మొట్టమొదట రేడియోద్వారా విన్నాం. తరువాత పేపరులో చదివాం. అది మొదలు యే చిన్నపత్రికలో చూసినా యీ గొడవే.

సెప్టెంబరు 19, 20, 21 వ తారీకులలో బాంకులు కట్టేశారు దేశంఅంతటా. అందువల్ల జనం చాలా ఖంగారుపడ్డారు.

"మూడురోజులే కడతారు; తరువాత మామూలుగా తీస్తారు" అన్నారొకరు.

"మూడురోజులే అంటారుగాని అసలు తియ్యనే తియ్యరు" అన్నారింకొకరు.

"డబ్బు వెయ్యవచ్చునుగాని తియ్యకూడదుట" అన్నారు మరొకరు.

"బాంకులు తీసినా డబ్బివ్వరుట. గవర్నమెంటువారు తీసేసుకుంటారుట" అన్నాడొక పెద్దమనిషి.

"నూరురూపాయిలనోట్లు చెల్లవుట. మన దగ్గరవున్న నోట్లు యేం చేసుకోం? దగ్గరవుంచుకుంటే చెల్లవంటారు. బాంకులో వేస్తే యివ్వరు. ఏంచెయ్యడం?" అని ఖంగారుపడ్డాడొక ధనవంతుడు.

"పోనీ వేసుకోవద్దంటే వేసుకోం. కాని వేసిన డబ్బు యివ్వకపోతే గతేమిటి?" అని బాధపడ్డాడొక కుటుంబీకుడు.

బజారులో వెండి బంగారు కొట్లు జనంతో చాలా రద్దీగా వున్నాయి. ధరలు పెరిగిపోతాయిట. వెండి బంగారాలు యిప్పుడు కొని ధరలు పెరగగానే అమ్మి లాభాలు సంపాదిద్దామని వర్తకులు రెండు రోజులు అదేపనిగా కొన్నారు. తరువాత ఆ వేడి తగ్గింది.

ఇంగ్లీషువారి పౌనువిలువ తగ్గించడంవలన మనం మన రూపాయివిలువ తగ్గించవలసివచ్చింది. ఒకానొకప్పుడు రత్నగర్భ యని పేరుపొంది, పాడిపంటలతో సకల సంపత్సమృద్ధిపై అన్ని దేశాలకు ఆకర్షణీయమైన మనదేశం, నానాడు తన సర్వస్వము కోల్పోయింది. చాలాకాలం బానిసత్వంలో మ్రగ్గి, స్వయంకృషివల్ల స్వాతంత్ర్యం పొందగలిగింది. కాని, యింకా కొంతకాలం ఆ బానిసత్వపు ఛాయలు వదలక బాధిస్తూంటాయి. తన ఆర్థికదుస్థితివల్ల స్వతంత్రించి తన రూపాయివిలువ తగ్గించకుండావుండడానికి వీలులేకపోయింది. స్టర్లింగు ప్రాంతాల దేశాలతో చేతులు కలపవలసివచ్చింది. స్టర్లింగు ప్రాంతాలు విలువ తగ్గించినప్పుడు ఈ దేశంకూడా తన రూపాయి విలువ తగ్గించవలసి వచ్చింది. అందుచేత నూటికి $30\frac{1}{2}$ వంతున తగ్గించింది. ఈ తగ్గింపు యింకా తగ్గించవలసిందని కొందరు, నూటికి 10 వంతున తగ్గిస్తే సరిపోను. బాగా తగ్గించేశారని కొందరు అంటున్నారు. ఇది వ్యాపారసంబంధమైన తగ్గింపు.

ఈ విషయం ఆర్థికశాస్త్రం చదివినవారికి యింకా బాగా తెలుస్తుంది. సామాన్యప్రజలకు తెలియడం అంత సులువు కాదు. అసలు విషయం తెలుసుకుందామనే కుతూహలం బదులు పుకార్లను విని భయపడ్డం యెక్కువైపోయింది ప్రజలలో.

"రూపాయి విలువ తగ్గించారు. అంటే రూపాయికి 16 అణాలుయివ్వరుట. 10 అణాలే యిస్తారుట" అనేవార్త అంతటా పాకిపోయింది. ఈవార్త పనివాళ్లమొదలు పెద్దపెద్దవాళ్లవరకు చాలాఖంగారుపెట్టింది.

"రూపాయివిలువ తగ్గింది కనుక వెనుకటియంతజీతం అవడానికి మాజీతాలు హెచ్చిస్తారు" అన్నాడొక కాలేజీవిద్యార్థి.

"రూపాయివిలువ 10 అణాలేకనుక యెన్ని రూపాయిలజీతం అయితే అన్ని పదిఅణాలు యిస్తారుట" అన్నాడొక స్కూలు మేష్టరు. "యిదివరకే జీతం చాలడంలేదు సంసారానికి. తగ్గిస్తే యెల్లాబ్రతకడం" అని బాధపడుతూ.

"బాబూ! యేంటండీ రూపాయియిలువ తగ్గించిరుట. 10 అణాలే యిస్తారంట. మాలాంటోళ్లం యెల్లా బతకం బాబూ? అంటూ వాపోయాడొక రిక్షావాడు, రిక్షాలో కూర్చున్న ఆసామీతో.

"తగ్గితే నీకొక్కడికే తగ్గదురా. తగ్గితే అందరికీ తగ్గుతుంది భయపడకు" అని ధైర్యం చెప్పాడాయన.

"రూపాయివిలువ తగ్గితే మనం దెబ్బతింటాం. టిక్కెట్టువొక్కింటికి 2 అణాల చొప్పున హెచ్చిస్తే సరిపోతుంది" అని మనసు కుదుటపరచుకున్నాడొక సినిమా ప్రొప్రైటరు.

"సెట్టిగారూ! రూపాయి విలువతగ్గిపోయిందనుకుంటున్నారే నీ వ్యాపారానికేమీ ధకవాలేదు కదా?" అన్నాడొక షావుకారుతో సరుకులు కొనడానికి వచ్చిన వొక వ్యక్తి.

"అబ్బే, మన కలాంటి కత రారు లెప్పుడూ రావు. మన యాపారం తగ్గడం అనేది వుండదు. నష్టం అంతకన్నా వుండదు. మనం వొకరికి లొంగం వొకరి ననం. వొకరిచేత అనిపించుకోము. ఇంతగాక యింతవచ్చినా సరే మన దేశ దెబ్బలు మనకి రాకపోవు" అన్నాడు బలేధీమాగా ఆ షావుకారు.

"అమెరికనువస్తువులే వాడకం అలవాటు. ఈ డివాల్యుయేషన్‌వల్ల ఆ వస్తువులు చాలా ప్రియమైపోతాయి. తక్కువధరకు దొరుకుతుండగా యెక్కువధరపెట్టి కొన బుద్ధి పుట్టదు. ఏంచెయ్యను?" అని బాధపడుతున్నాడొక విలాసపురుషుడు.

ఈ విలువతగ్గింపు ఒకసాకుగా తీసుకుని ప్రభుత్వాన్ని ప్రభుత్వవిలువ తగ్గించడానికి చర్చిల్ వంటి ప్రతిపక్షసభ్యులు ప్రయత్నిస్తూంటారు. మొన్న పార్లమెంటులో అతనంటాడూ "పౌను విలువ నిలబెట్టలేని ప్రభుత్వం, దేశం విలువ యేం నిలబెడుతుంది? కనుక వెంటనే రాజీనామా నిచ్చి, అందుకు తగిన (నాబంటి)వారికి ప్రభుత్వం అప్పగించి తప్పుకోవాలి" అని.

ఇల్లాగే వెనక 1931 లో పౌనువిలువ తగ్గినప్పుడు పెద్దలెక్క సమీటింగులో ప్రతిపక్షానికి చెందిన ఒకడు జేబులోంచి పౌనునోటు తీసి ప్రజలకు కనబడేట్టు వూపుతూ "మహాజనులారా! ఈ పౌనునోటు చూడండి. ఇది 20 షిల్లింగు లన్నిపా అభిప్రాయం. కాని, నిజంగా దీని విలువ 15 షిల్లింగులు మాత్రమే" అన్నాడు. ఆ సభ్యులలో ఒకపక్కగా కూర్చున్న ఫేక్టరీకార్మికుడొకడు "$15\frac{1}{2}$ షిల్లింగు లిస్తాను. ఆ నోటు గిరవాటు వెయ్యండిల్లాగ" అని అడిగాడు. తన మాట నిజం కాదు. ఆ ప్రకారం పౌనుకి $15\frac{1}{2}$ షిల్లింగులు పుచ్చుకున్నా యింకా $4\frac{1}{2}$ షిల్లింగులు తక్కువ వస్తాయి అని చల్లగా అవతలికి జారాడు ఆ పెద్దమనిషి.

ఆర్థికవిషయం తెలిసినవారెవరా? అలాంటివాళ్లనడిగితే అసలు విషయం తెలుస్తుం"దని ప్రతీవారికీ తోచకమానదు. అలాంటి వ్యక్తి కనబడగానే నలుగురు విద్యార్థులు జేరి "డివాల్యుయేషన్ అంటే యేమిటండీ?" అని అడుగుతారు. వాళ్లకి చెప్పి అల్లా షికారుగా క్లబ్బుకి వెడితే అక్కడ జేరిన పెద్దమనుష్యులూ అదే ప్రశ్న. రాత్రివేళ యింటికొస్తూంటే పరిచితుడైన ముసలాయన ఒకరు "నాయనా డివాల్యు

(20-వ పేజీ చూడుడు)

మాండలికములు - పదముల పరిణామము

శ్రీ ఆదిభట్ల వేంకటరమణ

ప్రతిభాషకు మాండలికము లేర్పడుతూ ఉంటాయి. ఒకేభాషను ఆయామండలాలలో మాటలాడితే ఆ మండలభాషను "మాండలిక భాష" అని అంటారు. కాలపరిస్థితులు భాష నెక్కువగా మార్పుస్తాయి. భాషఎప్పుడు శక్తివంతమై ఉంటే ప్రజలు అప్పుడు శక్తివంతులు కాగలరు. భాష మడికట్టుకొని "నన్ను ముట్టుకోకు నామాలకాకి" అన్నట్లు కూర్చుంటే ప్రజలు ఒకరికొకరు దూరమైపోతారు. అందుకే సజీవ భాష ఎప్పుడూ తనతో ఇతర భాషాపదాలనే స్వీకరిస్తుంది. ఇతరపదాలను కలుపుకోకపోతే భాష విస్తృతం కాలేదు. భాష విస్తృతం కాకపోతే మాండలికపదాల అవసరమే కలుగదు.

భాషలో చలనం లేనప్పుడు ఆ భాషకు మాండలికము లేర్పడవంటే ఒప్పుకొంటారు కాని, భాష సచలనమయినప్పుడు మాండలికములు తప్పక ఏర్పడుతాయి. అసలు భాషకు చలనం లేకపోవడమంటూ ఉంటే కదా మాండలికము లేర్పడకపోవడానికి ?

అసలు భాష నదివంటిది. కొత్తనీరు పాత నీరును కొట్టుకొనిపోవునట్లు క్రొత్తభాష పాత భాషను కొట్టుకొని పోతుంది. క్రొత్తనీరు వచ్చినప్పుడు పాతనీటికోసం ఎలాగ విచారించమో ఆ విధంగానే కొత్తభాషను చూసి పాతభాషను తలచుకొనకపోవుట సంభవమే కాని, సహజం కాదు. పాత నీటి రుచికి అలవడిన ప్రజలు క్రొత్తనీటిరుచిని వెంటనే ఆమోదించలేని మాట నిజమే. మడికట్టుకొని ఒక్కటే సహజస్వరూపమనుకొన్న సంస్కృతిభాషలోనే మాండలిక పదా లేర్పడ్డాయి. వేదకాలమునాటి సంస్కృతమును "సంస్కృతభాష" అనరు. దానిని వైదికభాష అంటారు. వేదములకు పురాణములు, శాస్త్రములు మాండలికభాషలై కొంత కాలానికి సహజస్వరూపము నేర్పరచుకొన్నాయి. తరువాత కావ్యవాఙ్మయమంతా వైదికభాషకంటె విలక్షణమైన భాషగా ఉంటుంది.

అసలు మండలము అంటే మనం జిల్లా అని వాడతాము. ఒకప్పుడు పొరపాటున మాది "విశాఖమండలము" మాది "నెల్లూరు మండలము" అన్నామంటే ఎదుటివారికి అర్థం కాకపోవచ్చు. ఎందుచేత ? మన భాష ఒక్కటే కాదు. ఇతర భాషలన్నీ తన దేశీయపదాలను కలుపుకొంటాయి. అందువల్ల మనం మన సంస్కృతిలో నుద్భవించిన "మండలము" అనే పదాన్ని విడిచి ఉరుదూశబ్దమైన "జిల్లా" అని వాడతాము. అప్పుడు "మాది విశాఖజిల్లా, మాది నెల్లూరుజిల్లా" అన్నామంటే వెంటనే అర్థమౌతుంది. అయితే "జిల్లా" అంటే "మండలము" అనేవాడుకలో ఈ తెనుగు ఎలాగ ఏర్పడిందా ? అన్న ప్రశ్న.

అసలు భాష తన ఆదినుండీ మాండలికములను కల్పించుకొనడం సహజమయిపోయింది. ఈ మాండలికములు హిందీలోను, సంస్కృతంలోను, ఇంగ్లీషులోను కూడా మాండలికాలున్నాయి. భాష నదివంటిదని మనవి చేశాను. నది తనఒడ్డును కొట్టి వేస్తుంది. తనకి ఉన్న అడ్డుని సహించలేదు. తనలో కలుపుకొంటుంది. తనకేదైనా అడ్డు వస్తే దానితో పోట్లాడి తెంపివేయడానికే చూస్తూఉంటుంది. ఆవిధంగానే భాషకూడా తనకి అడ్డువచ్చిన పదసముదాయాన్ని తనలో కలుపుకొంటుంది. శాస్త్రరూపమైనవిధిని తనకి అడ్డుగా భావించుకొని, ఆ శృంఖలాలను తెంపుకొందికి ప్రయత్నిస్తుంది. భాష ఎక్కడివరకు వ్యాపించి, తన విస్తృతాన్ని చాలించుకొంటుందో అక్కడే తన ఒడ్డుని కల్పించుకొంటుంది.

లేకపోతే పవిత్రవంతమైన భాష, ఆర్యనాగరకత నూరీభవించిన సంస్కృతవాఙ్మయం మాత్రం తనకి అడ్డువచ్చిన శాస్త్రాన్ని అతిక్రమించలేదూ ? లేకపోతే "అచతుర విచతుర" అనేసూత్రం వృషోదరాదిగణం, పేచోషాదిక శబ్దనిపాతనాన్ని మహాశబ్దలిదులైన మునిత్రయం అంగీకరిస్తారా? పేచ, ఉష మొదలైనశబ్దాలను కొందరు ప్రయోగించేరు. ఎందుచేత ? వారికాలంలో అవి మాండలికాలు కాబట్టి. పాణినివంటిభాషాకోవిదు డింక లేడని ఒప్పుకొంటారు కద? అత నేర్పరచిన భాష మాండలికరూపాలను పొంది, తన శృంఖలాలను చెల్లాచెదరు చేసికొంది.

అంతేకాదు. కాళిదాసు తన కాలంలోను, కావ్యాలలోను మాండలికపదాలను వాడలేదని ఎవరైనా అనగలరా? కాళిదాసు మాండలిక పదాలను వాడితే మల్లినాథ పండితుడు "మండలభాష" అనక "ఛాందసో మహాకవిప్రయోగాదభియుక్తైరంగీకృతః" అంటాడు. ఇక్కడ సూరి తత్వదృష్టితో భాషకు అప్రాధాన్యమిచ్చేడా ? లేక భౌతికదృష్టితో కవిలోకాన్ని ఆదరించేడా? అన్న ప్రశ్న పండితులది. కవికి తాత్వికునకు ఇక్కడే పోటీ జరుగుతుంది.

"కవికి తాత్వికునకు కయ్యంబు సాగెను
బహుదినాలు వాక్ప్రపంచమందు
రాగరక్తు డొకడు, రాగముక్తు డొకడు
సగుణనిర్గుణముల సఖ్య మెట్లు ?"

ఇక్కడ ప్రయోగంలో కించిత్తు వ్యత్యాసముంటే మండలప్రయోగమంటే పండితుడు లోకాని కుపకారం చేసినవాడయి ఉండును. ఒక ప్రయోగంలో కించిత్తుభేద మంటే అది మహాకవిప్రయోగం అనేకంటే "మాండలిక భాష" అంటే తప్పేముంది. కాళిదాసుకాలానికి, వ్యాఖ్యానకారుడు చాలా దూరంవాడు. అయినప్పుడు కవికాలంలో మాండలికపదాలను వ్యాఖ్యాత అర్థం చేసికోవడం న్యాయం. కవి తన దృష్టిలోనున్న వాఙ్మయప్రపంచంలో విహాయసవీధిలో ఎగురుతూ క్రొత్త భాషని సృష్టించుకొంటాడు. అప్పుడనేక పదాలు దొర్లిపోవచ్చు. "ప్రకృతికిన్ భాష్య ప్రణేత లో కవుల్" కాళిదాసుకాలానికే "త్ర్యయంబక, త్ర్యంబక" శబ్దాలు మాండలికత నేర్పరచుకొని ఉంటాయి అందులో నొక్క "త్ర్యంబక" శబ్దమే వాడుకలో నుండవచ్చు. లేకపోతే యణాదేశం చేయవలసినచోట ఇయజాదేశం చేసి ప్రయోగించునంతటి అపండితుడు కాళిదాసు కాడు. పోనీయండి, ఎంతైనా "తం పాతియాం (ప్రథమ)మాస" అని ధాతువుని విరిచివాడేటి వైయాకరణఖసూచి కాళిదాసు కాడుకద? అతని కాలానికి ధాతువుని విరిచివాడడం వాడుకలో ఉండియుండాలి.


విశాఖపట్నంజిల్లావారు "వెళ్లిపోయినాడు" అని వాడతారు. రెండు సమానార్థకధాతువుల మీద రెండుక్త్వార్థాలను వాడతాము. అయితే ఇది వ్యాకరణదుష్టమే కాని, మాండలికభాషా పరిణామాన్ని వాడుకలో అడ్డగలమా ? కాళిదాసుయొక్క భాష ఆనాటిభాష కుత్తేజితము. కాబట్టే భవభూతిని పండితు లపార్థం చేసికొన్నట్లు కాళిదాసుని అపార్థం చేసికోలేక పోయేరు.

ఇంతకి మాండలికభాష అవసరమా ? భాషాకోవిదులంతా మాండలికపదా లేర్పడడానికి కారణం ఏమిటా ? అని తర్జనభర్జనలు చేసేరు. తరువాత అప్రయత్నంగా జనశ్రుతివల్ల నేర్పడిన ప్రజల వాడుకభాషలో నిమిడిపోయే రూపాలే ఆ రూపాన్ని చెందేయని ఒక నిర్ణయానికి రాగలగేరు. భాషలో శబ్దస్వరూపం సహజంగా మారిపోతుంది. ఒక భాషనుండి ఒక పదాన్ని తీసికొని వాడుకొన్నామంటే, ఇంకొక భాషలోకి పదం వచ్చే సరికి అర్థం మారిపోతుంది. అదెక్కువగా సంస్కృతభాషలోను, తెనుగు భాషలోను కనిపిస్తుంది. "నా కా పని చేయుటకు అభ్యంతరము లేదు." ఈ అభ్యంతరము అనే మాటను "అడ్డు" అనే అర్థంలో ఉపయోగిస్తాము. సంస్కృతభాషలో "ఆతంకము," లోపలిభాగము; దగ్గర అనే అర్థాలలో వాడతాము. తెనుగులో 'మర్యాద,' అనే పదాన్ని గౌరవము అనే అర్థంలో వాడతాము. సంస్కృతంలో "కట్టుబాటు" "మేర" అనే అర్థాలలో వాడతారు. తెనుగులో "కమండలము" అనే శబ్దం అకారాంతము. సంస్కృతంలో "కమండలువు" ఉకారాంతశబ్దము. సంస్కృతంలో "అక్షతలు" అని వాడతాము. తెనుగులో "అక్షింతలు" అని వాడతాము. సంస్కృతంలో "అధ్వర్యుడు" అనగా యజుర్వేదమును తెలిసి యజ్ఞమును చేయువాడు. తెనుగులో "అధ్వర్యుడు" అనగా వేరు అర్థం వస్తుంది. "ఖాన్ సాహబుగారి అధ్వర్యమున నేటి సభ జరిగినది" ఇచ్చట ఖాన్ సాహబుగారికి యజుర్వేదసంబంధము లేదుకదా! అంటే అర్థం మారినప్పుడు పదస్వరూపం మారడం మంచిదేకదా ?

అయితే నెల్లూరు మండలంలో "నీళ్ల చేదురా" అంటారు. చేదుట = తోడుట. చేద నీళ్లు తోడుకొనెడి బాల్చీ క్రింద అందరూ వాడతారు. చేదనామవాచకమయితే "చేదుట" అనే క్రియ నామవాచకంనుండి బయలుదేరింది. తెలంగాణావారి తెనుగు మరీ విచిత్రంగా ఉంటుంది. "ఈ సాలు బహుత్ నుక్సానైందిరా" అంటారు. సాల్ = సంవత్సరము (హిందీ) నుక్సాన్ = నష్టము. ఇది మాండలిక ప్రమాణం కాకపోయినా ఇతరభాషాపదాలు తెలుగులో కలిసిపోయేయి, ఇప్పటి "సోడా, లాంతరు, తహశ్శీలారు" మొదలైనపదాలలాగే ఈ పదాలు కూడా కొంతకాలానికి తెలుగులో సొంతమై పోతాయి.

ఒకొక్కమండలం తన భాషలోపదాలన మార్పుచేస్తూ ఉంటుంది. ఒక మండలంవారి భాష ఇంకొకమండలంవారి కర్థం కాకపోవడం సంభవమే. అర్థం కాకపోయినంతమాత్రంచేత భాష ఒకటి కాదనలేముకదా! ముఖ్యంగా మాండలికాలు ఏర్పడడానికి కారణం ఒక్కటి. ఒకరికి చుట్టుపట్ల అన్యభాషాసంపర్కం వల్ల పదాలు అనుశ్రుతంగా మారిపోయి ఉండవచ్చు. లేదా ? ఇతరభాష మాటలాడువారు ఆ మండలంలోనుండి కొన్ని మాటలను బీజారోపం చేయడంవల్ల కూడా భాష మాండలికముల నేర్పరచుకొనవచ్చు. ఇప్పుడు కొందరు విశాఖపట్నం జిల్లావారు గోదావరిజిల్లాకు వచ్చి, తమ మాండలికపదాలను గోదావరిజిల్లాలో విత్తనం వేయడంవల్ల కొంతకాలానికి ఆ పదాలనే ఆ మండలం సొంతంగా వాడుకొనడం సంభవించింది. ఇప్పటికి గోదావరిజిల్లావారు విశాఖజిల్లావారిని "*East India company*" వారు అంటారు.

ముఖ్యంగా మాండలికాలు ప్రజల ఉచ్చారణలోపడి క్రమేణా ఒక స్థిరస్వరూపం ఏర్పరచుకొని భాష విస్తృతం చేస్తాయని గ్రహించాలి.



పుష్పగిరికి సమీపముగా కర్నూలు-కడప కాలువకు వరదలవల్ల గండ్లు పడిపోయినందున చెన్నూరు, ఆ పరిసరముల గ్రామములలో యుండు ప్రజలెల్లరు పానకాలవంకదగ్గఱ బాగుచేయుచున్న దృశ్యము.

మనదేశం: మనరాష్ట్రం:

కొత్తపాతల కలయికల కాలంలో

భారత రాజ్యాంగ స్వరూపము

[పాత రాజ్యాంగచట్టం అంతరించి, కొత్త రాజ్యాంగచట్టం అమలులోకి పూర్తిగా వచ్చేలోపుగా ఐదేండ్ల పర్యంతందాకా శాసనసభలకు, పరిపాలన వ్యవహారాలకు సంబంధించిన కొన్ని నిబంధనలను భారత నూతన రాజ్యాంగ చట్టంలో నిర్వచించుకొన్నారు. రాజ్యాంగ పరిషత్సభ, ఈ విషయమునకు సంబంధించిన క్రింది సంఖ్యల నిబంధనలను ఆమోదించింది. ఆ నిబంధనల చర్చను ఇక్కడ పొందుపరుస్తున్నాము.]

306 నిబంధన

కొత్త రాజ్యాంగవిధానం అమలులోనికి వచ్చిన తేదీ మొదలుకొని 5 సంవత్సరములవరకు యీ క్రింద పేర్కొనబడిన అంశములు రాష్ట్రములకు కేంద్రమునకు సంబంధించిన సమష్టి వ్యవహార విషయముల జాబితాలో చేరియున్నట్లుగానే భావించి ఇండియాపార్లమెంటు అట్టి వ్యవహారవిషయములందు అవసరమైన చట్టమును శాసింపవచ్చును. ఆవిషయము లెవ్వియనగా! నూలుబట్టలు, ఉన్ని బట్టలు, ముడిపత్తి, ప్రత్తిగింజలు, న్యూస్‌ప్రింటుతోసహా కాగితములు, భోజ్యతైలములతోసహా ఆహార పదార్థములు, నేలబొగ్గు దానితో చేసిన తత్తుల్య పదార్థములు, ఇనుము, ఉక్కు, అభ్రకం, యీ వస్తువుల వ్యాపారవాణిజ్యము ఉత్పత్తి సరఫరాయున్నూ ఆ వ్యవహారములగూర్చియు, ఆ వ్యవహారములకు సంబంధించిన రుసుములున్నూ కాని, ఏ కోర్టులోనైనను తీసుకోబడిన రుసుములు జాబితాలో చేరవు. ఈ నిబంధన ననుసరించి సదరు వ్యవహారాంశములకు సంబంధించిన ఏ చట్టమునైనను పార్లమెంటు శాసించేయెడల పైజెప్పినటుల గడువు ముగియగానే అట్టి చట్టము అమలులో నుండక అంతరించును. కాని సదరు చట్టము అంతరించకపూర్వమే చేయబడిన లేదా చేయక విడిచిపెట్టబడిన వ్యవహారవిషయములకు మాత్రము అట్టి చట్టసమాప్తి వర్తించనేరదు.

పరిషదధ్యక్షులైన డా॥ రాజేంద్రప్రసాదు గారు, పై జాబితాలో తెలగపిండి మొదలైన గానుగపిట్టులనుకూడా చేర్చవలెనని కోరిరి. హృదయనాథ కుంజ్రూగారు, కట్టెబొగ్గులను కట్టెలనుకూడా చేర్చవలెననిరి.

డా॥ అంబేద్కరుగారు - యీనిబంధనను పరిశ్రమల సప్లయిల శాఖామంత్రిగారితో సంప్రతించి తయారుచేసినది. వ్యవసాయశాఖ మంత్రితోను, పరిశ్రమలశాఖామంత్రితోను కలిసి సంప్రతింపులు జరిపి అవసరమైతే మరి కొన్ని అంశములను చేర్చగలము. పెట్రోలును, పెట్రోలు సంబంధమైన వస్తువులను సమష్టి జాబితాలో రాజ్యాంగచట్టమునందు స్థిరంగా చేర్చబడెను. మోటారుబండ్లుకూడా చేర్చబడెను. కనుక ఆ రెండింటిని యీ తాత్కాలిక సమష్టి జాబితాలో చేర్చలేదు.

పి. యస్. దేశముఖుగారు రెండు సవరణలను ప్రతిపాదించిరి కాని రాజ్యాంగ రచనాకమిటీ ఇష్టాయిష్టములకు విడిచిపెట్టిరి.

బ్రిజేశ్వరప్రసాదుగారొక సవరణ ప్రతిపాదించుచు యీ తాత్కాలికపరివర్తనాధికారము 15 సంవత్సరాలవరకు ఉండవలెననిరి. 5 సంవత్సరాలలో దేశమునందలి ఆర్థికదురవస్థలను గవర్నమెంటు తొలగింపజాలరనియు 15 సం॥ల వరకు యీ అధికారములు సమష్టి జాబితాలో యుండవలెననియు వాదించిరి.

శిబ్బన్‌లాలు సక్సేనాగారు అంబేద్కరుగారు ప్రతిపాదించిన నిబంధనను ఆమోదించిరి. కాని 5 సం॥ల గడువు చాలదనిరి. డా॥ అంబేద్కరుగారు బ్రిజేశ్వరప్రసాదుగారి సవరణను అంగీకరింపజాలనని చెప్పిరి. 306 నిబంధన అంబేద్కరుగారు ప్రతిపాదించినవిధంగా ఆమోదింపబడెను.

309 నిబంధన

అటుపిమ్మట 309 నిబంధన చర్చ లేకుండానే ఆమోదింపబడెను.

ఇప్పుడు ఉద్యోగపదవులయందు ఉన్నటువంటి సివిలు క్రిమినలు రెవిన్యూన్యాయవిచారణ, న్యాయనిర్వహణ, మంత్రివర్గ శాఖల ఉద్యోగులు అధికారులు అందరును కొత్త రాజ్యాంగచట్టంక్రిందకూడా పనిచేయుచునే యుండగలరు. అని యీ 309 నిబంధనయందు కలదు.

310 నిబంధన

310 నిబంధనతర్వాత 310 (ఏ) నిబంధనయున్నూ 310 (బి) నిబంధనయున్నూ చేర్చవలెనని డా॥ అంబేద్కరుగారు ప్రతిపాదించిరి. కంట్రోలరు అండ్ ఆడిటరు జనరలు ఆఫ్ ఇండియా విషయమున్నూ పబ్లికు సర్వీసుకమిషనలవిషయమున్నూ యీ నిబంధనలయందు చెప్పబడెను.

ఇప్పుడున్న ఆడిటరు జనరలు ఆఫ్ ఇండియా కొత్తరాజ్యాంగంక్రిందకూడా పని చేయుచుండవచ్చును. ఈ రాజ్యాంగచట్టంలోని 124 (2) నిబంధనప్రకారము ఆయనకు నిర్ణయింపబడిన పింఛను, సెలవు ఇవ్వబడును. రూల్సుప్రకారంగా నిర్ణయింపబడిన ప్రకారము ఆయన ఉద్యోగకాలపరిమితి ముగియువరకు ఆయన అధికారపదవిలో ఉండవచ్చును. అని 310 (ఏ) నిబంధనలో కలదు.

ఇందుకు పంజాబురావుదేశముఖుగారొక సవరణ ప్రతిపాదించిరి. కాని యీ సవరణ డా॥ అంబేద్కరుగారు అనవసరమని చెప్పిరి. సవరణను వోటుకుపెట్టలేదు. 310 (ఏ) నిబంధన ఆమోదింపబడెను.

ఇప్పుడున్న పబ్లికు సర్వీసుకమిటీలు తమకు ఇప్పుడు వర్తించుచున్న రూల్సుప్రకారంగా ఎంతకాలం అధికారము వహించియుండవలెనో అంతకాలము కొత్త రాజ్యాంగముక్రింద కూడా పనిచేయుచుండవలెను. అని 310 (బి) నిబంధనలో నిర్వచింపబడెను. కేంద్రప్రభుత్వమునకు సంబంధించిన పబ్లికు సర్వీసుకమిటీనిగురించిన వాక్యమొకటియును ఆయా రాష్ట్రములకు సంబంధించిన పబ్లికుసర్వీసు కమిటీలగురించిన వాక్యమొకటియును యీ నిబంధనలో కలవు.

ఈ నిబంధనకూడా పరిషత్తులో ఆమోదింపబడెను.

311 (ఏ) నిబంధన

311 నిబంధన తరువాత 311 (ఏ) నిబంధనయొకటి క్రొత్తగా చేర్చవలయునని డా॥ అంబేద్కరుగారు కోరిరి. ఈ నిబంధన యీ క్రింది రీతిగా నున్నది.

(1) క్రొత్త రాజ్యాంగచట్టములోని 1 అధ్యాయంలోని 5 భాగంలోని నిబంధనల ననుసరించి ఇండియా ప్రభుత్వాధ్యక్షుడు ఎన్నుకోబడువరకును, ఈ రాజ్యాంగపరిషత్తుచే ఎన్నుకోబడు ప్రెసిడెంటు తాత్కాలిక ప్రెసిడెంటుగా యుండవలెను.

(2) ఈ తాత్కాలిక ప్రెసిడెంటు స్వర్గస్థుడగుటవల్లగాని, రాజీనామా నిచ్చుటవల్లగాని, తొలగింపబడుటవల్లగాని, ఖాళీ ఏర్పడితే ఈ రాజ్యాంగచట్టంలోని 311 నిబంధన ననుసరించి ఇండియా పార్లమెంటు మరొక కొత్త ప్రెసిడెంటును ఎన్నుకోవచ్చును. అట్టి కొత్త ప్రెసిడెంటు ఎన్నుకోబడేవరకు భారతదేశపు ప్రధాన న్యాయమూర్తియే ప్రెసిడెంటుగా వ్యవహరించవలెను.

డా॥ అంబేద్కరుగారు యీ నిబంధనకు మూడు సవరణలను ప్రతిపాదించిరి. "తాత్కాలిక" అధ్యక్షుడు అనే మాటను ఎత్తివేసి "పరిషత్తుచే యెన్నుకోబడిన అధ్యక్షుడు" అనే మాట చేర్చవలెననిరి.

అంబేద్కరుగారి సవరణ బాగున్నదని ఆర్. కే. సిధ్వాగారు హర్షించిరి.

"పార్లమెంటు అనే పదమునకు ముందు "తాత్కాలిక" అనే మాటను తీసివేయవలెనని ప్రొఫెసరు సక్సేనాగారు సవరణ ప్రతిపాదించిరి. కాని, యీ సవరణ అనవసరమనియు "తాత్కాలిక" అనే పదము అక్కడ రాజ్యాంగ చట్టపు భాష ననుసరించి ఉండవలెననియు అంబేద్కరుగారు సమాధానం చెప్పిరి. 311 (ఏ) నిబంధన అంబేద్కరుగారు ప్రతిపాదించిన విధంగానే ఆమోదింపబడెను.

311 (బి) నిబంధన

కొత్త రాజ్యాంగ మంత్రివర్గముగా తాత్కాలిక ప్రెసిడెంటు నియమించెడివారే మంత్రివర్గముగా నుండగలరు. అట్టి నియామకము జరిగేవరకున్నూ ఇప్పటి ప్రాత రాజ్యాంగ చట్టము క్రింద ఇండియా ప్రభుత్వ మంత్రులుగా వున్నవారే కొత్తరాజ్యాంగముక్రింద మంత్రులుగా నుండగలరు.

పై నిబంధనలో కూడా "తాత్కాలిక" ప్రెసిడెంటు అనుమాటలో తాత్కాలిక అను మాటను తీసివేయవలెనని డా॥ పి. యస్. దేశముఖ్‌గారు సవరణ ప్రతిపాదించిరి. ఈ సవరణను అంబేద్కరుగారు ఆమోదించిరి.

కాని పాతమంత్రివర్గం కొత్తరాజ్యాంగ చట్టం రాగానే రాజీనామాలు దాఖలు చేయవలెననియు వారే తిరిగి నియమింపబడవలసిన యెడల నియమింపబడవచ్చునని యు సవరణ తీర్మానం ప్రతిపాదింపబడెను. కాని, యీసవరణ అనవసరమని డా॥ అంబేద్కరుగారు చెప్పిరి. విశ్వాసరాహిత్యతీర్మానం పెట్టుటకున్నూ మంత్రులు రాజీనామా యిచ్చుటకున్నూ అవకాశము ఎప్పుడును ఉన్నది. లేదా సభ్యుల విశ్వాసప్రతిపాదన తీర్మానమును ప్రధానమంత్రి పొందవచ్చును. దేశముఖుగారి సవరణతో సహా ఆ నిబంధన ఆమోదింపబడెను.

312 నిబంధన: రాష్ట్రశాసనసభలు

312 నిబంధనను తిరిగి మరొక విధంగా యీ క్రిందిరీతిగా రచించి రాజ్యాంగచట్టంలో చేర్చవలెనని డా॥ అంబేద్కరుగారు ప్రతిపాదించిరి.

కొత్త రాజ్యాంగచట్టము ప్రకారముగా ఎన్నికలు జరిగి కొత్తశాసనసభ్యవర్గములు ఏర్పడేవరకున్నూ ఇప్పుడున్న శాసనసభలే కొత్త రాజ్యాంగంక్రింద తాత్కాలికశాసనసభలుగా వర్తించుచుండవలెను. కాని కొత్తగా ఏ రాష్ట్రమునందైనను కొత్త రాజ్యాంగం ప్రారంభం కాకపూర్వమే ఎన్నికలు జరుగవలెనని ఉత్తర్వు చేయబడినయెడల అట్టి కొత్త ఎన్నికప్రకారముగా ఏర్పడే శాసనసభ్యవర్గమే తాత్కాలిక శాసనసభ్యవర్గముగా వ్యవహరించగలదు. ఆయా రాష్ట్రశాసనసభల అధ్యక్షులుకూడా తాత్కాలిక అధ్యక్షులుగా వ్యవహరించవలెను.

ఈ నిబంధన విషయమై స్వల్పచర్చ జరిగెను. ఈ తాత్కాలిక శాసనసభలు ఎంతకాలం అమలులో నుండవలెనో ఆ గడువు కూడా నిర్వచింపబడవలెనని సంతానంగారొక సవరణ ప్రతిపాదించిరి. రెండు సంవత్సరములు గడువులోపల ఎన్నికలు జరిగి కొత్తశాసనసభలు ఏర్పడవలెనని శిబ్బన్‌లాలుసక్సేనాగారు వాదించిరి.

అట్టిగడువు నిర్ణయం లేనియెడల యిప్పుడున్న శాసనసభ్య వర్గముతే యథేచ్ఛగా ఎంతకాలమైనను ఉండవచ్చునని సంతానంగారు వాదించిరి.

బి. దాస్‌గారు గడువు నిర్ణయం చేయవచ్చును కాని ఆ గడువులోపల కొత్త ఎన్నికలను జరిపించవలసిన బాధ్యత ప్రభుత్వకార్యనిర్వాహకవర్గమువారిపైయున్నది. కాని, యీ ప్రభుత్వమంత్రివర్గము అట్టి బాధ్యతలను వహించుటకు వెరచుచుండును. రాష్ట్రీయమంత్రులు ప్రజాస్వామ్యధర్మమును నిర్వర్తించవలెనను ఆతురతను కనబరచుటలేదు.

అనంతరం హెచ్. వి. కామత్‌గారు మాట్లాడుతూ, రైళ్లను టైముప్రకారం నడిపించడంలో సిద్ధహస్తుడనిపించుకున్న సంతానంగారు రాజ్యాంగమును కూడా సకాలంలో అమలు జరపాలని పట్టుపట్టడంలో ఆశ్చర్యంలేదనీ, కాని అనుకోని కారణాలవల్ల ఆలస్యం జరిగితే దానిని సహించక తప్పదనీ చెప్పిరి. తర్వాత ఎల్. కృష్ణస్వామిభారతిగారు ప్రసంగిస్తూ 1950 వ సంవత్సరాంతంలోగా కొత్త రాజ్యాంగం కింద ఎన్నికలు జరపాలని రాజ్యాంగపరిషత్తు లోగడ తీర్మానించియున్నదనీ, ఈ తీర్మానం కేవలం నీటిమీద వ్రాసిన వ్రాతలాగా చెరిగి పోకూడదనీ చెప్పిరి.

పరిషదధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్‌గారు అంతట చర్చలో కల్పించుకొని, ఇంతవరకు వివిధరాష్ట్రములనుండి తమకందిన సమాచారాన్ని బట్టి ఎన్నికలను 1950-51 వ సంవత్సరపు శీతాకాలంలో జరపడానికి వీలవుతుందని తోస్తున్నదనీ, ఎన్నికలు జరపడం ఆలస్యం అయితే ప్రభుత్వముయొక్క ప్రయత్నలోపం గాక కార్యభారంయొక్క గురుత్వమే దానికి హేతువుగా పరిగణించవలసి ఉంటుందనీ చెప్పిరి.

అనంతశయనం అయ్యంగారు మాట్లాడుతూ, వర్తమాన శాసనసభలను ఫలానా వ్యవధిలోగా

(21-వ పేజీ చూడుడు)

నేటిప్రపంచం:

★ ఐక్యరాజ్యసమితి సమావేశం
★ చీనా కమ్యూనిస్టుల రిపబ్లిక్ స్థాపన
★ రష్యా, యుగోస్లావియాల కలహం

ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరం సమావేశములో రష్యా అమెరికాల పరిస్థితుల్లో కొద్ది మార్పు ఉంది. రష్యాపైన చీనా, యుగోస్లావియాలు ఫిర్యాదులు తెచ్చాయి. గ్రీసు సమస్యనూ బాల్కన్ దేశాలలో మానవస్వత్వాల అతిక్రమణ సమస్యనూ సమితి చర్చనీయాంశాలలో చేర్చరాదని రష్యా ఎంత వాదించినా ఫలించిందికాదు.

రష్యాకుకూడా అణువిచ్ఛిత్తి విధానం తెలుసుననే విషయం బయటపడగానే అణుశక్తి ప్రయోగనిర్బంధాల విషయమై అమెరికా వైఖరిలో మార్పు గోచరిస్తోంది. చీనాలో కమ్యూనిస్టుల "పీపుల్స్ రిపబ్లిక్" స్థాపన ఈ నెల ఒకటో తేదీని ప్రకటితమయింది. ఈ ప్రభుత్వాన్ని వెంటనే రష్యా గుర్తించింది. దీనితో ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వసమస్య ఒకటి రాగల సూచనలు కనిపిస్తున్నాయి. రష్యాపై చీనా (జాతీయ) ప్రభుత్వ ఫిర్యాదు, యుగోస్లావియా రష్యాలవైషమ్యాలలో ఆంగ్లో-అమెరికన్ రాజ్యాల జోక్యం మితిమీరి, రష్యాను ఇబ్బంది పెట్టే సందర్భంలో, రష్యా, చీనా కమ్యూనిస్టు పీపుల్స్ రిపబ్లిక్ సభ్యత్వసమస్యను తెచ్చి సమితిలో ప్రతిష్టంభన తేగల అవకాశం ఉంది.

ఆఫ్రికాలోని ఇటాలియన్ వలసల భవిష్యత్తును గురించి బ్రిటన్ మరొక సూచనావళి తేనున్నది. ఈ పర్యాయం సిరనైకా, ట్రిపోలిటానియాల ఐక్యతను బ్రిటన్ ప్రతిపాదించగలదు. ట్రిపోలిటానియానుంచి తమ ఆధిపత్యాన్ని ఉపసంహరించగలదు. ఇది ట్రియాలో కొంత భాగాన్ని కోరుతున్న ఇథియోపియా వాంఛల్ని తీర్చడానికి బ్రిటన్ సన్నద్ధమౌతున్నది. సోమాలీలాండును ఇటలీ ధర్మకర్తృత్వానికి ఒప్పగించగలదు. 13 ఆసియాదేశాల ప్రతినిధులు ఇటాలియన్ వలసలపట్ల ఎట్టి విధానం అనుసరించవలసినదీ చర్చించుకొన్నారు.

ఈ వర్గానికి భారత ప్రతినిధి సర్. ఓ. నరశింగరావుగారు నాయకుడు. (క్రిందటి పర్యాయము సమావేశంలో ఇటాలియన్ వలసల భవిష్యత్తును గురించిన బ్రిటిష్ ప్రతిపాదనలు భారతదేశం లోటువల్లనే పరాజయం పొందాయి.)

ఏటంకంట్రోల్:

రష్యాకుకూడా ఏటంబాంబురహస్యం తెలుసుననే విషయం బయటపడినప్పటినుంచీ అమెరికా వైఖరిలో మార్పువచ్చింది. ఆస్ట్రియా ట్రియస్టు జర్మనీల భవిష్యత్తునుగురించి అగ్రరాజ్యాలమధ్య ఇంతవరకూ సమాధానం కుదరలేదు. ఈ విషయాలపై సంప్రదింపులకు రావలసిందని అమెరికన్ విదేశాంగమంత్రి డీన్ ఆచిసన్ రష్యన్ విదేశాంగమంత్రి వైషిన్స్కీని ఆహ్వానించాడు. త్వరలో సంప్రదింపులు సాగవచ్చును. పారిస్‌నుంచి వాయిదాపడిన అగ్రరాజ్య విదేశాంగమంత్రుల సమావేశంకూడా త్వరలో జరగగలదు. అయితే పశ్చిమజర్మనీ ప్రభుత్వస్థాపనకు రష్యా ఆక్షేపణ తెలిపింది.

యుద్ధాలలో అణుశస్త్రాల ప్రయోగాన్ని నిషేధించాలనీ, అణుశక్తి వినియోగవిధానాన్ని నియమబద్ధం చెయ్యాలనీ, రష్యన్ విదేశాంగమంత్రి వైషిన్స్కీ సమితి సర్వసభ్యసమావేశంలో సూచించాడు. అమెరికా బ్రిటన్‌లు ఈ వాదనవంతనూ, రష్యా ప్రచారంకింద జమకట్టేశాయి. కాని అణుశక్తిప్రయోగాన్ని ఏదో రీతిని నియమబద్ధం చెయ్యక తప్పదని అమెరికన్‌రాజ్యాంగవేత్తలు గ్రహించడానికి ఆట్టే వ్యవధి పట్టలేదు. ఈ సమస్య పరిష్కారానికి నిర్మాణాత్మకమైన సూచనలు చేయవలసిందని అమెరికన్ ప్రతినిధి రష్యన్ ప్రతినిధి రష్యన్ ప్రతినిధి అంగీకరించాడు. దీనితో ఏటంబాంబుభీతి ప్రపంచానికి ఉండనవసరంలేదని ఆశించవచ్చును. ఈ పరిణామంతో భారతప్రతినిధి సర్ నరసింగరావుగారి ప్రతిపాదన పైకి రాలేదు. అసలు అణుశక్తిసమస్యను రాజకీయవేత్తలు పరిష్కరించడానికి యత్నించరాదనీ అంతర్జాతీయ న్యాయసమితికి (ఇంటర్నేషనల్ లా కమిషన్‌కి) దీనిపై సర్వాధికారాలూ సమర్పించాలనీ నరసింగరావుగారి ప్రతిపాదనసారాంశం. కాని అగ్రరాజ్యాలకు ఇట్టి నియమాలలో విశ్వాసం లేదు. రాజకీయవేత్తలే చివరికి పరిష్కరించ పూనుకున్నారు.

పండిట్ నెహ్రూ చెప్పినట్లు రష్యాకుకూడా ఏటంబాంబు ఉండడంవల్ల ప్రపంచానికి మరొక యుద్ధం రాగలదనే భయం తీరిపోగలదు. విషవాయుప్రయోగం మొదలైనవానివలెనే ఏటంబాంబు కూడా యుద్ధాల్లో నిషిద్ధం కాగలదు.

చీనా ఫిర్యాదు:

రష్యా 1945 లో చీనా (జాతీయ) ప్రభుత్వంతో చేసుకున్న మైత్రిఒడంబడికను అతిక్రమించి చీనాకమ్యూనిస్టులకు సహాయంచేసిందనీ, మంచూరియాలో కూడా ఆ ఒడంబడికకు విరుద్ధంగా జోక్యంచేసుకున్నదనీ, చీనాప్రభుత్వప్రతినిధి సమితిలో రష్యాపై ఫిర్యాదుచేశాడు. అమెరికారహస్యపు ప్రోద్బలంపై ఈరీతిగా చీనా రష్యాపై అపవాదులు వేస్తున్నదని రష్యన్ ప్రతినిధి వైషిన్స్కీ నిందించాడు. చీనా ప్రభుత్వప్రతినిధి మోపుతున్న నేరాలన్నీ నిరాధారమైనవనీ, ఇదంతా అసత్యప్రచారమనీ అన్నాడు. కాని ఈవిషయాన్ని చర్చనీయాంశాల్లో చేర్చడానికే సమితికార్యక్రమ నిర్ణయ సంఘం నిర్ణయించింది. ఈకారణంవల్లనే చీనాలో కమ్యూనిస్టులు త్వరపడి పీపుల్స్‌రిపబ్లిక్‌ను అక్టోబరు 15వ తేదీనే స్థాపించారు. (ఇదివరలో కాంటన్‌పతనానంతరంగాని స్థాపించబడదని అంచనా వేశారు.)

చీనా (కమ్యూనిస్టుల) పీపుల్స్‌రిపబ్లిక్‌కు మావ్ సెటుంగ్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. చౌ ఎన్ లై ప్రధానమంత్రిగానూ విదేశాంగమంత్రిగానూ ఎన్నుకోబడ్డాడు. 1920 లో చీనా (జాతీయ) రిపబ్లిక్ నిర్మాత సన్ యట్ సెన్ భార్య ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయింది. జనరల్ చూటే సర్వసేనాధిపతిగా నియమితుడైనాడు. పీపింగ్ తిరిగి పురాతన నామం "పెకింగ్"గా పీపుల్స్‌రిపబ్లిక్ రాజధానీ నగరమయింది. మంచూ సార్వభౌముల రాజభవనాలు పీపుల్స్ రిపబ్లికన్ కార్యాలయాలయినాయి.

పీపుల్స్ రిపబ్లిక్‌స్థాపనకు రెండు రోజులముందు పీపింగ్ రేడియోద్వారా మావ్ సెటుంగ్ కార్యాలయం సమితి సభ్యత్వవిషయమై ఒక ప్రకటన చేసింది. (సమితిలో రష్యాపై చీనా ఫిర్యాదుచేసిన అనంతరమే.) ఐక్యరాజ్య సమితిలో చీనా ప్రతినిధివర్గాన్ని చీనా ప్రభుత్వ ప్రతినిధివర్గంగా పీపుల్స్ రిపబ్లిక్ అంగీకరించబోదని ఈ ప్రకటన స్పష్టపరిచింది. దీనివల్ల సమితిలో సభ్యత్వానికి త్వరలోనే చీనా కమ్యూనిస్టు ప్రభుత్వంతరఫున రష్యా తగవుపెట్టగలదు. చీనా ఫిర్యాదుపై చర్చ వచ్చేసమయంలో ఫిర్యాదు చర్చ చేయడానికి వీల్లేదనీ, చీనా ప్రభుత్వానికి డా॥ ట్సియాంగ్‌ను ప్రతినిధిగా తానింకెంతమాత్రం అంగీకరించబోదనీ రష్యా వాదించవచ్చును.

యుగోస్లావియా:

యుగోస్లావియా ఐక్యరాజ్యసమితిలో రష్యాకు క్రొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. యుగోస్లావ్ ప్రతినిధి కార్డెల్జ్ తమ ఆంతరంగిక వ్యవహారాల్లో రష్యా జోక్యం చేసుకుంటున్నదనీ, తమ ప్రభుత్వంపట్ల ఇతర బాల్కన్ రాజ్యాలు, రష్యా విరోధభావంతో ప్రవర్తిస్తున్నాయనీ, నిందించాడు. టిటో ప్రభుత్వాన్ని పడగొట్టడానికి రష్యా ప్రయత్నిస్తున్నదన్నాడు. భద్రతామండలిలో సభ్యత్వానికి జెకోస్లోవాకియాకు ప్రత్యర్థిగా నిలవడానికి యుగోస్లావియా నిశ్చయించింది. యుగోస్లావియాను బలపరచడానికి అమెరికా సన్నద్ధత చూపుతున్నది.


టిటోపై పగ:

యుగోస్లావియాప్రభుత్వంతో 1945 లో చేసుకున్న మైత్రి ఒడంబడికను రద్దుచేసినట్లు రష్యా ప్రకటించింది. రష్యా యుగోస్లావియాల మధ్య వైరాలు పెరగడం ఆంగ్లో అమెరికన్ వర్గానికి అత్యంత సంతోషదాయకంగా ఉంది.

రష్యా యుగోస్లావియాల మధ్య వైరం 1948 సంవత్సరారంభంనుంచీ రగులుకుంటోంది. మిగతా బాల్కన్ దేశాల్లో చిన్న చిన్న భూమి యాజమానుల్నికూడా వెళ్లగొట్టి వ్యవసాయపరిశ్రమయావత్తునూ ప్రభుత్వాలు జాతీయం చెయ్యగా, యుగోస్లావియా అనుసరించలేదనీ, చిన్న చిన్న పెట్టుబడిదారుల్ని టిటోప్రభుత్వం అంతమొందించకుండా ఇంకా సహిస్తున్నదనీ, ఈవిధానం కమ్యూనిస్టు పంథాకు విరుద్ధమైనదనీ అప్పటి రష్యన్ విదేశాంగమంత్రి మొలటోవ్ హెచ్చరిస్తూవచ్చాడు. టిటో ప్రభుత్వం ఈ హెచ్చరికల్ని పెడచెవిని పెట్టింది. అదిగాక సోవియట్ మిలిటరీకమిషన్ ఆధిపత్యాన్ని యుగోస్లావ్ దేశరక్షణశాఖామంత్రి వైలాస్ ప్రతిఘటిస్తూవచ్చాడు. అప్పటినుంచీ రెండు ప్రభుత్వాలమధ్య వైరం చినికి చినికి గాలివానగా మారింది. టిటోను అంతర్జాతీయవాదానికి విరోధిగా, సంకుచితజాతీయవాదిగా నిందించారు. ప్రజాప్రభుత్వవిధానాన్ని అనుసరించకుండా టిటోనియంతృత్వం చలాయిస్తున్నాడని ప్రచారంచేశారు. కామిన్ ఫారం (అంతర్జాతీయ కమ్యూనిస్టు ప్రచారసంస్థ) నుంచి 1948 జూన్‌లో యుగోస్లావ్ కమ్యూనిస్టు పార్టీని వెళ్లగొట్టారు. కామిన్‌ఫారం కార్యాలయాన్ని యుగోస్లావియాప్రధాననగరమైన బెల్‌గ్రేడ్‌నుంచి జెకోస్లోవాకియా ప్రధాననగరమైన ప్రాగ్‌కు మార్చారు.

ఆపైన యుగోస్లావియాపై వాణిజ్యవ్యవహారాల నిర్బంధాలు విధించబడినాయి. పరిశ్రమల్లో బొత్తిగా వెనుకబడిన యుగోస్లావియాలో వస్త్రం మొదలైనవి బొత్తిగా లోపం. వ్యవసాయోత్పత్తిని అతి చౌకధరలకు రష్యాకూ, ఇతర బాల్కన్ దేశాలకూ పంపి, అక్కడనుంచి ట్రాక్టర్లు, పారిశ్రామికోత్పత్తి యంత్రపరికరాలూ దిగుమతి చేసుకునేది. ఇప్పుడు యుగోస్లావియాపై ఇతర బాల్కన్ దేశాలూ, రష్యా పూర్తిగా ఆర్థిక దిగ్బంధం విధించాయి. వేరుగతిలేక యుగోస్లావియా పాశ్చాత్యదేశాలతో

(17-వ పేజీ చూడుడు)



గాంధిజయంతి (అక్టో 2-వ తేదీ) నాడు ప్రధానామాత్యుడు పండిత నెహ్రూ రాజఘాట్‌లో మహాత్ముని సమాధికి జోహారులర్పించినప్పటి దృశ్యం.

కథానిక:

"శ్వేతసుందరి"

మూలం: 'షెన్-చి-చి'

అనువాదం: శ్రీ "కేరా"

జెక్‌షిహ్ ఈ లోకానికి సంబంధించిన స్త్రీ కాదు. వె-యిక్ రిటైరయిన రాష్ట్రగవర్నరు. తన వంశంలో తొమ్మిదవవాడు. తల్లివైపున సిన్. ఏక్‌కు మనుమడు. పిచ్చినమ్మకాలు లేనిమనిషి. త్రాగుడంటే మహాప్రీతి. ఇతనికి చెంగ్ - లియూ అంతరంగిక స్నేహితుడు, ఒకవిధంగా చుట్టం కూడాను. వె. యిక్ పినతల్లి కూతుళ్లలో ఒకామెను పెండ్లి చేసుకున్నాడు.

చెంగ్ చిన్నతనంలో వీరుడికి తగిన రణో చితశిక్షణను పొందాడు. వె. యిక్ లాగానే సారా అన్నా, స్త్రీలన్నా పడి చస్తాడు. పేదవాడవటంవల్ల పెళ్లాంతోబాటు, ఆమె తల్లిదండ్రులకుటుంబంతోనే ఉండిపోయాడు. వె-యిక్, యితను ఒకరిని విడిచి, మరొకరు సామాన్యంగా, ఒంటరిగా కనపడరు.

క్రీ. శ. 747 వ సంవత్సరపు జూన్ నెలలో, ఇద్దరు స్నేహితులు చంగన్ వీధులగుండా ప్రయాణంచేస్తున్నారు. షిన్‌పంగలీ భవనంలో విందు జరుగుతూంటే దానికి వెడుతున్నారు. కాని సూన్‌పింగ్‌కు కొంచెం దక్షిణంగా ఉన్న ప్రదేశానికి రాగానే చెంగ్‌కు మరచిపోయిన విషయం జ్ఞాపకం వచ్చింది. తనకు కొంచెంపని ఉన్నదని, తర్వాతవచ్చి విందులో కలుసుకుంటానని వె-యిక్‌తో చెప్పి వెళ్ళిపోయాడు. తన తెల్లటి గుఱ్ఱంమీద స్వారీచేస్తూ యిక్ తూర్పుగా వెళ్లిపోయాడు చెంగ్ తన గాడిద మీద దక్షిణంగా వెళ్లాడు షెంగ్ పింగ్ ప్రాంతంలో ఉత్తరపు ముఖద్వారం వద్ద చెంగ్‌కు ముగ్గురు స్త్రీలు కనిపించారు. అందులో ఒకామె. పైనుంచి క్రిందవరకు పూర్తిగా తెల్లటి బట్టలు ధరించింది. ఆమె అందంచూసి చెంగ్ ఆశ్చర్యపోయాడు. ఆ ముగ్గురుస్త్రీలను వెంబడించాడు. కొంచెంసేపు వాళ్లకు ముందుగాను, తర్వాత కొద్దిదూరంలో వెనుకా తన గాడిదమీద ప్రయాణంచేస్తూ, ఏవిధంగానైనా పలుకరిద్దామనుకున్నాడుగాని, ధైర్యం చాలింది కాదు.

కాని ఆ తెల్లటిబట్టలు ధరించిన ఆమె చూపులు ప్రోత్సాహపరచాయ్.

"ఇంతటి అందకత్తెలు కూడా నడిచే వెడుతున్నారా!" అన్నాడు.

"ఏం చెయ్యం?...ఎవ్వరూ తమ సవారీ అన్నా యివ్వనప్పుడు..."అంది తెల్లటి దుస్తుల స్త్రీ "నీ అంతటి అందకత్తె స్వారీచేయదగిన జంతువు యిది కాదు. లేకపోతే యిది మీకు యిచ్చిన డచివచ్చేవాణ్ని" అన్నాడు చెంగ్. ముగ్గురు స్త్రీలూ నవ్వుకున్నారు. చెంగ్ వాళ్లను తూర్పు దిశగా వెంబడించిపోయాడు. లోయూయన్ వద్దకు చేరుకునేసరికి చీకటి పడింది.

మట్టిప్రహరీగోడ......సామాన్యంగా బండి వెళ్లటానికి వీలైన తలుపు గల ఒక యింటిముందు ఆగారు. లోపల యిళ్లన్నీ చాలా అందంగా, -న్నాయ్... తెల్లటిబట్టలు వేసుకున్న స్త్రీ, చెంగ్‌తో కొంచెంసేపు బయటఉండమని చెప్పి, తన చెలికత్తెను ఒకదానిని అతనితో ఉంచి లోపలికి వెళ్ళిపోయింది. ఆ చెలికత్తె చెంగ్‌ను అతని పేరూ ఊరూ అడిగి వివరాలన్నీ తెలుసుకుంది. చెంగ్ కూడా ఆ తెల్లటిసుందరి పేరు తెలుసుకున్నాడు. ఆమె పేరు జెక్‌షిహ్. తన వంశంలో యిరువదివ వ్యక్తి ఆమె.

కొంచెంసేపటికి లోపలికిరమ్మని చెంగ్‌కు ఆహ్వానం వచ్చింది. తన గాడిదను తలుపుకు కట్టి తలమీది టోపీకూడ అక్కడనే వదలి లోపలికి వెళ్లాడు. సుమారు ముప్పదిసంవత్సరాల వయస్సుగల స్త్రీ అతన్ని ఆహ్వానించింది. ఆమె జెక్‌షిహ్ పెద్దక్క అని తెలుసుకున్నాడు. లోపల కొవ్వొత్తులు వెలుగుతున్నాయ్. విందు తయారుగా ఉంది. రెండు మూడు కప్పులు ద్రాక్షసారాయి త్రాగేలోగానే, జెక్‌షిహ్ తన దుస్తులు మార్చుకొని వచ్చింది. కులాసాగా, నవ్వుకుంటూ విందును ఆరగించారు.

రాత్రిప్రొద్దుపోయాక, చెంగ్, జెక్‌షిహ్‌తో తన కాలాన్ని ఆనందంగా గడిపాడు. ఆమె అందాన్ని, యవ్వనాన్ని తనివితీర అనుభవించాడు. ఆమె శరీరం, నవ్వు, సంగీతం ఆమె సొత్తు...సాధారణంగా మానవులలో ఎక్కడా కనపడని ఆనందాన్ని చెంగ్ ఆమెవద్ద రుచి చూశాడు. తెల్లవారేముందు జెక్‌షిహ్ అంది— "ఇక మీరు వెళ్లాలి...నేను, నా చెల్లెళ్లు... చియోఫాంగ్ వద్ద మా ఉద్యోగాలకు తెల్లవారేలోగా పోవాలి." తిరిగి మళ్లీ కలుసుకుంటానని వాగ్దానం తీసుకుని చెంగ్ వచ్చేశాడు.

ఆపేటనుంచి దాటి రావటానికి సింహద్వారంతలుపులు యింకా తీయలేదు. కాని దగ్గరలోనే టీ దుకాణపు యజమాని, నిద్రలేచి దుకాణం సర్దుకుంటున్నాడు. తలుపుతీసేటంత వరకు టీ దుకాణపు యజమానితో మాట్లాడవచ్చునని చెంగ్ అతనివద్దకు వెళ్లాడు.

"ఇక్కడికి తూర్పుగా ఆ మలుపుదగ్గర యింటిలో ఎవరుంటున్నారు?" చెంగ్ అడిగాడు యజమానిని.

"అది పాడుపడిన దొడ్డి...ఎవ్వరూ ఉండటం లేదే"

"ఇప్పుడే వస్తున్నా అటునుంచి...మనుష్యులు కనిపించారు" అన్నాడు చెంగ్.

టీ దుకాణపు యజమాని ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. ఆలోచించి యిలా చెప్పటం ప్రారంభించాడు. "ఐతే...యిప్పుడు తెలిసింది. అక్కడ ఒక నక్క ఉంది. మనుష్యులను మాయచేస్తూంటుంది. ఈమధ్యనే మూడుసార్లు కనపడింది. నువ్వేమన్నా కలుసుకున్నావా?" అని కూడా అడిగాడు.

చెంగ్ సిగ్గుపడి "లేదని" తప్పుకున్నాడు. తిరిగి వెనక్కి వెళ్లి చూశాడు. మట్టిప్రహరీగోడ, తలుపు కనపడ్డాయ్...లోపలికి తొంగిచూస్తే, గడ్డి, చెత్త, అక్కడక్కడ ఎప్పుడో సాగు చేసిన కొంత నేల కనపడింది.

ఇంటికి రాగానే, విందుకు రాలేదేమని, వె-యిక్ నిలదీశాడు. కుమార్పణచెప్పి తప్పుకున్నాడేగాని, తన అనుభవాన్ని మాత్రం చెంగ్ చెప్పలేదు. ఆమెనుగురించి యింతగా తెలిసినప్పటికీ, జెక్‌షిహ్‌ను మరచిపోలేకపోయాడు. ఆమెఅందం అతన్ని పిచ్చివాణ్ణిగా చేసింది. మళ్లీ ఆమెను కలుసుకోవాలని ప్రయత్నం చేయ మొదలెట్టాడు.

సుమారు పది రోజులతర్వాత ఒక బట్టల దుకాణంలోకి వెడితే, చెంగ్‌కు ఆమె కనపడింది. యిదివరకు తను చూసిన చెలికత్తెయే యిప్పుడు కూడా ఆమెతో ఉంది. చెంగ్ ఆమెను పిలిచాడు. కాని ప్రక్కనే ఉన్న జనంలోకి ఆమె తప్పుకుంది. జెక్‌షిహ్‌ను పిలుస్తూనే చెంగ్ వెంబడించాడు. ఆమె మొగానికి విసనకఱ్ఱ చాటుపెట్టుకుని అంది—"నేనెవరో తెలుసుకునికూడా, నావెంట ఎందుకు పడతావ్?"

"నాకు తెలిస్తే నష్టం ఏముంది?" అన్నాడు చెంగ్.

"నీతో మాట్లాడటానికి సిగ్గువేస్తోంది."

"నిన్ను అమితంగా ప్రేమిస్తున్నాను...నన్ను వదలివేస్తావా?" అన్నాడు చెంగ్.

"నేనంటే నీకు అసహ్యమేమో అనుకున్నా" అంది. చెంగ్ ఆమెను ఎంతో బ్రతిమాలాడుడు. ఒట్లు వేసుకున్నాడు. అప్పుడు జెక్‌షిహ్ తన మొగాన్ని కనబరచింది. ఇదివరకులాగానే అందంగా ఉంది.

"నావంటివాళ్లు ఎంతోమంది ఉంటారు. వాళ్లను కలుసుకోలేదనుకుంటాను. నేనే అందకత్తెను అయినట్లు పొగడుతున్నారు" అంది జెక్‌షిహ్.

తిరిగి తనను కలుసుకోనివ్వమని చెంగ్ బ్రతిమాలితే ఆమె యిలా అంది: "మేము మానవుల శక్తిసామర్థ్యాలను పీల్చి పిప్పిచేస్తామని, మమ్మల్ని ద్వేషిస్తారు. ఈవిషయంలో నేను వేరు తరహా వ్యక్తిని. మీకు యిష్టమైతే, నా జీవితాంతం మీకు ప్రియురాలినిగా ఉంటాను."

చెంగ్ అమితంగా సంతోషించాడు. ఒక యిల్లును తీసుకోవటాన్నిగురించి యిద్దరూ చర్చించటం ప్రారంభించారు. "ఇక్కడికి తూర్పుగా అంతగా జనం రద్దీలేని వీధిలో ఒక యిల్లు అద్దెకు ఉంది" చెప్పటం మొదలు పెట్టింది జెక్‌షిహ్ "మనకు వీలుగా ఉంటుంది. ఆయింటికి గోడప్రక్కనే పెద్దచెట్టు ఉంది. అది గుర్తుగా దానిని సులభంగా తెలుసుకోవచ్చు. క్రితంసారి నన్ను కలుసుకున్నప్పుడు మీతో యింకొక వ్యక్తి ఉన్నాడు...తూర్పు దిశగా గుఱ్ఱంమీద వెళ్లిపోయాడు. ఆయన మీభార్యకు పెత్తల్లికొడుకే కదూ? మన యింటికి కావలసిన సామాను ఆయనవద్ద చాలా ఉంది. మీరు అది తీసుకోవచ్చుగా!" అంది.

చెంగ్ యిల్లు తెలుసుకుని అద్దెకు తీసుకున్నాడు. సామానుకోసం వె-యిక్ వద్దకు వెళ్లి అడిగేసరికి, అసలు సంగతంతా చెప్పవలసి వచ్చింది. వె-యిక్ పిన తండ్రి ఒకాయన దూరదేశానికి వెళ్లటంవల్ల ఆయన సామానంతా యితని దగ్గర ఉంది. చెంగ్, జెక్‌షిహ్ సౌందర్యాన్ని వర్ణించి చెప్పాడు.

"నీమొగం అందవిహీనంగా ఉంటుందే, అంతటి అందకత్తెను ఎలా వశరపరచుకోగల్గావ్!" అని అడిగాడు వె-యిక్ ఆశ్చర్యంతో.

చెంగ్‌కు కావలసిన మంచాలు, కుర్చీలు పంపుతూ నిజం తెలుసుకోమని తన అంతరంగిక నాకరుని ఒకణ్ణి పంపించాడు వె-యిక్. కొంచెంసేపట్లోనే ఆ నౌకరు ముచ్చెమటలతో వగరుస్తూ పరుగెత్తుకువచ్చాడు.

"ఆవిడ ఉందా? ఎలా వుంటుందిరా?" వె-యిక్ అడిగాడు.

"అద్భుతం, అంతటి అందకత్తెను నా జీవితంలో చూడలేదు" అని నౌకరు బవాబు.

వె-యిక్‌కు ఎంతో మంది బంధువులలో ఆడవాళ్లున్నారు. అందకత్తెలను చాలామందిని కలుసుకున్నాడు. తను చూసినవారిలో నలుగురైదుగురిని చెప్పి, వారిలాగా ఉంటుందా అని నౌకరును అడిగాడు.

"జెక్‌షిహ్ ముందు వాళ్లు ఎందుకూ పనికిరారని" నౌకరు పదేపదే చెప్పాడు.

"ఇంతటి అందం అసలు ప్రపంచంలో ఉంటుందా?" అని వె-యిక్‌కు సందేహం తోచింది.

పరిశుభ్రంగా స్నానం చేసి, మంచిబట్టలు వేసుకుని చెంగ్ యింటికి బయలుదేరాడు వె-యిక్. అతను వెళ్లేసరికే స్నేహితుడు యింటినుంచి బయటకు వెళ్లాడు. లోపలికి వెళ్లిచూస్తే కుర్రాడు ఇల్లు ఊడుస్తున్నాడు. దాసీది గుమ్మం దగ్గర నిలబడిఉంది. తను వచ్చినపని ఆ కుర్రవాడితో చెప్పాడు. ఇంట్లో ఎవ్వరూ లేరన్నాడు కుర్రవాడు. గదిలోకి మొండిగా వెళ్లిచూస్తే ఎర్రటి అంచు కనబడింది. తెర తొలగించుకుని వెళ్లిచూశాడు. జెక్‌షిహ్ తెరవెనుక దాక్కొని ఉంది. వెలుగులోకి ఆమెను తీసుకువచ్చి చూశాడు వె-యిక్. తనకు నౌకర్లు చెప్పిన దానికంటె జెక్‌షిహ్ మరీ అందంగా ఉంది.

ఆమెను చూడగానే వె-యిక్‌కు మతి చెడినట్లయింది. ఆమెను బలవంతం చేశాడు. తనకు శక్తిఉన్నంత రకు పెనగులాడింది. చివరికి సరేనంది. పట్టుదలగానే మరింత తీవ్రంగా పెనగులాడేది. ఇలా కొన్నిసార్లు జరిగినతర్వాత వె-యిక్ ఆమెను పట్టుకునివదలలా. జెక్‌షిహ్ నిస్సహాయంగా యిక పెనగులాడటం మానివేసింది.

కాని అకస్మాత్తుగా ఆమెమొఖంలో విషాద రేఖలు అలుముకున్నాయ్...వె-యిక్ గుర్తించకుండా ఉండలేకపోయాడు.

"అంత విచారంగా ఉన్నావేం?" అన్నాడు వె-యిక్...

..."చెంగ్‌నుచూస్తే నాకు జాలివేస్తుంది." అంది జెక్‌షిహ్.


"ఎందుకని?"

"అందరిలాగా ఆరడుగుల మనిషే చెంగ్ కూడా. కాని ఒక స్త్రీని రక్షించుకోలేడు. నిజానికి అతను మగవాడు అనిపిలువబడటానికి కూడా తగడు. కాని మీరు భాగ్యవంతులు బలశాలులు. నాలాంటి వాళ్లను ఎంతోమందిని చూసి ఉంటారు. చెంగ్ పేదవాడు. నేను అతనికి ఒక్కదాన్నే...ఇంతటి సౌఖ్యాన్ని పొంది కూడా మీరు చెంగ్‌కు యీ మాత్రపు స్వల్పపు ఆనందాన్ని లేకుండా చేస్తున్నారు. ఆయన తిండికి బట్టలకు మీమీద ఆధారపడిన బికారి అని ఆయన్ను చూస్తే నాకు జాలివేస్తుంది. చెంగ్ మీకు లోబడిన వ్యక్తి అనే, నామీద యింత చనువుగా ప్రవర్తిస్తున్నారు. ఆయనకు స్వంతం అని కొంత స్తితిఉంటే పరిస్థితులు యింతవరకూ వచ్చేవి కావు."


మామూలుగా వె-యిక్ జాలిగలవాడు. నమ్మకమైన స్నేహితుడు కూడాను. జెక్‌షిహ్ మాటలు వినటంతోనే ఆమెను వదలివేసి, తన ప్రవర్తనకు క్షమార్పణ కోరాడు. ఈలోగా చెంగ్ తిరిగి వచ్చాడు. ఇద్దరు మిత్రులూ ఒకరిని చూసి మరొకరు నవ్వుకున్నారు. తన అదృష్టానికి ఒకతను, స్నేహితుని భాగ్యానికి రెండవాయన.

అప్పటినుంచి యిక్, జెక్‌షిహ్‌కు కావలసిన సామగ్రులన్నీ తనే పంపుతూండేవాడు. ప్రతిరోజూ ఆమెను చూడటానికి వచ్చేవాడు. ఇద్దరి మధ్యా సన్నిహితత్వం ఏర్పడింది. కాని అది నీతినియమాలను మించి ఎన్నడూ హద్దులను దాటలేదు. వె-యిక్ తనను ఎంతగా ప్రేమించినదీ జెక్‌షిహ్ గ్రహించి ఒకరోజున యిలా

(20-వ పేజీ చూడుడు)



శ్రీ రామేశ్వరాలయ ద్వారము



శ్రీ రామేశ్వరాలయంలో అపూర్వ శిల్పకళా విలసితమైన నడవ

రామేశ్వర మహాక్షే

★

"యదాకృతాంభోనిధిసేతుబంధనః
కరస్థలాధఃకృతపర్వతాధిపః,
భవానిశేలంఘిత పద్మసంభవ
స్తదా శివార్చాస్తవ భావనక్షమః."

శ్రీ శంకరభగవత్పాదులు రామేశ్వరుని ఇల్లా స్తుతించారు. 'చరితం రఘునాధస్య శతకోటి ప్రవిస్తరం, ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనం' అని శ్రీవాల్మీకిమహాముని ప్రవచించారు. 'సేతుబంధనా, భక్తచందనా, ఓ రఘురామా వందనం' అని భకాగ్రేసరుడు త్యాగరాజు గానము చేశారు. అట్టి లోకోత్తరుని పేర వెలసిన రామేశ్వర క్షేత్రమాహాత్మ్యం జగత్ప్రసిద్ధము.

రామ ప్రశస్తి:

ఏ క్షేత్రమున కా క్షేత్రము క్షేత్రరాజమని వర్ణింపబడినను కాశీరామేశ్వరములు భారతీయ హృత్ క్షేత్రములలో సుస్థిరములై, ప్రత్యక్షములై తరతరములుగా విరాజిల్లుచున్నవి. శ్రీమద్రామాయణమునుపోలిన గ్రంథమునూ, శ్రీరామునికంటె లోకోత్తరపురుషుడునూ అరుదనుట అభియుక్తుల మతము. రామారాయణ పారాయణమున వ్యాధులు, కారాగృహాదిబాధలు, అనపత్యతలు, దారిద్ర్యాదిసంకటములు తొలగుటయే గాక భుక్తిముక్తులు కలుగు ననుట పారంపర్యముగా సుప్రతిష్ఠితమైన విశ్వాసము. దైవాంశభవుడైన శ్రీరామచంద్రుడే దైవసహాయాన్ని అర్థించవలసి వచ్చినది. అది కేవలము లీలామాత్రమే అయినప్పటికిన్నీ మానవలోకానికి గుణపారంగా ఉపచరిస్తుంది. శ్రీరాముడు వాలిని సంహరించి సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేసి అతని చెలిమిని, సహాయమును బడసి 'నిహత్య రావణం, సీతామానయిష్యామి' అనే ప్రతిజ్ఞగొని, మహేంద్రాద్రిసమీపమున దేవీపట్నమున నవగ్రహప్రతిష్ఠచేసి లంకావిజయమునకు 'అంకురార్పణ చేసెను'. ఇచ్చటనే రాముడు లక్ష్మణ, నల, సుగ్రీవ, హనుమదాది ఆప్తజనముతో 'వానరబలసమేతుడై రావణేశ్వరుని లంకను జయించుటకు వ్యూహము పన్నెను. అటనుండి దక్షిణదిశగా సముద్రతీరమున కేగి దర్భశయనంవద్ద సాగరుణ్ణి చూచి శ్రీరామచంద్రుడు—

"కథం, నామ సముద్రస్య,
దుష్పారస్య, మహాంభసః,
హరయోదక్షిణంపారం
గమిష్యంతి సమాపాతః"

అని అంటాడు.


త్రిరాత్రములు దర్భశయనుడై సేతుబంధనమునకు వరుణకటాక్షమునకై ప్రార్థించెను. సాగరుడు ప్రార్థన నాలకింపకుండుట వీక్షించి, రాముడు రక్తాంతలోచనుడై, ఉగ్రుడై, "అద్య త్వాం శోషయిష్యామి సపాతాళం మహార్ణవ" అని కోదండము చేకొనగా సాగరుడు మద ముడిగి, పాదాక్రాంతుడై, రాముని చరణసన్నిధిని శరణు వేడెను. అనంతరము దాశరథి 'దశయోజనవిస్తీర్ణం శతయోజన మాయతమ్' అయిన సేతువును నిర్మించి, రావణాదుల నిర్జించి, విభీషణుని లంకాధిపతిగా పట్టము గట్టి సీతాలక్ష్మణహనుమదాది సమేతుడై పుష్పకవిమానము నధిరోహించి, గంధమాదనపర్వతమున విడిసి, ఈశ్వరుని ప్రతిష్ఠ చేసి, ఆరాధించి, బ్రహ్మహత్యాదోషమును నివారణ చేసుకొనెను. అట్టి మహాత్మ్య రాముని పేరిట ఆ ప్రాంతము రామేశ్వ ఆ దేవుడు రామనాథు డయ్యెను. క్లుప్త స్థలపురాణ మిది.

రామశర్మ

పూర్ణ యాత్ర:

యాత్రికులు మున్ముందు సేతుస్నా అనంతరం రామనాథస్వామిదర్శనం చేసెదరు టారు. రత్నాకర, మహోదధుల సాగరస మందలి ఇసుకను సంగ్రహించుకొని త్రివే లీన మొనర్చి, గంగాజలముల గొని మరల శ్వరుని అభిషేకించినపుడే అది పూర్ణయ అగును. నవగ్రహప్రీత్యర్థమూ, రామాను ప్రాప్త్యర్థమూ, యాత్రికులు నవపాషాణప్ర రత్నాకరునియందు గ్రుంకులిడి అచ్చటి నవ పూజ చేసుకుంటారు.


పితృదేవతలకు శాశ్వతదివ్యలోకనివాసా పిండప్రదానం చేస్తారు. ఉదయము సముద్ర ఈ గ్రహమూర్తులకు దూరుడై సాయంత్రం స హితుడై వాటితో కేరింతలు కొట్టుడు ఉంటాడు. ఇచటనే వెలసియున్న త్రి సంగ ధుని యాత్రికులు అర్చించుకుంటారు.



పాంబన్ వంతెన ఇది పెద్దనౌకపోవుటకు దారిఇచ్చుచున్నది.



నౌకవెడలిన తర్వాత రైల్లుపోవుటకు వీలు



శ్రీ రామేశ్వరాలయ గోపురములు శిఖరము.




శ్రీ రామనాథుని ఊరేగింపునకు ఉపయోగించు రజతరథము

త్రము

దర్భశయనం:

అనంతరం దర్భశయనం చేరి, శుచిర్భూతులై సాగరస్నాన మొనర్చి, సముద్రు నర్చించి, సాగరుని మద మణచి, శర ణిచ్చిన, విభీషణునికి శర ణొసంగిన కోదండరామస్వామిని దర్శించుకుంటారు.

రాముని హుంకారంతో పొంగు అణగిన, సాగరసాత్వికస్వరూపం ఇక్కడ గోచరమౌతుంది. ఇచ్చట సముద్రభాగం కల్లోలాకులితం గాకుండా నిస్తరంగంగా ప్రత్యక్షమవుతుంది. ఈ సమీపముననే ఉప్పూరులో శ్రీరాముడు సేతుబంధనాత్ పూర్వము ఓం ప్రథమముగా పూజించిన విఘ్నేశ్వరుడు ఉన్నాడు. రామనాథపురమునకు ఈశాన్యముగా తిరుపులాని అనే దర్భశయనం ఎనిమిది మైళ్లలోను, శ్రీరాముడు నవగ్రహారాధన జరిపిన నవపాషాణం మరోదిశగ దాదాపు పదిమైళ్లలోను ఉన్నవి. దర్భశయనంలో సుప్రసిద్ధ వేదవేదాంగపాఠశాల, వసతిఅయిన సత్రములు ఉన్నవి. రామనాథపురంనుంచి పాంబన్ మీదుగా రామేశ్వరము చేరాలి. పాంబన్ నదిపై రైళ్లు పెద్ద నౌకలు కూడా పోవటానికి అనువుగా నిర్మింపబడిన వంతెన చూడ సొంపుగా ఉంటుంది.



...గా వంతెన మామూలుగా ఉన్న దృశ్యం.

పాంబన్‌కు ఒకదిశగా రామేశ్వరమూ, మరో దిశను ధనుష్కోటి ఉన్నవి.

రామేశ్వరద్వీపం:

రామేశ్వరద్వీపం 15 మైళ్లు నిడివీ, 8 మైళ్ళు వెడల్పూ ఉన్న సికతాద్వీపం. ఈ ద్వీపంపై మనోహరమైన నారికేళ, కదళీవనాలు ఉన్నవి. రామేశ్వరంస్టేషనులో దిగితే ఏశాఖవారికా శాఖాసత్రాలు ఉన్నవి. రామేశ్వరం మేజరుపంచాయతీ. 16 వేల జనాభా. 12 వేల రూ. ల ఆదాయం. ద్వీపంపై రామేశ్వరం, తంగచ్చిమఠం, ధనుష్కోటిస్టేషన్లు ఉన్నవి. గంధమాదనపర్వతం ఉన్నది. ప్రజలు ముఖ్యంగా యాత్రికులపైన, ముత్యాలు, శంఖాలు మొదలైనవి పట్టుకొని, విక్రయించుకొని బ్రతుకుతారు. జొన్న సకృత్తుగా పండుతుంది. సరుకుతోటలు ఉన్నవి. రామేశ్వరంపట్నంలో అనేకభాషల వారు కాపురం ఉంటున్నారు. మంచి నీటి పంపులు, విద్యుద్దీపాలు, ఆసుపత్రులు ఉన్నవి. మలేరియా నివారింపబడినది.

ఆలయ ప్రాగల్భ్యం:

రామేశ్వరాలయం దక్షిణ భారతావనిలో తలమానికమని చెబితే ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు. నాలుగువైపులా ఎత్తైన గోపురాలు, లోపల శిల్పకళాప్రపూర్ణములైన స్తంభములు, కన్నులపండుచేసే దివ్యవాహనములు, అపూర్వమైన దీపాల వరుసలు, ఎచ్చట చూచిననచ్చట పవిత్ర తీర్థములు, దిగ్భ్రమ గొల్పుతూ ఉంటాయి. దేవాలయశోభ వివిధాలంకృతిమనోజ్ఞ రసాత్మకములైన నడవలే.

శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పాండ్య రాజులు, సేతుపతులు ఉద్ధరించారు. 700 ఏండ్లక్రితం సింహళ ద్వీపంనుంచి సముద్రవాతాఘాతాని మొక్కవోని చలువరాతితో గోపురాలూ, దేవాలయమూ నిర్మించారు. ఛత్రపతి శివాజీ రామలింగస్వామికి పరమ భక్తుడు. ఆతనికిరీటము నేటికినీ స్వామిజవాహరీలో పదిలంగా ఉన్నది. కాకుత్స్థవంశీకులము అని ఇప్పటికీ నేపాల్ సంస్థానాధీశ్వరులు చెప్పుకుంటూ, రామనాధుని స్వహస్తాలతో అభిషేకించి కొంత రుసుము చెల్లిస్తారు. భారత సామ్రాజ్య నిర్మాతలు రామనాధునికి సమర్పించిన నవరత్నహారాలు, వజ్రవైడూర్యమాణిక్యాదులు అమూల్యమైనవి ఆలయంలో కొల్లలుగా ఉన్నవి. రామలింగేశ్వరునికి లక్షా ముప్పయిరెండువేల రూపాయల కిమ్మతుచేసే వజ్రకిరీటమూ, లక్షా యాభైయెనిమిది వేలు చేసే బంగారుపల్లకీ, దాదాపు లక్షరూపాయలు చేసే రజతరథమూ, వేలకు వేలుఖరీదు చేసే రావణాది వాహనములు ఉన్నవి. వసంతనవరాత్ర్యుత్సవమూ, కల్యాణోత్సవమూ, శరన్నవరాత్ర్యుత్సవమూ, భక్తులు చూస్తే అవశ్యము తన్మయత పొందితీరుతారు. ఆలయప్రాంగణమంతా "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్నట్లు ఈశ్వరలింగములే సాక్షాత్కరిస్తాయి. ప్రాచ్యదిశను రెండు గోపురములు, రెండు ద్వారములు, దక్షిణపశ్చిమ ఉత్తర దిశల ఒకొక్కద్వారము ఉన్నవి. ప్రాచ్యదిశను ఒక్కద్వారము దాపుల రుద్రరూపుడైన ఆంజనేయస్వామిబృహన్మూర్తి ప్రతిష్ఠితమై ఉన్నది. లోపల ఉన్న మండపాలూ, అచ్చటి విపణులలో అమ్మే రంగురంగుల శంఖాదికములూ, అల్లిన బుట్టలూ, స్ఫటికలింగములూ, కళ్లు మిరుమిట్లు గొల్పేట్లు ఉంటాయి. కొత్తగా ప్రవేశించిన యాత్రికునకు ఆ లోపలి నిర్మాణము ఒక లీలగా గోచరించక తప్పదు. ముఖ్యంగా దేవాలయమధ్యమున ఉన్న రామనాథుడు, పర్వతవర్ధనీ అమ్మవారు, హనుమత్ప్రతిష్ఠిత కాశీవిశ్వేశ్వరలింగమూ, సేతుమాధవస్వామీ, ఆలయమందలి శతసహస్రకోటిలింగములూ దర్శనీయములు.

సంప్రదాయం:

ఈ ప్రతిష్ఠనుగూర్చి సంప్రదాయసిద్ధమైన కథ ఒకటి ఉన్నది. రావణసంహారానంతరం సీతాలక్ష్మణహనుమత్ వానరసమేతుడై శ్రీరామచంద్రుడు అగస్త్యాదిమునులకు వాగ్దానంచేసినప్రకారం గంధమాదనానికి వచ్చాడు. రావణుడు శివభక్తుడుగనుక, బ్రాహ్మణుడుగనుక రాముడు బ్రహ్మహత్యానివారణార్థం ఈశ్వర ప్రతిష్ఠ చేయాలని మునులు తీర్మానం చేశారు. అందు ముహూర్తం నిర్ణయించి కాశీ వెళ్లి ఆంజనేయులవార్ని ఒక లింగం తీసుకురమ్మన్నారు. రాములవారు రెండు రోజులు ఉపవాసం చేసి శివధ్యానం చేశాడు. జ్యేష్ఠమాసం పూర్వపక్షదశమీసోమవారం హస్తానక్షత్ర, వృషభలగ్నమున స్వామివారి ప్రతిష్ఠ అని నిర్ణయించారు. ముహూర్తం దగ్గరకు వచ్చేసింది. ఆంజనేయులవారు రాలేదు. ఈలోపున సీతామ్మవారు క్రీడార్థం నిర్మించిన సైకతలింగానికే ప్రతిష్ఠ చెయ్యాలని తేల్చారు. సరే ప్రతిష్ఠ జరిగిపోయింది. శివుడు గౌరీసమేతంగా ప్రత్యక్షమై సీతారాములకు సాక్షాత్కరించాడు. వారి అభీష్టం నెరవేరుగాక అని ఆశీర్వదించాడు. ఈలోపున హనుమంతుడు తిరిగివస్తుండగా బ్రహ్మమానసపుత్రుడు అడ్డుపడి ఓ రామభక్తాగ్రేసరా, సరే రాముడు బ్రహ్మహత్యానివారణార్థం ప్రతిష్ఠ చెయ్యడానికి ఒక లింగం తీసుకు వెడుతున్నావు; బాగానే ఉంది. నువ్వుమటుకు ఎందరో బ్రాహ్మణులను చంపలేదా? కనుక నువ్వుగూడా ఒక లింగాన్ని తెచ్చుకోమని వెనక్కు పంపాడు. అతను తనకు కూడా ఒక లింగాన్ని తెచ్చుకొనివచ్చేసరికి ఈశ్వర ప్రతిష్ఠజరిగి పోయినందున ఆగ్రహావేశుడై తన్ను అవమానించినందుకు వ్యధితుడయ్యాడు. శ్రీరామచంద్రుడూ, ఇతరులూ ఆయనకు పరిస్థితి నచ్చచెప్పజూచారుగాని హనుమంతుడికి బోధపడలేదు. సరే ఈ లింగాన్ని పీకి నువ్వు తెచ్చిన లింగాన్ని ప్రతిష్ఠచెయ్యమన్నారు. హనుమంతుడు తన వాలాన్ని ఆలింగానికి చుట్టి లాగేసరికి తోక తెగి రక్తపాత మైందిగాని లింగం కదలి రాలేదు. హనుమంతుడు సత్యాన్ని గ్రహించి క్షమాభిక్ష కోరాడు. రాములవారు అప్పుడు హనుమంతుడు తెచ్చిన 'కాశీ విశ్వేశ్వరుణ్ణి' సికతాలింగంప్రక్కనే ప్రతిష్ఠింపచేశారు. ప్రధానదేవాలయానికి గంధమాదన పర్వతానికి వెళ్లే మార్గంలో హనుమంతుని తోక తెగి రక్తసిక్తమైన సైకత మని యాత్రికులకు ఇప్పటికీ చూపిస్తూ ఉంటారు. రామనాథుని దర్శనం చేయడానికిపూర్వం లక్ష్మణేశ్వరం, అగ్నితీర్థం జటాయుతీర్థం, వాలితీర్థం, మున్నగు అనేకతీర్థాల్లో యాత్రికులు స్నానం చేసి, దేవాలయప్రాకారంలో ఉన్న సర్వతీర్థం, కోటితీర్థం మున్నగు 36 తీర్థాల్లోస్నానం చేస్తారు. కాశీనుంచి వందలాది తీర్థవాసులు వచ్చి గంగాజలాలతో రామనాధునికి అభిషేకాలు జరుపుతూ ఉంటారు. దేవాలయంలో అర్చకత్వం మహారాష్ట్రబ్రాహ్మణులు చేస్తున్నారు. ఈశ్వరుని ఆభరణాది అమూల్యవస్తువుల రక్షణకు ఆలయప్రాకారంలోనే ఒక పోలీసు స్టేషను ఉంది.

దేవస్థానం:

దేవాలయ పరిపాలన 5 గురు సభ్యులుగల దేవస్థానకమిటీవారిచేత గవర్నమెంటువారు చేయిస్తున్నారు. అందులో ఒకరు సేతుపతి, దేవకోట జమీందారు ఒకరు, మిగతాముగ్గుర్ని ప్రభుత్వంవారు నియమిస్తారు. ప్రధానధర్మకర్త మధురలో ఉంటారు. శివగంగ ప్రాంత ఆంధ్రులు మంత్రవాది శ్రీకోదండరామయ్యగారు ఆలయ కోశాధికారిగా ఒక పుష్కరం పైగా

(18-వ పేజీ చూడుడు)

బాలానందం

బంగారు లేడి

అనువాదము : శ్రీ అక్కవరము సీతారామయ్య

అనగాఅనగా ఒక రాజు. ఆ రాజు కొక కొడుకు. ఆతని పేరు బ్రహ్మాంగరుడు. అతనికి మిట్టమధ్యాహ్నపు సూర్యునికుండే తేజస్సు, పున్నమనాటి చంద్రునికుండే చక్కదనము వున్నాయి. ఆ రాకుమారుడు ఒకరోజున వేటకు వెళ్ళాడు. పగలంతా తిరిగితిరిగి వేటాడాడు. కాని అతనికి సంతృప్తి కలుగలేదు. ప్రొద్దు గ్రుంకవస్తున్నది. ఇంతలో ఒక పొదలోనుంచి ఒక బంగారులేడి మెఱిసి రాకుమారుని కనులకు మిఱుమిట్లు గొల్పింది. వెంటనే పొదను చుట్టవేయమని పరివారాన్ని ఆజ్ఞాపించి, ఏవైపునుంచీ లేడి పాఱిపోతుందో వెయ్యికండ్లతో కనిపెట్టి వుండమని హెచ్చరించాడు. అశ్వికదళము పొదను నలువైపుల చుట్టుముట్టింది. బంగారులేడి మధ్యలో చిక్కుకుంది. పాఱిపోవలె నని శరవేగముతో దురదృష్టవశాత్తు రాజకుమారుడున్న వైపునకే పరుగెత్తింది. రాజకుమారుడు వడిసి కొమ్ములు పట్టుకొని నిలవేశాడు. లేడి మానవవాక్కులతో "రాజా! నన్ను విడువు. నీకు లెక్కకుమీఱిన ధనధాన్యాదుల నిస్తాను" అని విలపించింది. కాని రాజు చిఱునవ్వు నవ్వి "అలా వీలు లేదు. నాకు సకలసంపదలూ వున్నాయి. బంగారులేడిమాత్రము లేదు" అని అన్నాడు. "అయితే నన్ను వదలిపెట్టవూ? నిన్ను నా వీపుమీద ఎక్కించుకొని ప్రపంచమంతా తిరిగి సకలక్షేత్రాలను చూపిస్తాను. ఇలాంటి భాగ్యము మానవుడికి లభించడం అసంభవం" అని వినయముట్టిపడేటట్టు పలికింది.

సరేనని బ్రహ్మాంగరుడు చివాలున లేడిపైన ఎక్కి కూర్చున్నాడు. తక్షణమే ఆబంగారులేడి పక్షివలె అంతరిక్షానికి ఎగిరి రెప్పపాటులో కనుచూపుమేఱ దాటిపోయింది. ఏడు పగళ్లు, ఏడు రాత్రులు గడిచాయి. రాజకుమారుడు యీ కాలములో ప్రపంచాన్నంతటినీ చిత్తరువును చూచినట్లు చూచాడు. ఏడవరోజు సాయంకాలము బంగారులేడి భూమిమీదకు దిగి రెప్పపాటులో మటుమాయమయింది. ఇలాంటి దేశాన్ని రాజకుమారుడిదివర కెన్నడూ చూడలేదు. అంతా క్రొత్త. అంతా వింత. ఇల్లుగాని అడుగుల జాడగాని కనుపడుతుందేమో నని అటూ యిటూ తిరిగి చూశాడు. ఇంతలో ఒక శతవృద్ధుడు ఎదురై "ఇక్కడికెలా వచ్చావు నాయనా! దేనికోసం వెతుకుతున్నావు!" అని అడిగాడు. ఏవిధంగా తను బంగారులేడిమీద ప్రయాణం సాగించిందీ, భూమిమీద దిగిన అనుక్షణంలోనే లేడి మాయంకావడం, కాని దేశములో తనకు గలిగిన దురవస్థ మొదలైన సంగతు లన్నిటిని పూసగ్రుచ్చినట్లు తాతకు చెప్పి దుఃఖించాడు. "భయపడకు నాయనా! నీ విప్పుడు భేతాళలోకంలో వున్నావు. నాకు ప్రాణభిక్ష నిచ్చావు. నేను జాస్రుదులు అనే భేతాళుడిని. నేను వుండగా నీకైన యీగకూడ వ్రాలదు" అని ధైర్యం చెప్పి, రాజకుమారుణ్ణి తన యింటికి తీసికొని వెళ్ళి, రాజోచితసత్కారములను జరిపి, నూఱుతాళపుచేతుల నిచ్చి "ఇవి నా భవనములకు, ఉద్యానవనములకు తాళపుచేతులు. అక్కడ విహరిస్తూ సకలసౌఖ్యాలను అనుభవించు" అని చెప్పాడు.

రోజుకు ఒక్కొక్క ఉద్యానవనముచొప్పున తెఱచి అందులోని భవనములను పరీక్షిస్తుండేవాడు రాజకుమారుడు. ఒకదానిలో బంగారము, ఒకదానిలో ఆభరణములు, మరియొకదానిలో వస్తుసామగ్రి, కోరిన వస్తువులు వున్నాయి. ఈవిధంగా తలకిస్తూ నుఱో భవనమును ప్రవేశించాడు. అచ్చట అన్నీ విషప్రాయమైన వస్తువులే. రాళ్లు, రప్పలు. పురుగు పుట్రలు. కాని ఆ భవన మున్న ఉద్యానవనము మాత్రము సాటిలేనిది. ఎటు చూచినా ఏడుమైళ్ల పొడవు. నిండా నిట్రమైన చెట్లు. రంగురంగుల పువ్వులు. తియ్యని నీటితో నిండిన సరస్సులు. వాగులు, వంకలు. మధ్యమధ్య సూర్యమహాళ్లు. ఝుమ్మని తిరిగే గండుతుమ్మెదలు. పక్షుల కిలకిలలు. రాజకుమారుడు ఉద్యానవనమంతా కలియదిరిగి అలసి సొలసి చలువరాతిసూర్యమహాలులో పట్టుపరుపులు పరచిన బంగరు పట్టెమంచము మీద మైమఱచి నిద్రించాడు.

శాపసంద అనే దేవకన్య పావురము రూపముతో ఆకాశములో విహరిస్తూ నవయౌవనములో వున్న అపరూపసుందరుడగు రాజకుమారుణ్ణి చూచి భూమిమీదకు దిగి స్వస్వరూపమును ధరించి ముగ్ధురాలై మోహావేశము చేత మానవుడని యైనను తలపక నిద్రించుచున్న రాజకుమారుణ్ణి సమీపించి గాఢముగా ముద్దు పెట్టుకొనినది. రాజకుమారుడు అదరిపడి లేచి ఒకానొక భువనైకసుందరి తన ఎదుట మోకరిల్లియుండడం చూచి కళవళపడ్డాడు. "ప్రియుడా! నీకొఱకు దేశదేశాలు తిరిగానే?" అని మందమైన సిగ్గుతో అన్నది దేవకన్య. రాజకుమారునికి ప్రథమదర్శనమందే శాపసందయందు గాఢమైన ప్రేమ కుదిరింది. వారిద్దరు ఉత్తరక్షణంలోనే పెండ్లి చేసికొన నిశ్చయించారు. జాస్రుదులు భేతాళలోకంలో ఎంత బలవంతుడో రాజకుమారుడికిదివఱకే ఆకళింపయింది. అందుచేత అతనిని సంప్రదించడం శ్రేయస్కరమని తలచాడు.

జాస్రుదులు పెండ్లికి సమ్మతించడమే గాకుండా సంతోషాతిరేకముచేత "మీరు ఇక్కడనే వుండిపోండి కొన్నాళ్లకు మీరు మీ స్వస్థలములను గూడ మరచిపోతారు" అని కోరాడు. బ్రహ్మాంగరునికి శాపసందకు పెండ్లి జరిగింది. బహుకాలము గడిచింది. వారికిమాత్రము అవి కొద్దిరోజులే. చిట్టచివరకు రాజకుమారుడికి యింటిమీద గాలి మళ్ళింది. తల్లి, దండ్రి, స్వపరివారము తలపుకు రాసాగాయి. పరధ్యానంగా భార్యతోగూడ తనవారినిగురించిన మాటలను పలుకసాగి అన్నపానాదులకు గూడా వైదొలగి చిక్కి శల్యమైనాడు. జాస్రుదులు రాజకుమారుడు రాత్రులందు తన భార్యతో యింటి ప్రస్తావన తెచ్చి విచారించినప్పుడల్లా తనుకూడ దుఃఖించేవాడు. చివరకు నీవిచారానికి కారణమేమిటని ప్రశ్నించాడు అచ్చటినుండి వదలించుకొని యింటికి పోవలె నని చెప్పి తన ఆప్తమిత్రుడికి బాధ కలిగించేనన్న బెంగతో క్రుంగి కృశించి పోవడమే ఉత్తమమని తలచునంతటి సధ్మణుడు రాజకుమారుడు. కాని యింటిమీది వ్యామోహామును వదిలించుకొనలేక "మిత్రుడా! నన్ను యింటికి పోనివ్వు. నా తల్లిదండ్రులను చూడక క్షణము నిలువలేను. నాకు దేనిమీదా వాంఛ లేదు. నా రాణికూడ నాతో వచ్చేస్తుంది. మిత్రుడా! నన్ను కరుణించవా! లేకపోతే నా ప్రాణము లుండవు" అని దీనంగా బ్రతిమలాడాడు. జాస్రుదులు తన ప్రాణదాతస్థితికి చింతించి "సరే. నీవు ఇక్కడికి వచ్చినతరువాత ప్రపంచమంతా మాఱిపోయింది. అక్కడ నీకు అన్నీ కష్టాలే వస్తాయి. జరిగిన దానికి పశ్చాత్తాపడతావు. తిరిగి ఇక్కడికి రావా లనుకుంటావు. ఇదిగో! ఈ వెంట్రుకను నీతో తీసుకొని వెళ్లు. ఆపద సమయంలో దీనిని కాల్చు. నేను వచ్చి నిన్ను రక్షిస్తాను" అని చెప్పి విచారముతో రాజకుమారుని భార్యాసమేతంగా తన పట్టణసమీపాన విడిచాడు.

భేతాళుడు చెప్పినట్టే అంతా మాఱిపోయి వుంది. తల్లిదండ్రులు చనిపోయారు. శత్రువులు రాజ్యం చేస్తున్నారు. ముసలి వేటకాడొక్కడు తప్ప అతనిని గుర్తించినవారు లేరు. అతను తిరిగి తన యజమానుని కలుసుకోగలిగినందుకు సంతోషించాడు. కాని రాజకుమారుడికి ఆశ్రయమివ్వడం తనకేముప్పని తెలుసుకున్నప్పటికిని విశ్వాసపాత్రుడు గనుక వారు అటకమీద నివసించడానికి సమ్మతించాడు. మా తల్లి గ్రుడ్డిది. మీ రాకపోకలను గమనించలేదు. నీకు వేట అంటే యిష్టంగదా! వేటలో నాకు సహాయం చేస్తూవుండు" అని చెప్పాడు వేటకాడు. కాలపరిణామంలో ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయి.

తేజశ్శాలి యయిన రాజకుమారుడు సుకుమారి యయిన భార్యతో వేటకాడి అటకమీద తల దాచుకున్నాడు. ఒకరోజున రాజకుమారుడు వేటకువెళ్లినప్పుడు శాపసందకు తలకు నీరుపోసుకొనే అవకాశం లభించింది. ఆమెది బంగారు జుత్తు. చిక్కు తీసికొని ఆరపెట్టుకొంటున్నప్పుడు అది మడిమలవరకు జీరాడుతూ సూర్యకిరణపుంజమువలె ప్రకాశించింది. గాలి ధారాళముగా లోపలి కొచ్చేందుకు కిటికీతలుపు తెఱచింది. అది వీధివైపు కున్న కిటికీ. సరిగా అదేసమయానికి ఆ పట్టణ రక్షకదళవాయి వీధివెంట పోవడం తటస్థించి తలుపు తీస్తున్నప్పుడు కలిగిన ధ్వనికి ఆవైపు చూడటంలో శాపసంద అతని కళ్ల పడ్డది. ఆ దృశ్యాన్ని చూచి గుఱ్ఱముమీదివాడు అట్టే మూర్ఛపోయి



భారతదేశంలోని బర్మా రాయబారి కుమారైలూ అనుచరవర్గం, దేవనాగర లిపిలో హిందీ నేర్చుకుంటున్నారు.


పడ్డాడు. వెంటవున్న సేవకులు అతనిని ఇల్లు చేర్చారు. అక్కడకూడా 'బంగారు ఛత్తు కలిగిన దేవకన్య వేటకాడి అటక మీద వున్న' దని పలవరించసాగాడు. అందరూ అతనికి భూత మావేశించిందను కున్నారు. ఈ మాట రాజుగారి చెవిని కూడా పడ్డది. వేటకాడి యింటికి వెళ్ళి తక్షణం తనిఖీ చేయవలసిం దని భటులను పంపించారు. "నేనూ నా కొడుకూ తప్ప యింకెవరులేరు నాయనా! కావలిస్తే మీరే స్వయంగా చూసు కోండి. నన్ను నాబిడ్డను మాత్రము రక్షించండి" అని ప్రార్థించింది వేటకాడి గుడ్డితల్లి. ఈ సంభాషణను శాపసంద విని వెంటనే తలుపు బిగించి కత్తితో యింటికప్పులో కన్నం చేసింది. రాజ భటులు తలుపు పగులగొట్టి లోపల ప్రవేశించేలోపల పావురము రూపముతో ఎగిరిపోయింది.

ఈ విధంగా రాజకుమారుణ్ణి అర్థాంతరంగావిడిచి పోవలసివచ్చినందుకు బాధపడి గుడ్డిఅవ్వ చెవులో "నేను మరకతగిరిమీది మాపుట్టింటికి వెళుతున్నాను" అని చెప్పిపోయింది. సాయంకాలానికి రాజకుమారు డింటికి వచ్చి చూస్తే అటక ఖాళీగా వుంది. తన ప్రియురాలిని కానక బహు దుఃఖించాడు. జరిగిన దేమిటో అవ్వ సరిగా చెప్పలేక పోయింది. కాని దేవకన్యమహిమచేతనో యేమో "నేను మరకతగిరిమీది మాపుట్టింటికి వెళుతున్నాను" అన్న మాటలు రాజకుమారుడి చెవిని పడ్డాయి. కొంత ఊరట చెందాడు. కాని మరకతగిరి ఉనికిని తలచుకొన్నపుడు మాత్రము అతనికి కలిగిన దుఃఖ మింతింత గాదు. నేలపై దొర్లిదొర్లి బావురు మని ఏడ్చాడు. "ప్రియురాలా! నారాణీ! నన్ను విడచి పోయితివా!" అని విలపించాడు. చివరకు భేతాళుడు యిచ్చిన వెంట్రుక గుర్తుకొచ్చి దానిని కాల్చాడు. వెంటనే జాసుద్రులు ప్రత్యక్షమై ఏమి కావాలని అడిగాడు. మరకతగిరికి దారి చూపించు" అని గావుకేక పెట్టాడు. భేతాళుడు తల అడ్డంగా తిప్పి "ప్రాణములతో నీవు దానిని చేరలేవు నాయనా నామాట విను, జరిగినదానిని మరచిపో. శేషించిన జీవితాన్నయినా సుఖవంతం చేసుకో" అని అన్నాడు జాసుద్రులు. "నా ప్రియురాల్ని పోగొట్టుకొని నేను జీవించలేను. నాకు మరణమే నిశ్చయమయితే నా ప్రియురాలి అన్వేషణలో ప్రాణాలు సంతోషంగా వదల డానికి సిద్ధంగా వున్నాను." అని మారు పలికాడు రాజకుమారుడు. రాజకుమారుడి దృఢనిశ్చయానికి మెచ్చి జాసుద్రులు అతనిని భేతాళలోకానికి తీసుకొనివెళ్ళి మంత్రదీపిత మయిన బెత్తమును యిచ్చి నానకుచందు అను భేతాళుని యింటికి దారిచూపించి "నీకు అనేకకష్టాలు వస్తాయి. కాని సర్వకాలసర్వావస్థలయందు బెత్తమును మాత్రము చేతిలో వుంచుకో. ఇదే నీకు సర్వరక్ష. నేను నీకు చేయగలిగిన సహాయ మింతే. నానకుచందు మా అన్న. ఆయన నీకు ఓపినంత సహాయం చేస్తాడు" అని సలహా యిచ్చాడు. అష్టకష్టాలు పడి బ్రహ్మాంగరుడు నానకుచందుగృహమును చేరుకోగలిగాడు.

అతడు పన్నెండుసంవత్సరములు నిద్రించినతరువాత అప్పుడే మేల్కొన్నాడు. సహజంగానే అతనికి చాలా ఆకలిగా వుంది. రాజకుమారుణ్ణి చూడ గానే తృప్తికరమయిన ఆహారము దొరికిం దని లొట్టలు వేయడం మొదలెట్టాడు. కాని రాజకుమారుడి చేతిలోని బెత్తమును చూచి ఆత్రుతను తగ్గించుకొని ఏమి కావలెనని అడిగాడు. నానకుచందు కథ అంతా విని "ప్రాణములతో నీవు దానిని చేరలేవు నాయనా! నామాట విను, గతాన్ని విస్మరించు" అని అభిప్రాయ మిచ్చాడు. కాని అందుకు అతనికి జాసుద్రులుకు లభించిన సమాధానమే లభ్యమైంది. నానకుచందు రాజకుమారుని ప్రత్యుత్తరమునకు సంతసించి నీలాంజనశిలపొడిగల పెట్టె నొకదానిని యిచ్చి రక్షకుడు అనే భేతాళుని యింటికి దారి చూపించి "ఆయన మా పెద్దన్న. నీకు ఏదైనా సహాయమయితే ఆయనద్వారానే కావాలి. అవసరమయినప్పుడు కొంచం యీ పెట్టెలోపొడిని కండ్లకు రాచుకొని ఎక్కడికి వెళ్లా లనుకుంటే అక్కడికి వెళతావు" అని సలహా యిచ్చాడు. సకలకష్టాలను అనుభవిస్తూ రక్షకుని గృహమును సమీపించి అతనికి తన కథ నంతను వినిపించి బెత్తమును, పెట్టెను చూపించాడు. రాజకుమారుడి ధైర్యానికి నిశ్చలప్రేమకు సంతుష్టి చెంది "ఇదిగో టోపీ, దీనిని ధరించినవాడు అదృశ్యు డవుతాడు. ఉత్తరదిక్కుగా ప్రయాణం చేయి. బహు దూరాన మరకతగిరివున్నది. అది ఎక్కినకొలది పెరుగుతూనే వుంటుంది. పొడిని కళ్ళకు రాసుకొని పర్వతాన్ని సమీపించాలనుకో. పర్వతశిఖరం మీద మరకతపురి అనే పట్టణ ముంది. టోపీని ధరించి పట్టణాన్ని ప్రవేశించు. అక్కడ నీ ప్రియురాలిని అన్వేషించు" అని చెప్పాడు రక్షకుడు.

బ్రహ్మాంగరుడు ఆనందంగా మరకతగిరిని చేరి టోపీసాయంతో మరకతపురిని ప్రవేశించాడు. పట్టణాన్నంతను గాలించాడు. ప్రియురాలిజాడ లేదు. తన్ను వదలి తన ముద్దులపట్టి తన ప్రియుని వద్దకు భూలోకమునకు ఎప్పుడు ఎగిరి పోతుందో నని శాపసందను తండ్రి ఏడు కోటగోటల మధ్య బంధించాడు. శాపసంద తన ప్రియునిగురించి విచారపడుతున్నప్పుడల్లా "నీ భర్త నీదగ్గఱకు వస్తే సరే లేకపోతే నీవుమాత్రము అక్కడికి వెళ్లడానికి వీల్లేదు" అని ఖండితంగా చెప్పేవాడు. శాపసంద మానవుడయిన తన భర్త ఆదేవతాపర్వతాన్ని చేరలేడు గదా అని రేయింబవల్లు కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తూవుండేది. రాజకుమారుడు పట్టణమంతా తిరుగుతుండగా ఒకదాసీ, రోజూ మధురభక్ష్యములతో నిండిన పళ్ళెమును ఒకానొక ద్వారముగుండా తీసికొని వెళ్లుతుండటం గమనించి ఇది విచిత్రంగా వుందని ఒకరోజున దాసీని

(16-వ పేజీ చూడుడు)



భారత దేశపు సైనిక లెక్కల తయారీ - కూడికల యంత్రాలవద్ద పనిచేస్తున్న స్త్రీలు.

బాలానందం :

★ బాలరాజు కథ ★

శ్రీ వేమూరి వేంకటేశ్వర్లు

ఒకానొక రాజ్యమునకు ఒక బాలుడు రాజయ్యెను. వాడు బాలుడుగాక మూర్ఖుడును అయియుండెను. ఇట్లుండ ఒకనాడు కొందఱు దొమ్మరవాండ్రు రాజునొద్ద సెలవుతీసుకొని త్రాటిమీద నడుచుట, బండలు రొమ్మమీద పగల గొట్టుట లోనగు అనేకవిధము లైన సాము, గారడీల చేసిరి.

అపుడు రాజు వారిని జూచి "ఆహా యింత దేహలాఘవము గలవారు యుద్ధభటు లయినచో ఎవరు మనల నెదిరింపగలరు? ఇప్పు డుండువారు బొమ్మలవలె నిలబడువారు, కుడితిరుగు ఎడమతిరుగు అను సంజ్ఞల ప్రకారము కీలుబొమ్మలవలె తిరుగువారు, దూరము నుండి తుప్పని కాల్చువారే నైయున్నారు. వీరితోపాటు యుద్ధభటులు మల్లయుద్ధము చేయగలరా!" అని తలచి వృద్ధమంత్రి చెప్పినను వినక తనయట్టి వారి మాట విని దొమ్మరుల నందరను దండులో చేర్చుకొని చిరకాలముగ నున్న భటుల నందరను కొలువులో నుండి తీసివేసెను.

ఈ నూతనశూరులకు తగిన ఆయుధములు లేవని వెదుకకా ఒకనాడుక్షౌరము చేసుకొనునపుడు మంగలికత్తి వెండ్రుకలు గొరుగుటయు తక్కిన ఏట్టి కత్తులు దానివలె పని చేయకుండుటయు చూచి రాజు దొమ్మరులందరకు ఆయుధములుగా ఆ మంగలికత్తు లిప్పించెను. రాజభక్తిగల మంత్రి ఆ నృపుని వింత నడవడి చూచి విచారపడి వీని నెట్లులైన చక్కబెట్టవలయు నని యొక యుక్తి పన్నెను.

తీసివేయబడిన యుద్ధభటులను నాయకులను అందరను బిలచి ఆర్యులారా! మన మీ రాజు తాతతండ్రుల తరమునుండి వారి యుప్పు దిని బ్రతికిన వారము. ఇప్పు డితడు తెలివిమాలిన వాడై వ్యవహరించుచున్నాడని మనము విడిచిపోరాదు. మీ రెందును పోవలదు. ఆరునెలల జీతము మీకు నే నిచ్చెదను. మీ రందరును తగిన ఏర్పాట్లు చేసికొని ఉన్నట్టుగ నుండి కోట ముట్టడింపుడు. అపుడు రాజు తన బలముతో యుద్ధమునకు వచ్చును. నేను సైగచేయునపుడు చాలింపు డని చెప్పెను.

వారును ఒకనా డుదయమునకుముందే కోట ముట్టడించిరి. రాజు తన మంగలి కత్తుల దొమ్మరదండుతో యుద్ధమునకు బయిలుదేరెను. దొమ్మరులందరు కోటగోడలమీద నిలబడి మహారాజా చూడమని లాగులువేయువారును బాహువు లప్పళించువారును వేడుక చూడుమనువారును కత్తులు త్రిప్పువారునై పలుపోకలు పోవుచు ఎదుటివారు డాండాంఅని వేయు గుండుదెబ్బలకు క్రింద పడుచుండిరి.

రాజు భయపడి గతి ఏమియని మంత్రి నడిగెను. అప్పుడు మంత్రి, మహారాజా మీరు కొలువులోనుండి తీసివేయగా మన భటులు శత్రువులతో కలసి యుద్ధమునకు వచ్చినారు. వారికి ఆరునెలల జీతము బహుమానముగా నిచ్చి కొలువులో చేర్చుకొందురేని సంధి చేసెద నని చెప్పి యుద్ధము చాలించునటుల చేసి మరల వారి కందరకు కొలువు లిప్పించి దొమ్మరులను కోట నుండి త్రోసివేసిరి.

అనుసరించాడు. దాసి . షడుద్వారములను దాటి లోపల ప్రవేశించింది. దాసీ వెనువెంటనే అదృశ్యుడైవున్నాడు రాజకుమారుడు. అక్కడ శాపసంద కన్నీటి ధారలను వదలుతూ కృశించిపోయి వున్నది. ఆ దృశ్యాన్ని చూడటంతోనే వెళ్ళి పాదాక్రాంతు డగుదామనుకున్నాడు గాని అదృశ్యుడైవున్నానన్నసంగతి గుర్తుకొచ్చి దాసీ తిరిగి పదిలముగా తలుపులు బంధించి పోయేవరకు తమాయించుకొన్నాడు. అదృశ్యుడై వుండే శాపసందతోపాటు తను కూడ భుజించడం మొదలుపెట్టాడు. శాపసందకు నోటిరుచిపోయి చాలరోజు లయింది. కొంచంగూడ తినలేకపోయింది. కాని పళ్ళెములోని వస్తువులు మాయమవుతూండడం చూచి కలగంటున్నానా అని అనుకుంది. అన్నీ పూర్తి కాగానే పరాయిమనిషి గదిలో వున్నాడనుకొని "నా పళ్ళెములో నాతో భోంచేస్తున్న దెవరు?" అని నీరసంగా అటిచింది. బ్రహ్మంగరుడు టోపీ తీశాడు. రాజకుమారుడు చనిపోవడంచేత అతనిదయ్యము తనమీది మక్కువచేత వచ్చిం దని అతనిపేరు పెట్టి పిలుస్తూ బిగ్గఱగా ఏడ్చింది. కాని రాజకుమారుడు ఆమెను కౌగలించుకొన్నప్పుడు ఆమె ఏడ్పు నవ్వుగా మారింది. మరుసటి దినమున రాకుమార్తె ప్రక్కన చక్కని రాకుమారు డుంట దాసీ చూచి దిగ్భ్రమ చెంది రాజుగారితో నివేదించింది. రాజు తనకూతురి నోటి వెంట సంగతంతయు విని రాజకుమారుడి ధైర్యానికి మెచ్చి శాపసందను వెంటనే విడుదల చేయించి 'ఆమెభర్త ఆమెవద్దకే వచ్చాడు' అని రాజకుమారుణ్ణి యువరాజునుగా చేశాడు. బ్రహ్మంగరుడు, శాపసంద చిరకాలము సుఖంగా ఆ రాజ్యములోనే వున్నారు.




స్వాతంత్ర్య గీతము

శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ

జయజయ భారత
జయజయజననీ !
జయజయపావని !
విశ్వమణీ !
ప్రాచ్యశిఖరిపై -
ప్రభాతసూర్యుడు
స్వాతంత్ర్యోజ్జ్వల
జ్ఞానమహస్సుల
ఉదయమ్మాయె
శుభోదయమూ !
మహోదయమూ !
సర్వోదయమూ !
జయ జయ.
లోకబాంధవుడు
ఏకచక్రరథి
వినువీధులలో
విజయపతాకల
ఉదయం -
భారతవర్ష -
ప్రజ్ఞాజ్యోతి
ఆసియాఖండ -
ఆశాజ్యోతి
ప్రాచీగోళ -
బ్రహ్మజ్యోతి
వెలుగిడి బ్రోచెడి
విశ్వజ్యోతి.
ఉదయం బాయె
శుభోదయమూ !
మహోదయమూ !
సర్వోదయమూ !
జయ జయ.
గోళగర్భముల
మాటున డాగే
కరాళహంతల
నుక్కడగించే
ఉదయం.
ఆకట మాడే
అనదల గొట్టే
చీకటిదొంగల
చెండాడించే
ఉదయం.
చీమునెత్తురూ
చిక్కగ పిండే
కృపణన్నృశంసుల
గీ టడగించే
ఉదయం -
జయ జయ.
సర్వసమత్వం
సౌభ్రాతృత్వం
ప్రభామాలికల
ప్రబోధ మిచ్చే
ఉదయం.
కన్నుల వెలుగుల
కరుణను గురిసీ
తిన్నని బాహుల
ప్రేమను మెరసే
ఉదయం.
హిమాచలమ్ముల
వింధ్యనగమ్ముల
రత్నాకరముల - ప్రోజ్జ్వల
సుందరరూపం
ఉదయం.
జయజయ
జ్ఞానధనుల విజ్ఞానఖనుల ప్ర
జ్ఞాననిధుల సుజ్ఞానబింబం
ఉదయం.
ప్రభాతమంగళజయఘోషమ్ముల
సుధాకలశముల తీర్థములిచ్చే ఉదయ
జయ జయ
శాంతిస్వేచ్ఛా
సుఖాభ్యుదయముల
దీవెన లిచ్చే -
తేజోరూపం
ఉదయం.
జయ జయ భారత
జయ జయ భారత
జయ జననీ యని
జండా యెత్తుడు
ఉదయం.
జయ జయ భారత
జయ జయ జననీ
జయ జయ జననీ - మాతా
నమో - నమో
వందే - వందే
ఉదయం.
జయ జయ





తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౪౧

(సంపు. ౨ : పదం. ౨౮౮)

లలితరాగం - రూపకతాళం

[పల్లవి]

(౧) స ని స మ గ రి స | స ని స రి రీ | సా , ని స మా గ మా | గ మ ధా మా , ధ మ గ రీ
త ని వి లే క చీ క టి ద వ్వి ని దే హి

(౨) స రి స ని స మ మ గ రీ స | స ని సా రి స స ని రి స రి | స రీ స మా , గ మ ధ | ని ధ మ గ రి ని
త ని వి లే క చీ క టి ద వ్వి ని దే హి

(౩) స రి స ని స మ మ గ రీ స | స ని స రి స ని ధ మ ధ ని | స రి రి స స మ మ గ మ ధ ధ మ ధ ని సని ధ మ గ మ గ రి స ని
త ని వి లే క చీ క టి ద వ్వి ని దే హి

(౪) స ని స గ మ ధ మ గ రీ స | స ని స రి స ని ధ మ ధా నీ | స రి రి స ధ మ గ మ ధ ని సా స రి స ని ధ ని ధ మ గ రి స ని
త ని వి లే క చీ క టి ద వ్వి ని దే హి

[అనుపల్లవి]

(౧) స స గా గ మ, | ధా ని సా ,
ఘ ను డై హ రి గొ ల్చి తే

(౨) స స గా గ మ ధా | గ మ ధ ని స రి సా , | స రి నీ ని స ధా ధ మ | గ మ నీ ధ మ గ రి
ఘ ను డై హ రి గొ ల్చి తే కై కొ ని ర క్షిం ప డా

(౩) స స మ గ మా గ మ ని ధ | గ మ ధ ని స ని గ రి సా | సా రి స నీ నీ స ని ధా ధా ని ధ మా | గ మ ధ ని స ని ధ మ గ రి స ని
ఘ ను డై హ రి గొ ల్చి తే కై కొ ని ర క్షిం ప డా (తనివి)

[చరణం]

, స మా మ మ | గ మ ధా మా గ రి గ | గ మా గ మ ధా మ ధ నీ ధ | ని ధ మ గ రి గ రి
అం ది ర స వా ద ము న కా స ప డే టి మ న సు
స ని స మ గ రీ స స ని | స రి స ని ధా ధా రి స రి | , స స గా , | మ గ మా ని ధ మ గ
గొం ది బి ల ము లు చా చ్చి కూ డ బె ట్టే టి మ న సు
, ధ ధా ధ ధ | మ ధ నీ సా స | సా , ని సా గ రి సా | స రి స రి స ని ధ మ గ మ
సం ధిం చి మం త్ర వా దా న సా ధిం చే టి మ న సు
ని ధ స ని గ రి స సా , ని ధ మ గ మ ధా | సా స రి నీ ధ మ | గ మ ధా మా గ మా గ రీ
ఇం ది రే శు పై బె ట్టి తే ఇ న్నియు నొ స గ డా (తనివి)

ఇట్లే క్రిందిచరణములు :

(౨) పెట్టన నంజనగాడై - నేల దవ్వించే మనసు,
అట్టె కాయసిద్ధికిగా - నాసపడేటి మనసు,
పట్టి సిద్ధమూలికల - పసజిక్కేటి మనసు,
దిట్టయై కృష్ణునిమీద - బెట్టితే మన్నించడా ? ॥తనివి॥

(౩) చేరి యక్షిణుల పంపు - చేయించుకొనే మనసు,
ఆరయ రాత్రుసమాయ - లభ్యసించేటి మనసు,
ఈ రీతి శ్రీ వేంకటేశు - హృదయములో దలచి,
పేరుకొని నుతించితే - పెంపున నీడేర్చడా ? ॥తనివి॥

లఘుటీక : చీకటిదవ్వీని=ఫలము కానరానిచోట తవ్వుకొనును; దేహి=ప్రాణి; రసవాదము=అల్పలోహములు మహాలోహములుగా మార్చువిద్య; గొంది...మనసు=ఇతరులకు చొరరానిచోట్ల ధనము దాచిపెట్టుకోరిక; మంత్రవాదాన=క్షుద్రదేవతల మంత్రాలు జపించుటచేత; ఇందిరేశుడు=లక్ష్మీపతి; అంజనగాడు=అంజనము వేసుకొని బిబ్బులం వెదకేవాడు ; కాయసిద్ధి=దీర్ఘాయురారోగ్యములు గలిగించుకొను ఆయుర్వేద కల్పము; సిద్ధమూలికలు=సిద్ధులకు తెలిసిన రహస్యపు వేఱువెల్లంకులు; పస=ప్రభావము; యక్షిణులపంపు=దేవయోనిజాతులు చేయుచాకిరి; రాత్రుసమాయలు=అదృశ్యమగుట, కామరూపధారణము మొదలయినవి.

... కములు :చీకటి దవ్వి దేహి ; గొద్దిబిలములు.

నేటి ప్రపంచం

(10 వ పేజీ చూడుడు)

ఆర్థికవ్యవహార సంబంధాలు పెట్టుకోక తప్పింది కాదు. ఇది రష్యాతో వైరం వృద్ధికావడానికి మరొక హేతువయింది. ఈ అవకాశాన్ని ఆంగ్లో-అమెరికన్ దేశాలు పూర్తిగా వినియోగించుకున్నాయి. ఈవిషయమై మాస్కో బెల్గ్రేడ్ల మధ్య పరస్పరారోపణలు జరిగాయి.


ఆస్ట్రియాలోని తూర్పు కరింథియాను యుగోస్లావియా తన దేశంలో కలుపుకోవాలని కోరింది. అంతఃరకూ యుగోస్లావియాను బలపరుస్తూవచ్చిన రష్యా 1949 జూన్లో పారిస్లో జరిగిన విదేశాంగమంత్రుల సమావేశంలో యుగోస్లావియాపక్షాన్ని విడిచిపెట్టింది. తూర్పు కరింథియాను ఆస్ట్రియాకే విడిచిపెట్టాలనీ, యుగోస్లావియాకు నష్టపరిహారం చెల్లించనక్కరలేదనీ పారిస్ సమావేశంలో నిర్ణయించబడింది. ఇటీవల హంగరీలో దేశద్రోహ నేరంకింద పూర్వహంగేరియన్ (కమ్యూనిస్టు) విదేశాంగ మంత్రియైన రాజక్ను విచారణ చేసినప్పుడు, హంగేరీప్రభుత్వంపై జరిగిన కుట్రలో టిటో, ప్రభృతులున్నారని ఆరోపించబడింది. ఈ సాకు తీసుకుని ఇప్పుడు రష్యా యుగోస్లావియాతో 1945 మైత్రిఒడంబడికను రద్దుపరచింది. మిగతా బాల్కన్ దేశాలుకూడా రద్దుచేసుకున్నాయి. కమ్యూనిస్టు రాజ్యాలమధ్య నెలకొన్న ఈ అంతఃకలహం చివరి కేదారితీస్తుందో ప్రపంచమంతా కుతూహలంతో నిరీక్షిస్తోంది. టిటోపై ఆగస్టులో హత్యాప్రయత్నం జరిగినట్లు ప్రకటించబడింది. హంగేరియన్ దేశద్రోహవిచారణలకు టిటో ప్రతీకారం చెయ్యదలంచినట్లు తెలుస్తున్నది. టిటోపై హత్యాప్రయత్నంలో యుగోస్లావ్ కమ్యూనిస్టు నాయకులు కొందరూ, కొమిన్ఫారం నాయకులు కొందరూ నిందితులు. ఒకప్రక్క యుగోస్లావియాసరిహద్దుల సమీపంలో రష్యన్ సేనలు కేంద్రీకృతమౌతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరొకప్రక్క టిటోప్రభుత్వం తన సైనిక సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి

టిటో ప్రభుత్వాన్ని ఆర్థికంగా బలపరచడానికి అమెరికా సిద్ధంగా ఉంది. ఇప్పటికే 20 మిలియన్ల డాలర్ల ఋణం ఇవ్వడానికి నిశ్చయించినట్లు ప్రకటించింది.

ఈ అంతఃకలహానికి పర్యవసానంకోసం ప్రపంచం నిరీక్షిస్తోంది.

తటస్థవర్గం :

ఐక్యరాజ్యసమితిలో ఈ సంవత్సరం సమావేశంలో మరొక విశేష ముంది. గత సంవత్సరం ఇటాలియన్ వలసల విషయమై అగ్రరాజ్యాలనోడించగలిగిన చిన్నరాజ్యాలు ఉత్సాహంతో బలీయమైన "మూడో" వర్గాన్ని నిర్మించడానికి యత్నిస్తున్నాయి. ఈ యత్నాలకు సిరియా ప్రతినిధి ఎల్ ఖోరీ కారణభూతు డని చెప్పవచ్చును. ఒకవైపున ఆంగ్లో-అమెరికన్ వర్గం, మరొకవైపున కమ్యూనిస్టు రాజ్యకూటమి ఐక్యరాజ్యసమితి కార్యకలాపాల్ని ఆధారంగా చేసుకుని తమ వైషమ్యాలను తీర్చుకుంటున్నాయి. వీరి వైరాలకు చిన్న చిన్న దేశాలు బలౌతున్నాయి. ఇరుపక్షాల విరోధాలకూ చీనా, ఇండోనీషియా, అరేబియా, గ్రీస్ దేశాల ప్రజలు బలౌతున్నారనీ, రష్యా అమెరికాల ప్రచ్ఛన్నయుద్ధంపై నాలుగు ప్రాంతాలలో ప్రచ్ఛన్నంగా కాకుండా ప్రత్యక్షంగా వచ్చి ప్రజల్ని పీడిస్తున్నదనీ ఎల్ ఖోరీ సమితిలో అన్నాడు. చిన్నరాజ్యాలన్నీ చేరి ఐక్యరాజ్యసమితిలో చర్చకు వచ్చే ప్రతి అంశాన్నీ అగ్రరాజ్యవర్గాల స్వార్థాశయాల దృష్ట్యా కాకుండా న్యాయాన్యాయాలదృష్ట్యా చర్చించి నిర్ణయాలు చేయాలనీ ఈ చిన్నరాజ్యాలు వాదిస్తున్నాయి. ఈ చిన్నరాజ్యాలీ రీతిగా ఐక్యం కాగలిగిన రోజున రష్యా అమెరికాల చదరంగం కట్టినట్లే. కాని ఇది సాధ్యంకాదనే సందేహం ప్రబలంగా ఉంది. చిన్నరాజ్యాలమధ్య ఐకమత్యం సామరస్యం లేవు. (ఉదాహరణ భారతదేశంపట్ల పాకిస్తాన్ వైఖరి, దక్షిణాఫ్రికా వైఖరి.) అయితే చిన్నరాజ్యాలు ఇంకా ప్రయత్నాలు మానలేదు. [సూర్యం]



ధనుష్కోటివద్ద రత్నాకర, మహోదధి సంగమంలో రైలు స్టీమర్ల సమావేశస్థలం.

రామేశ్వర క్షేత్రము

(13-వ పేజీ తరువాయి)

ఉన్నారు. వీరు పండితులూ, భక్తిపరులూ. ఆలయాదాయం దాదాపు షాల్గుకు రెండున్నర లక్షలు. స్వామికి షుమారు 40 లక్షలు విలువగల జవహరీఉంటుం దని ప్రభుత్వంవారు అంచనా వేసారు. 112 ఊర్లు రామేశ్వరునికి యీనాంగా ఉన్నవి. అనేక భవనాలు ఉన్నవి. ఈ ఆలయంలో ఎక్కడ అడుగుపెట్టినా ఒక లింగం కాలికి తగిలి తీరాల్సిందిగనుక, జటాయుతీర్థంలో స్నానం చేస్తే ఆ పాపం పరిహార మౌతుం దని చెబుతారు. రుద్రాభిషేకానికి రూ 500 లు, రజతోత్సవసేవకు రూ 500లు, నగలు చూడటానికి రూ 15 లు, గంగాజలాభిషేకానికి కొంతరుసుము వసూలుచేస్తారు. దేవాలయంలో ఉన్న సతా రామపట్టాభిషేకమనే రంగురంగుల విగ్రహాలు కొట్టవచ్చేట్లు, జీవం ఉట్టిపడుతూ, కల్యాణాత్మకంగా, ఉంటాయి. దేవాలయమంతా చూస్తే జన్మధన్యమైనట్లుగా, అనురక్తుడైన ప్రతిభక్తుడూ తాదాత్మ్యమును పొందుతాడు. ఈ దేవాలయాన్నిగూర్చి ఫెర్గూసన్ అనే చారిత్రిక ఇట్లా వ్రాశాడు. "ఇదిచతురస్రాకారమైన ప్రాకారాలు గల్గిన ఆలయం. 650 అ. వెడల్పు 1,000 అ. నిడివి, 100 అ. ఎత్తుగల గోడ లున్న శిల్పకళా ఖండాలు ఉన్నవి. ద్రావిడశిల్పమునకు చక్కని మచ్చు ఒక్కటి చూపించవలెనన; ఉత్కృష్ట సౌందర్యవిలసితమూ, అత్యద్భుతమైన నవనాలు గల్గిన ఒక్క దేవాలయము చెప్పవలెనన్న తడవుకోకుండా ఎవ్వరుగాని రామేశ్వరఆలయమునే చెప్పక తప్పదు. భరతవర్షమున ఇంత చక్కని కృషి, ప్రతిభ, శిల్పము విలసిల్లే ఆలయము మరొకటి లేదు."

పట్టణంలోని ఆంధ్రులు :

ఆలయంప్రక్కనే, శంకరాచార్యులవారి విగ్రహం శృంగేరిమఠమూ ఉన్నాయి. ఊళ్లో ఎన్నోఏండ్లనుంచి స్థిరపడిపోయిన కొన్ని ఆంధ్రకుటుంబాలు ఉన్నాయి. కోదూరి సుబ్రహ్మణ్యంగార నేవారు, వారి కుమారులు రాజగోపాలశాస్త్రిగారు ఆ కోవలోనివారు. వారిని కదిపితే కృష్ణాగోదావరితీరంనుంచి వచ్చి కమ్మని తెనుగు మాట్లాడుతూన్న అచ్చతెనుగు వారా అనిపిస్తారు. ఇన్ని తరాలుగా వారు అక్కడ స్థిరపడిపోయినా ఇంత చక్కని తెనుగు మాట్లాడటం ఆశ్చర్యంగా తోచకమానదు. ఊళ్లో చక్కని నృత్యం చేస్తూఉండే మయూర బృందాలు, కలకలారావములు చేసే శుకపికాదికములూ, ఆనందస్ఫోరకముగా ఉంటయ్.

ధనుష్కోటి :

'కోటినదులు ధనుష్కోటిలో కలియగ, ఏటికి తిరిగెదవా ఓ మనసా!' అని శ్రీత్యాగబ్రహ్మం గానం చేశారు. ఈ వాక్యంపై పండితులు త్యాగరాజు ధనుష్కోటిచూశారని చెప్పాలా? వద్దని చెప్పాలా? అనే రాద్ధాంత సిద్ధాంతాలు చేశారు. వాటితో మనకు నిమిత్తంలేదు.

రామేశ్వరంనుంచి ధనుష్కోటికి రైలుపై రావాలంటే పాంబన్ వచ్చి వెళ్లాలి. లేదా సముద్రం మీదుంచి అయితే పడవల్లో వెళ్లవచ్చు. మూడు నాలుగు గంటల ప్రయాణం పడుతుంది. రాములవారు విభీషణుడి పట్టాభిషేకం చేసి గంధమాదనానికి వచ్చారట. విభీషణుడు రాములవార్ని జూచి మా లంకాద్వీపంనుంచి రాక్షసులు ఈ సేతువుద్వారా మీ రాజ్యానికి వచ్చి మీ ప్రజలను బాధించవచ్చు. లేదా మీ దేశమందలి పరాక్రమశాలురైన వీరులు మా ద్వీపానికి వచ్చి రాక్షసులను సంహారం చేయవచ్చు. గనుక తామునాపై కరుణించి ఈ సేతుప్రయోజనం తీరిపోయింది కాబట్టి భగ్నంచెయ్యాలని కోరుతున్నాను. అని ప్రార్థించాడు. రాములవారు తమ ధనస్సు తీసుకొని కొనతో మూడుసార్లు గీయగా అది భగ్నమైనదట. ఈ సేతుప్రాంతముననే రత్నాకరం (బంగాళాఖాతం), మహోదధి (హిందూమహాసముద్రం) కలుస్తున్నాయి. ఇందులో ఒకటి పురుషసముద్ర మనీ, రెండోది స్త్రీసముద్ర మనీ చెబుతారు. పురుషసముద్రం ఎత్తుగా పెద్దగా ఘోషిస్తూనూ, స్త్రీసముద్రం అణిగిమణిగి ఉండడం చూడటానికి అబ్బురంగా ఉంటుంది. ఉపపాండవుల హత్యచేసిన అశ్వత్థామ ధనుష్కోటిలో సేతుతీర్థస్నానంచేసి పాపాన్ని బాపుకున్నా డంటారు. పాండవాదులుగూడా ఇక్కడికి వచ్చారని చెబుతారు. మూడుదిశల్లో స్నానం చేసినట్లయితే ధర్మార్థకామమోక్షములు లభిస్తాయనీ, అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయనీ, పుత్రులు లేనివారికి పుత్రులు లభిస్తారనీ, సంపూర్ణాయురారోగ్యసంపదలు ప్రాప్తిస్తాయనీ, పాపాలన్నీ సూర్యరశ్మికి హిమకణాలుమాదిరిగా కరిగిపోతాయనీ, పుణ్యరాశులు శుక్లపక్షచంద్రునిపగిది వృద్ధిచెందుతా యనీ, పితృదేవతలకు తర్పణములు, పిండములు సమర్పించినచో మాతృవర్గంలోని కోటితరాలవారు, పితృవర్గంలోని కోటితరాలవారు శాశ్వతదివ్యలోకవాసమును పొందుతారనీ పురాణాలు చెబుతున్నాయి. సాగరసంగమమందలి ఇసుకను తీసుకొని యాత్రికులు 'అహం కాశీం గమిష్యామి' అనే ప్రతిజ్ఞ తీసుకుంటారు. ఏడాదిలోపల త్రివేణిలో ఈ ఇసుకను కలిపి తీరాలి. ఇక్కడనుంచే సింహళద్వీపానికి వర్తకవాణిజ్యాదివ్యవహారములు స్టీమర్లపై జరుగుతూ ఉంటాయి. ఈ ప్రాంతానికి రెండుమూడు మైళ్లలో ఏకాంతరామస్వామి ఆలయమూ, కోదండరామస్వామిదేవళమూ ఉన్నవి. తీర్థాలలోకెల్ల సేతుతీర్థమూ, క్షేత్రాలలోకెల్ల రామేశ్వరమూ ఉత్తమోత్తమము లనీ, నిత్యాభీష్టప్రదములనీ స్థలపురాణం ఘోషిస్తోఉంది.

గంధ మాదన పర్వతం

హిమాలయం, మందరం, కైలాసం, వింధ్యం, నిషధం, హేమకూటం, నీలం, గంధమాదనం అనునవి పురాణప్రసిద్ధమైన పర్వతకూటములలోనివి. యక్షగంధర్వ సిద్ధకిన్నర కింపురుషులకు అమరులకు కామధేను, కల్పవృక్షాదికములకు వసంత మండపమైన గంధమాదనం పరిపూర్ణానంద శివ సాక్షాత్కారమునకు నిలయమైనది.

ప్రతిఅవతారంలోనూ, భగవానుడు ఇక్కడ అవతరించి, గంధమాదనమున వెలసిన శివుని అనుగ్రహం పొంది, ధర్మసంస్థాపనకు ఉపక్రమిస్తాడని అనుశ్రుతమైన సంప్రదాయం. రావణాసురుడు సప్తసాగరాలకు వెళ్లి శివపూజ చేసి, గంధమాదనం పై శివుని అర్చించాడు. తర్వాత రాముడు రావణసంహారానంతరం సీతామ్మవారికి గంధమాదనమును చూపించి "అత్ర పూర్వంమహాదేవః ప్రసాదమకరోత్ ప్రభుః" అని చెప్పినాడు. "హే సీతా, ఇక్కడనే దయాసముద్రుడైన పరమేశ్వరుడు నన్ననుగ్రహించినది" అన్నారు.

రామపాదములచే పవిత్రమైన ఈ గంధమాదనం స్థల, తీర్థ, మూర్తి మాహాత్మ్యమునుగలిగి మహాపుణ్యస్థలముగా ప్రకాశిస్తోంది.

యావద్భారత ప్రసక్తిగాంచి, తరతరాలుగా విరాజిల్లుతూన్న ఇట్టిమహోత్కృష్ట తీర్థయాత్రాక్షేత్రములను ప్రభుత్వంవారు శ్రద్ధగా బాగు చేయాలి. రామేశ్వరంలో పురోహితులపై యాత్రికులకు విడిది ఇచ్చినందుకు పన్ను వేస్తున్నారని అమాత్యులకుపురోహితులు విన్నవించుకున్నారు. రామేశ్వరము ప్రధానదివ్యక్షేత్రముగనుక, సంవత్సరం పొడుగునా యాత్రికుల సమ్మర్దం ఉండక తప్పదు. వారికి తగిన సర్వసదుపాయాలు కలిగేట్టు ప్రభుత్వం చూడటం విధాయకం.

శ్రుతిస్మృతిశాస్త్రపురాణేతిహాసాదులచే నుగ్గడింపబడి దివ్యక్షేత్రమైన రామేశ్వరము అలనాటి రామావతారము మొదలు నేటి నవర్నగరు కృష్ణసింగ్ జీ భావసింగ్ జీవరకు ఉత్తమతీర్థరాజముగా సేవింపబడుచున్నది. మన మంత్రులు మాధవమీనన్, భక్తవత్సలం, చంద్రమౌళిగారలు గత రెండేళ్లలో రామనాథుని సేవించివచ్చిరి. పురోహితులవద్ద వసూలు చేయబడుచున్న పన్నుగూర్చి స్థానికశాఖామాత్యులకు విన్నపము రాగా వెంటనే దానిని తగ్గించెదమని వాగ్దానము చేసిరి. ప్రభువులకు, ప్రజకు, పండితులకు, పామరులకు, ఆచంద్రార్కముగా ఆరాధ్యమైన రామేశ్వరమహాక్షేత్రము ఎన్నో విధముల వృద్ధిపొందదగియున్నది. ఏతన్మహాకార్యములో మన పుణ్యభూమిని, పవిత్రదేవాలయములను రక్షించుటలో మన అమాత్యులు పూర్వసంప్రదాయమును విస్మరింపకుందురుగాక !

"ఆరూఢభక్తి గుణకుంచిత భావచాప
యుక్తైశ్శివస్మరణబాణగణై రమోఘైః
నిర్జిత్య కిల్బిషరిపూ న్విజయీ సుధీంద్ర
స్సానంద మావహతి సుస్థిర రాజ్యలక్ష్మీం."

—శివానందలహరి

కులాసా కబుర్లు

ముస్తాబు ముచ్చట

[జి. యస్. సూరి]

ఆచారాలు, నియమాలు, అలవాట్లు, కట్టుబొట్లు మొదలైన వ్యవహారాలన్నీ కలిసి సాంఘికజీవిత మవుతుంది. ఇవి దేశకాలపాత్రాదులను అనుసరించి మారిపోతూ ఉంటవి. అట్లా మారకపోతే సంఘం సజీవంగా లేదనుకోవచ్చు. ఈ మార్పులకు వ్యక్తులు కొందరు నిమిత్తమాత్రులవుతూ ఉంటారు.

సమాజంలో ఉండే కొన్ని పద్ధతులు కారణాంతరాలవల్ల ఒకొక్క పెద్దమనిషికి నచ్చకపోవటం జరుగుతుంది. బుద్ధిమంతుడైనవాడు ఎవరు ఎట్లా పోతే మన కేమిటి అని ఊరుకుంటాడు. కొందరు ఆవిష్కంగా ఉపేక్షించి ఊరుకోలేరు. సంఘాన్ని మరమ్మత్ చేయటానికి పూనుకుంటారు. ఉపన్యాసాలతో ఊదర పెడతారు; రచనలతో రెచ్చగొడతారు; విమర్శనలతో విసుకు పుట్టిస్తారు. కష్టమనక నష్టమనక తమ ఇష్టదేవతారాధనలో ఆహుతి అవుతారు.

ఇలాంటి ఆవేశపరులవల్ల పదిమందికీ మంచి కలిగినా కలుగకపోయినా బాధమాత్రం ఉండదు. వినే అమాయకుడు ఎవడైనా ఉంటే వింటాడు. వినని బుద్ధిమంతులు వినకుండాపోతారు. అంతే తప్ప ఎవడి మనసుకూ నొప్పి తగలదు. అలవాట్లకు ఇబ్బంది రాదు. స్వేచ్ఛకు భంగం సంభవించదు. నీ ఉద్ధరింపు ఉత్తరింపుగానూ పతనమైపోయే వాళ్లను పడిపోనివ్వవయ్యా అని యథేచ్ఛగా ఎందుకో వనకకో దొర్లిపోవచ్చు.

అట్లా గాకుండా ఇటువంటి దీక్షాపరుడికి అధికారం వచ్చిన దనుకోండి. ఇక కొంపలు అంటుకున్న వన్నమాటే. తనకు నచ్చిన పిచ్చినిబంధనను నిర్బంధంగా అమలుపరుస్తాడు. నచ్చని వ్యవహారాలను నిషేధిస్తాడు. కేవలం వ్యక్తిగతమైన స్వల్పవిషయాలలో కూడ స్వేచ్ఛ లేకుండా చేసి చూస్తాడు. అయితే దురుద్దేశంతో ఈ కర్మకాండకు పూనుకోడు. మేలుచేయాలనే సంకల్పమే అందుకు పురిగొలుపుతుంది.

ఈజిప్టుదేశపు మంత్రివర్గంలో అహ్మద్ ముర్సి బాదర్ బేగ్ అనే అమాత్యశేఖరుడు ఒకడున్నాడు. ఈయన ఇప్పుడు విద్యాశాఖను నిర్వహిస్తున్నాడు. పాతదంతా యోగ్యమైనదీ, కొత్తదంతా అపాయకరమైనదీ అనే వర్గానికి చెందినవాడు ఈ పెద్దమనిషి. 'గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్' అనే సూత్రాన్ని అక్షరాలా నమ్మినవాడు. గడియారాన్ని వెనకకు తిప్పటానికి పాటుబడే వ్యక్తులలో ముఖ్యుడు.

ప్రపంచచరిత్రయావత్తూ ఒక్కసారి పరిశీలించాడు. ముందు చైనాచరిత్ర తీసుకొన్నాడు. ఆ దేశంలో ఒక యాభైఏళ్ల క్రిందటివరకూ మగవాళ్లందరూ జడలువేసుకునేవాళ్లు. పాశ్చాత్య నాగరికతతో సంబంధంఉన్న ఈ కాలంవాళ్లకు ఈ ఆచారం పరమఅసహ్యంగా కనబడ్డది. జడను నిషేధిస్తూ ఒక శాసనం మంజూరుచేశారు. ప్రతి పోలీసుఉద్యోగికి విజిల్‌తోబాటు ఒకకత్తెర కూడ ఇచ్చారు. కనిపించిన జడధారినల్లా పట్టుకుని జడకాస్తా కత్తిరించి పంపమన్నారు. పోలీసుస్టేషనుకు ఎక్కువ జడలు దాఖలుచేసిన ఉద్యోగికి ప్రమోషన్లు పారితోషికాలు ఇచ్చారు. బహుకొద్దికాలంలో జడ అనేది కనపడకుండా చేశారు.

ఇక టర్కీచరిత్ర తీసుకున్నాడు. ముస్తఫా కెమల్‌పాషా శాసించని ఆచారం లేదు. అనాదిసిద్ధంగా ఉన్న లిపిని మార్చి రోమను లిపిని ఉపయోగించమన్నాడు. ఎండముఖం చూడకుండా బురఖాలు కప్పుకుని తిరిగే ముస్లిం స్త్రీలను ముసుగులు లాగివేయమన్నాడు. పాతకాలపు ఆచారాలన్నిటికీ శూన్యం పెట్టాడు.

ఈ విధంగానే మిగతా దేశాల చరిత్రను శ్రద్ధతో పరీక్షించాడు. ఆ దేశాలలో ఆ సంస్కర్తలు అధికారపూర్వకంగా పూర్వాచారాలను రూపుమాపినప్పుడు తాను తన దేశంలో ఇప్పటి ఆచారాలను నిర్మూలించి వెనుకటి సదాచారాలను ఎందుకు ఉద్ధరించకూడదా అని ఆలోచించాడు. అట్లా చెయ్యకపోతే విధ్యుక్తధర్మం నెరవేర్చినట్లు కాదని నిశ్చయించాడు. కార్యక్రమానికి ఉపక్రమించాడు.

తన చేతిలో ఉన్నది విద్యాశాఖే కాబట్టి స్కూళ్లకు సంబంధించినంతవరకూ ఫర్మానాలు జారీచేయటం మొదలుపెట్టాడు. చదువుకోసం విదేశాలకు వెళ్లిన ఈజిప్టువిద్యార్థినులు తల్లిదండ్రుల అనుమతి లేకుండా స్వేచ్ఛావివాహాలు చేసుకుంటున్నారు కాబట్టి పరదేశాలకు యువతులు చదువుకని పోగూడదని శాసించాడు. దేశీయం కావు కాబట్టి ఆడపిల్లల బళ్లలో నాట్యపు తరగతులను రద్దుచేశాడు. ప్రభుత్వంవారి ఉత్సవాలలో ఆడవాళ్ల అందచందపుపోటీలను బహిష్కరించాడు. తాను బాలికాపాఠశాలలకు వచ్చినప్పుడు పంతులమ్మలు తన సరసన కూర్చుని ఫోటోలు తీయించుకోరాదని హెచ్చరించాడు. మొన్న ఈమధ్య, ముఖానికి పౌడరుకొట్టుకొనిగాని, పెదవులకు చెక్కిళ్లకు రంగుఅద్దుకునిగాని, మంజేతిదాకా ఉండని జాకెట్లు తొడుక్కునిగాని పంతులమ్మలూ విద్యార్థినులూ స్కూళ్లను హాజరుకాగూడదని ఉత్తరువు చేశాడు. తనపై ఈవిధంగా ధ్వజంఎత్తినందుకు ఈజిప్టుమహిళామణులు ఆగ్రహించి ఆందోళన బయలుదేరతీశారు. క్లియోపాత్రావంటి విలాసిని రాజ్యం ఏలిన మహాదేశంలో ఇటువంటి అత్యాచారాలను ఊరికే జరుగనిస్తారా మరి!

అక్కడెక్కడో జరిగిన ఈ గొడవను ఇక్కడ వివరించటంలో కారణం లేకపోలేదు. ఇది మన రాష్ట్రపు స్త్రీలు జాగ్రత్తతో గమనించదగిన విషయం. ఈజిప్టువిద్యామంత్రిలాంటివాళ్లు మన ప్రభుత్వవర్గంలో లేకపోలేదు. ఆహారపానీయాలకూ గాంధీ మహాత్ముడికి సాక్షాత్తూ శిష్యులు. మిగతావిషయాలలో ఎట్లా ఉన్నా వినోదవిలాసాలకు గాంధీగారిని తూచా తప్పకుండా అనుసరించేవాళ్లు, కొన్ని సందర్భాలలో గురుపుంగవులను అతిశయించినవాళ్లు కూడా ఉన్నారు. సినిమాచిత్రాలు, వేషభాషలు, వివాహాలు, విడాకులు, నిషావస్తువులు మొదలైనవాటికి సంబంధించినంతవరకు కట్టుదిట్టాలను ప్రయోగించి నీతిని ఉద్ధరించటానికి అవినీతిని నిర్మూలించటానికి ఎంతో శ్రమ పడుతున్నారు. ఇతరత్రా ఉండే అవినీతిసంగతి ఏమిటి అని మన మెవ్వరం ప్రస్తుతం ప్రశ్నించకూడదు.

ఈజిప్టులోమాదిరి కొన్ని నిషేధాలు ఇక్కడ అవతరించటానికి అవకాశం లేకపోలేదు. పసుపు తప్ప మరి యే ఇతరపౌడర్లనూ స్త్రీలు ఉపయోగించకూడ దని ఒక ఆర్డినెన్సు జారీచేయబడవచ్చు. చైనాదేశంలోవలె ప్రతి పోలీసు కానిస్టేబిలుకు ఒక కత్తెర ఇచ్చి రెండు జడలు ధరించిన యువతులు కనబడితే ఒకదానిని కత్తిరించివేయ మనవచ్చు. మన అమెరికా రాయబారి శ్రీమతి విజయలక్ష్మీపండిట్ తొడుగుకునే జాకెట్టులాంటి చెయ్యిలేని జాకెట్లను బహిష్కరించవచ్చు. దేవదాసీల సందర్భంలో వలెనే భరతనాట్యపు ప్రదర్శనాలను నిషేధించవచ్చు. ఉల్లిపొరకాగితంలాంటి నైనాన్, జార్జెట్, క్రేప్, ఆర్గండీ మొదలైన నాజూకుచీరలను కట్టకూడదని ఉత్తరువు చేయవచ్చు. బోసిముక్కులు కనబడకూడదనీ ముక్కుపుడకలనూ బులాకీలను ఉపయోగించవలసిందనీ ఆజ్ఞాపించవచ్చు.

ఈలాంటి ప్రమాదాలు దాపురించకుండా ఉండాలంటే మన మహిళాసంఘాలు ఆందోళన ప్రారంభించాలి. రాజ్యాంగచట్టం పూరి కాకమునుపే స్త్రీల వేషధారణవిషయంలో స్వేచ్ఛకు భంగకరమైన చట్టాన్ని ప్రయోగించడానికి వీలు లేదని కామత్‌గారిద్వారా సవరణ ప్రతిపాదింపచేయాలి. అది వీలుగాకపోతే ఈ అంశము సెంట్రల్ అంశాల జాబితాలో చేర్పించి పత్రికలపై వున్నమాదిరి రాష్ట్రప్రభుత్వానికి అధికారం లేకుండా చేయించాలి. లేకపోతే చెప్పశక్యంగాని ఇక్కట్లకు స్త్రీలులోనుగావలసి వస్తుంది. అదను మించిపోకుండా హెచ్చరించి మా విధ్యుక్తధర్మాన్ని మేముమాత్రం నిర్వహించాము. ఆపైన జవాబుదారీ మన మహిళలది.

దక్షిణదేశపు ద్రవిడభాషలు - తెలుగు

శ్రీ పులగంపల్లె గోవిందరెడ్డి

భారతీయులద్వారా మాట్లాడబడే భాషలు, ఆర్య, ద్రావిడ, ముండా (ఆస్ట్రి) తథా తిబ్బతీ, చీనీ పరివారభాషలు. తిబ్బతీచీనీ భాషలుమాట్లాడువారు ఒకటిన్నర కోటికంటె కొంచెమెక్కువగా యుండవచ్చు. యీ భాషల అస్తిత్వమేమున్న బర్మా తిబ్బత్‌లలో మాత్రముండె. ముండాభాష మాట్లాడువారు అస్సాముకు పూర్వోత్తర అడవులలోనూ, ఛోటానాగపురంలోనూ, మధ్యభారత మధ్య ప్రదేశములలోనూ, ఒరిస్సాలోని కొన్ని జిల్లాలలోనూ మద్రాసుప్రాంతములోని గంజాము జిల్లాలోనూ, తథా పశ్చిమబెంగాలూ, బీహారు ప్రాంతములోని అడవిప్రదేశాల్లో నివసించుచున్నారు. యింతేకాకుండా హిమాలయపరిసరాల్లో బీహారుమొదలు శిమ్లాపర్వతాలవరకూ అక్కడక్కడ నివసించుచున్నారు.

మధ్య ప్రాంతములోనూ, మద్రాసు ప్రాంతములోనూ వీరికి నలువైపులా ద్రవిడభాషలూ, ఉత్తరహిందుస్తానములో ఆర్యభాషలు మాట్లాడువారు ముట్టడించియున్నారు. మొదట దేశమంతటా ముండాభాషీయులుండేవారేమొ! రానురాను క్రొత్తగావచ్చిన ఆర్యభాషలవారికి ద్రవిడభాషలవారికి మధ్య నలిగి అడవిమార్గం పట్టినారేమొ!' అనే సందేహం తప్పకకలుగుతుంది. ఈ ముండాజాతికి చెందినవారినే రామాయణములో శబరులని ఉల్లేఖించినారు. 'శబరి' కూడా యీ జాతికి చెందిన ఒక తెగలోనిదే.

ఆర్యభాష: 'ఆర్యావర్తః పుణ్యభూమిర్మధ్యంవింధ్యహిమాగయోః' అని వింధ్యహిమాలయాల మధ్యప్రదేశమంతా ఆర్యావర్తమనియూ, అచ్చటి భాషలు ఆర్యభాషలనియూ నిర్వచించబడినవి. ఇక దక్షిణదేశపు ద్రవిడభాషలు. ద్రవిడభాష కంతర్గతంగా మొత్తము పదునాలుగు భాష లున్నవి. కానీ, భాషావిజ్ఞానులు వీటిని నాలుగుభాగములుగా విభజించియున్నారు. ద్రవిడము, మధ్యవర్తి, ఆంధ్రము, పశ్చిమోత్తరి.

ద్రవిడము మాట్లాడువారు నాలుగు కోట్ల పదిలక్షలు. మధ్యవర్తి ముప్పయిలక్షలు. ఆంధ్రము హైదరాబాదురాజ్యంలో కూడా మాట్లాడువారితో కలిసి మూడుకోట్లా పదునెనిమిది లక్షలకు పైగా నున్నారు. పశ్చిమోత్తరీభాషమాట్లాడువారు కేవలము ఇరువది లక్షలు మాత్రం. నాలుగుకోట్ల పదిలక్షలు మాట్లాడే ద్రవిడభాషలో మరియూ ఆరు తెగలున్నవి: అరవము, (తమిళము) మళయాలము, కన్నడము, తుళువు, కొడగు తోడా.

అరవము: ఇది మద్రాసు ప్రాంతానికి దక్షిణ పూర్వభాగాల్లోనూ, సింహళమునకు ఉత్తరదిశలోనూ మాట్లాడుభాష. దీనికి ఉత్తరమున తెలుగు, పశ్చిమమున కన్నడమూ, మళయాలమూ మాట్లాడబడుచున్నది. ద్రవిడ భాషల ఆరింటిలో అరవమునకు అగ్రస్థానం లభిస్తుంది. ఎనిమిదవ శతాబ్దమునుండీ యీ భాషలో సాహిత్యమున్నట్లు తేలుతుంది. ఇందులోకూడా శేన, కొడుగ్, అని రెండు విధాలుగా మాట్లాడెదరు. శేన గ్రాంథికము, కొడుగ్ వ్యావహారిక భాష.

మళయాళం: ఇది తమిళములోనిదే ఒక శాఖ. తొమ్మిదవ శతాబ్దమునుండీ దీనిపుట్టుక దీని క్షేత్రం మద్రాసుప్రాంతములోని దక్షిణ పశ్చిమముల మూలభాగం. దీనిని లక్షద్వీపములో కూడా మాట్లాడుచుందురు. శబ్దాలు సంస్కృత ప్రచురతములు. కానీ మోపలాలు సంస్కృత శబ్దాల్ని ఎక్కువ యుపయోగించరు. మళయాలభాష తిరువాన్కూరు, కొచ్చిన్, రాజ్యాల ఆధారంగా బాగా అభివృద్ధి చెందింది. దీని సాహిత్యం పదుమూడవ శతాబ్దమునుండీ మాత్రం దొరుకుతుంది.

కన్నడము: మైసూరు భాష. ముఖ్య సాహిత్య మిందులో వుంది. లిపి తెలుగు లిపిని, భాష తమిళమును పోలివుంటుంది. వ్యావహారిక భాషలు ఎన్నో వున్నాయి. సాహిత్యము అయిదవ శతాబ్దమునకు ముందునుండి ఉన్న వ్రాతల ఆధారంగా తేలుతుంది. ద్రవిడభాషలన్నిటిలో ప్రాచీన భాష ఇదే ననుకోవచ్చు.

తుళువు: దీని క్షేత్రము చాలాసంకుచితము. భాషలు అభివృద్ధి చెందినా, సాహిత్యము లేదు. మిగతా కొడుగు, తోడా భాష నీలగిరి పర్వతాల్లో నివసించువారు మాట్లాడుచుందురు.

మధ్యవర్తి: అడవిజాతిభాష మధ్యభారతములోనూ బీరారుమొదలు ఒరిస్సా వరకూ వ్యాపించిపోయింది. బెంగాలులోని రాజమహల్ జిల్లాలోకూడా ఒక చోటి గంగగట్టున మాట్లాడుచుందురు. మధ్యవర్తి భాష కంతర్గతంగా గోండీ, ఖురుఖు, కూయీ, కొలామీ వీటిలో గోండీకి హిందీతోనూ, కూయీ, కొలామీకి తెలుగుతోను సంపర్కముంది. కోయీ, కొలామీ భాషలు ఒరిస్సాఅడవుల్లోమాట్లాడుదురు.

తెలుగు: విశాలాంధ్రదేశపు భాష. ఎంతో మహత్తరమైంది. ప్రస్తుతము హైదరాబాదులో అర్ధభాగానికిపైగా ఆంధ్రభాషనే మాట్లాడుచున్నారు. రాష్ట్రభాష అయిన హిందీని వదిలితే రెండవస్థానం తెలుగుభాష పొందగలుగుతుంది. దక్షిణదేశపు ద్రవిడభాషలలో తెలుగు మాట్లాడువారి సంఖ్య చాల ఎక్కువ. సంపూర్ణ హిందూస్థానంలోకూడ ఆంధ్రము మాట్లాడువారి సంఖ్య అధికము. రెండవస్థానాన్ని పొందగలిగింది. ప్రాచీనసాహిత్యం పండ్రెండవ శతాబ్దమునుండీ కనబడుతుంది. ఆధునికసాహిత్యం అన్ని భాషల తలతన్నినట్లు అగ్రస్థానాన్ని నిలబెట్టుకొంటుంది. సంస్కృతశబ్దాలు స్వాభావిక రీతితో తెలుగులో కలిసిపోయినవి. ఈ కారణంతో ద్రవిడ భాషల కన్నిటికంటె ఆర్యభాషలతో అత్యంతసన్నిహితత్వం తెలుగుకు ఏర్పడింది.

భాషలోని మాధుర్య మమోఘము. దీనియెదుట అరవము కర్ణకఠోరంగా వుంటుంది. ఆంధ్రభాషే కాదు; ఆంధ్రులు కూడా వీరులు. అన్ని సభ్యతలు గుర్తించి వాటికంటే శ్రేష్ఠమయిన సభ్యతనలవరచుకొన్న ధీరులు. మొగలుల రాజ్యపాలనలో ఉత్తర హిందుస్థానానికి కూడా సైనికులై పోగలిగిన యోధులు. తిలింగులని సహిందిలో సైనికులని యర్థము. యీ శబ్దము మొగలుల కాలము నాటిది. మొగలుల దృష్టిలో తెలుగువారు ప్రతి ఒక్కడూ సైనికుడనే. ఇంతే కాక విశాలాంధ్రదేశం; విశాలాంధ్రభాష. ఆంధ్రులు ఆంధ్రరాష్ట్రన్నే గాక సంపూర్ణ హిందూస్థానాన్నే ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏల గలిగిన యోధులు, మేధావులు అయివుండీకూడా యింతవరకూ ఆంధ్రరాష్ట్రప్రాప్తి కాటంకమెందు కయిందో!

'శ్వేతసుందరి'

(11-వ పేజీ తరువాయి)

అంది. "నేను నీకు ఆత్మసమర్పణం కావించుకో లేను. చెంగ్‌కు ద్రోహం చేయలేకపోవటమే దీనికి కారణం. కాని నా కృతజ్ఞతను తెలియ చెయ్యటానికి అనేక మార్గాలున్నాయ్. చంగన్‌కు చెందిన వేశ్యాకులం నాది. మగవాళ్లు మక్కువచూపే, నా చెల్లెళ్లు అనేకమంది ఉన్నారు. ఈ వృత్తిలో వాళ్లు చాలామంది నాకు తెలుసు. వాళ్లలో ఎవరైనా నీ ప్రయత్నానికి లొంగనివాళ్లుంటే, వాళ్లను తీసుకు రాగలను."

"ఐతే యింకేమిలోటు" అన్నాడు వె-యిన్.

"చంగ్ అనే అమ్మాయిని చూశాను... నాకు బాగుంది."

నాకు చెల్లెలే" అంది జెన్‌షిహ్. పదిరోజులలో ఆమెను తీసుకువచ్చి వె-యిన్‌కు వప్ప చెప్పింది.

కొన్ని నెలలు గడిచేసరికి వె-యిన్‌కు ఆమె అంటే విరక్తిపుట్టి పంపించివేశాడు. జెన్‌షిహ్ అంది:—

"బజారుస్త్రీలను సమకూర్చటం అంత కష్టం కాదు. నీకు లొంగని వ్యక్తి ఎవరన్నా ఉంటే చెప్పు."

"ఒక ఉత్సవానికి చిన్‌ఫ్యూ గుడికి కొంతమంది స్నేహితులతో వెళ్లా. ఆ ఉత్సవంలో జనరల్ మిన్ పాటకచేరీ ఏర్పాటుచేశాడు. మంచి అందమైన ఒక పాటకత్తెను చూసాను. పదహారేళ్లుకన్నా ఎక్కువ ఉండవు; ఆ పిల్ల ఎవరో నీకు తెలుసా?"

"ఆ పిల్ల అంటే జనరల్‌కు ఎంతో ప్రేమ. ఆ అమ్మాయి తల్లి నాకు అక్క అవుతుంది. నా పినతల్లి, కూతురు. ఈ కార్యం సాధించగలను" అంది జెన్‌షిహ్. వె-యిన్ కృతజ్ఞతాపూర్వకంగా ఆమెకు నమస్కరించాడు.

అప్పటినుంచి జెన్‌షిహ్ తరచు జనరల్ యింటికి వెడుతూండేది. ఒక నెల తర్వాత వె-యిన్ ఆమెను యీ విషయమై అడిగాడు. జెన్‌షిహ్ లంచం యివ్వవలసి ఉంటుందని చెప్పి కొంత సిల్కు కావాలని అంది. వె-యిన్ సిల్కు తీసుకువచ్చి ఆమెకు యిచ్చాడు. ఇది జరిగిన రెండురోజులకు వె-యిన్, జెన్‌షిహ్ భోజనం చేస్తూండగా, జనరల్ యింటివద్దనుంచి ఒక నౌకరు, నల్లటి గుఱ్ఱంమీద వచ్చాడు.

ఈ కబురు తెలియగానే జెన్‌షిహ్ నవ్వుతూ అంది: "కార్యాన్ని సాధించాము." జెన్‌షిహ్ జనరల్‌కు ప్రియపాత్రురాలయిన ఆ పిల్లకు జబ్బు వచ్చేట్లుగా చేసింది. ఆరోగం సామాన్యంగా మందుమాకులకు తగ్గేది కాదు. పిల్లతల్లి, జనరల్, జ్యోతిష్కుణ్ణి పిలుస్తున్నారని వినగానే జెన్‌షిహ్ జ్యోతిష్కుడికి లంచంపెట్టింది. ఆ పిల్లకు రోగం నయంకావాలంటే తన యింటికి మార్చాలని చెప్పమంది. జ్యోతిష్కుడు ఆ యింట్లో దుష్టగ్రహాలున్నాయని, అందుకని యిక్కడికి వాయవ్యదిశగా ఉన్న యింటికి మారుస్తే, రోగం నయమవుతుందని చెప్పాడు.

జనరల్, ఆపిల్లతల్లి జ్యోతిష్కుడి చెప్పిన యింటికోసం వెదకారు. అది జెన్‌షిహ్ యిల్లుగా తేలింది. తన పిల్లను కొద్దికాలంపాటు ఆ యింట్లో ఉండనిమ్మని జనరల్ జెన్‌షిహ్‌ను బ్రతిమాలాడు. తన యిల్లు యిరుకని, యిబ్బందిగా ఉంటుందని ఎన్నో అడ్డంకులు చెప్పి జెన్‌షిహ్ చివరకు సమ్మతించింది. ఆ పిల్ల, ఆమె తల్లి యిద్దరూ జెన్‌షిహ్ యింటికి వచ్చారు. ఇక్కడకురాగానే చంగ్ (జనరల్ కూతురు) కు త్వరలోనే పూర్తిగా ఆరోగ్యం చేకూరింది. కొన్నాళ్ళ తరువాత జెన్‌షిహ్ రహస్యంగా వె-యిన్ ను ఆ పిల్లను కలుసుకునేటట్లు చేసింది. కాని నెల రోజులు గడిచేసరికి ఆ పిల్లకు గర్భిణీచిహ్నాలు కనబడ్డాయ్...దాంతో తల్లి బెదిరిపోయి, పిల్లను తీసుకొని జనరల్ యింటికి వెళ్ళిపోయింది. ఇక్కడితో యీ ప్రణయం అఖరయింది.

కొంతకాలం గడచిపోయింది. ఒక రోజున జెన్‌షిహ్, చెంగ్‌తో "ఐదారువేల రూపాయలు తేగలిగితే మంచి లాభం కలిగే ఉపాయం చెప్పగలను" అంది.

చెంగ్ డబ్బు తీసుకువచ్చాడు. జెన్‌షిహ్ చెప్పింది "మార్కెట్టుకు వెళ్ళండి. అక్కడ అమ్మే గుఱ్ఱాలలో ఎడమతొడ మీద పుట్టుమచ్చ దానిని కొనుక్కుని వచ్చి నేను చెప్పేవరకు తిరిగి అమ్మవద్దు" చెంగ్‌కు మార్కెట్టులో అటువంటి గుఱ్ఱమే అమ్మకానికి సిద్ధంగా ఉన్నది కనిపించింది. దానిని కొని యింటకివస్తే, "ఈ గుఱ్ఱముతో ఏం చేస్తావ్? ఎందుకూ పనికిరానిదిని" అన్న బౌర్యలంతా చెంగ్‌ను హేళన చేశారు.

తర్వాత జెన్‌షిహ్ ఆ గుఱ్ఱాన్ని అమ్మమని చెప్పింది. ఒకాయన యిరవై వేలు యిస్తానని బేరానికి వచ్చాడు. చెంగ్ ముప్ఫై వేలు తక్కువకు యివ్వనన్నాడు. జెన్‌షిహ్ అంతకే అమ్మమని చెప్పింది. ఈ గుఱ్ఱానికి 30 వేలా! అని అంతా ఆశ్చర్యపోయారు. చెంగ్ గుఱ్ఱాన్ని యింటికి తోలుకువచ్చాడు. ఆ బేరగాడుకూడా చెంగ్ వెంటబడి చివరకు 30 వేల రూపాయలకు కొనుక్కునిపోయాడు.

చెంగ్‌కు 30 వేల రూపాయలకు ఎందుకు కొన్నాడా అని మనస్సు పీడించింది. ఆ వ్యక్తి వెంటపడి అడిగితే చెప్పిన విషయమిది. ఆవ్యక్తి బోయింగ్ రాజులకు చెందిన గుఱ్ఱపుసాలకు అధికారి. సరిగా మూడుసంవత్సరాలక్రితం యిలాంటి గుఱ్ఱమే ఒకటి చచ్చిపోయింది. దాని ఖరీదు 60 వేల రూపాయలు. ఇప్పుడు కొన్నది లాభమే. పైగా యీ మూడేళ్ల మేతఖర్చు తనకే దక్కుతుందట. అతను ఉద్యోగంలోనుంచి రిటైరయి పోతున్నాడట కూడా. ఇదివిని చెంగ్ ఆశ్చర్యపోయాడు.

ఒకసారి జెన్‌షిహ్‌కు బట్టలు కావలసివచ్చింది. వె-యిన్ సిల్కులు తీసుకువచ్చాడు. తనకు ఆ బట్టలు వద్దని రెడీమేడ్‌వే కావాలని జెన్‌షిహ్ పట్టుబట్టింది. ఆమెకు ఏరకాలు కావాలో అడగమని వె-యిన్, చెంగ్‌టా అనే వర్తకుణ్ణి పంపించాడు. ఆ వర్తకుడు జెన్‌షిహ్ అందాన్ని చూసి ఆశ్చర్యపోయి వె-యిన్‌తో యిలా అన్నాడు: "ఆవిడ ఏ రాజభవనాలలోనో ఉండవలసిన స్త్రీ. ఎక్కడినుంచి ఎత్తుక వచ్చావో! మళ్ళీ అక్కడనే వదిలెయ్యి. పట్టుబడితే ప్రాణాలు వదులుకోవలసిందే!"

జెన్‌షిహ్‌సౌందర్యానికి యింతకంటె వేరే నిదర్శనం అక్కరలేదు. జెన్‌షిహ్ ఎప్పుడూ బట్టలు కుట్టుకునేది కాదు. తయారైన దుస్తులే కొనుక్కునేది. దీనిలోరహస్యం ఏమిటో యిన్‌కుగాని, చెంగ్‌కుగాని తెలియనేలేదు.

సంవత్సరం తర్వాత, చెంగ్ మిలిటరీ పనుల మీద చిన్‌చెంగ్‌కు వెళ్లవలసివచ్చింది. ఒక్క పగలు మాత్రమే జెన్‌షిహ్‌తో గడపటానికి వీలుంది. రాత్రయేసరికి యింటికి వెళ్లాలి. ఇంటివద్ద భార్య ఉంది. జెన్‌షిహ్‌ను వదలి ఉండలేక, తనతో రమ్మని చెంగ్ బ్రతిమాలాడు. జెన్‌షిహ్ అంగీకరించలేదు. "ఒకనెల రోజులేగా! నేను యిక్కడనే మీకోసం వేచిఉంటాను. నాకు కావలసిన వస్తువులు సమకూర్చి వెళ్లిరండి" అంది.

చెంగ్ ఎంతబ్రతిమాలినా జెన్‌షిహ్ ఒప్పుకోలేదు. చెంగ్ తన స్నేహితుడు వె-యిన్‌తో చెప్పి ఆమెను ఒప్పించమని అడిగాడు. వె-యిన్ చెప్పినా వినలా. కారణం అడిగితే జెన్‌షిహ్ యిలా చెప్పింది. "పడమటిదిక్కుగా నేను ప్రయాణం చెయ్యకూడదని జ్యోతిష్కుడు చెప్పాడు అందుకని."

"నీ అంతటి తెలివితేటలుగల వ్యక్తికి యీ మూఢనమ్మకాలా?" అని చెంగ్ నవ్వాడు యిన్‌తోబాటు. తన కోర్కె నెరవేరితేనే చాలునన్న తొందరలో ఆమె భయాన్ని గురించి చెంగ్ ఏమీ ఆలోచించలేకపోయాడు. చివరకు జెన్‌షిహ్ ఒప్పుకుంది.

రెండవ రోజుకు మవాయ్ చేరుకున్నారు. ముందు జెన్‌షిహ్ గుఱ్ఱంమీద పోతోంది. వెనుకనే చెంగ్ తన గాడిదమీద, యింకా వెనుక దాసీది బయలుదేరారు. అప్పట్లో లోనది దగ్గరగా కొంతమంది వేటగాండ్రు తమ కుక్కలను తరిఫీదుకు తీసుకువచ్చారు. చెంగ్, జెన్‌షిహ్‌లు ఆ ప్రాంతంగుండా వెడుతూండగా, కుక్కలు గడ్డిలోనుంచి రోడ్డుమీదకు వచ్చాయి. ఆ కుక్కలను చూడగానే జెన్‌షిహ్ తన మామూలు నక్క రూపంతో, గుఱ్ఱం మీదనుంచి ఉరికి దక్షిణంగా పరిగెత్తటం ప్రారంభించింది. కుక్కలు వెంటపడ్డాయ్. కుక్కలను వెనక్కి పిలుస్తూ చెంగ్ వెంటపడ్డాడు కాని కుక్కలు అతని కేకలను లెక్కచేయనేలేదు. సుమారు ఒకమైలులోగా కుక్కలు నక్కను పట్టుకుని ముక్కలు ముక్కలుగా చీల్చివేశాయి.

చెంగ్ అమితంగా దుఃఖించాడు. తనదగ్గర డబ్బుతో చెంగ్ సమాధి కట్టించాడు. తన గుఱ్ఱాలను వదలివచ్చినచోటుకు చూస్తే, అవి అక్కడే గడ్డిని మేస్తున్నాయ్. జెన్‌షిహ్ గుఱ్ఱంమీద, ఆమె నక్కగా మారిపోయినప్పుడు వదలిన బట్టలు, జోళ్లు అక్కడనే ఉన్నాయ్. నేలమీద ఆమె నగలున్నాయ్. కాని ఆమె జాడఅంటూ లేదు. దాసీదికూడా మాయమయిపోయింది.

తన మిలిటరీ పనులను పూర్తిచేసుకుని చెంగ్ తిరిగి వచ్చాడు. ఇంటికి రాగానే వె-యిన్, జెన్‌షిహ్ క్షేమసమాచారాలు అడిగాడు. కళ్లలోకి నీరు తెచ్చుకుంటూ: "ఆమె చనిపోయింది" అని సమాధానమిచ్చాడు చెంగ్. వె-యిన్‌కూడా విచారపడి వివరాలు అడిగితే "కుక్కలు చంపాయి" అన్నాడు చెంగ్.

"ఎంతటి కుక్కలు ఐతేమాత్రం మనిషిని ఎలా చంపుతాయ్" అన్నాడు వె-యిన్.

"ఆమె మనిషి కాదు"

"ఐతే?"

చెంగ్ మొదటినుంచి జరిగిన కథ అంతా చెప్పాడు. వె-యిన్ ఆశ్చర్యపోయాడు. మర్నాడు యిద్దరూ ఆమె సమాధిని సందర్శించారు. ఎప్పుడన్నా వారికి ఆమె జ్ఞాపకంవస్తే ఏది గుర్తు ఉన్నా ఉండకపోయినా ఆమె ఎన్నడూ తనబట్టలను కుట్టుకునేది కాదన్న విషయం జ్ఞాపకం వుండేది.

[క్రీ. శ 766-780 ప్రాంతంలో నేను (షెన్ చి-చి- ఈకథారచయిత) చంగ్ లింగ్‌లో ఉండేవాణ్ణి వె-యిన్‌తో నాకు పరిచయం ఉంది. అతనివల్లనే యీవివరాలన్నీ నాకు తెలిశాయి.]

ఈకథవల్ల జంతువులలో కూడా పవిత్రత, నీతి ఉందని తేలుతుంది. తన మానాన్ని కాపాడుకుంటూ, ప్రియుడికి ద్రోహంచెయ్యకుండా ఉండటంలో యీమె యీనాటి మానవజాతి కంటె వెయ్యిరెట్లు మెరుగు. చెంగ్ ఆమె అందాన్ని ఆరాధించాడే కాని, ఆమెలోని ఉత్కృష్టతను గుర్తించలేకపోయాడు. అతనే విద్యావంతుడయినట్లయితే, తన విజ్ఞానాన్ని వినియోగించుకుని, ఆమెవద్దనుంచి, ప్రకృతిలో జరిగే వింతమార్పులు, ఇహపరలోకాలకు గల సంబంధం, ఇంకా ఆమె అందాన్ని వర్ణించి చెప్ప గలిగి ఉండేవాడు. బాహ్యసౌందర్యంతోనే తృప్తిపడి ఊరకుండేవాడు కాడని గట్టిగా చెప్పగలను.

—

విలువ తగ్గింపు

(7-పేజీ తరువాయి)

యేషన్ డివాల్యుయేషన్ అంటారు, యేమిటి బాబూ? అంటాడు. ఇంటికివస్తే భార్యాబిడ్డలు యిదే ప్రశ్న. ఇందరికీ వాళ్లవాళ్లకి తగ్గట్టుగా జాగ్రత్తగా చెప్పినా యెవరికీ తృప్తి లేదు. అంతా విని యేదో పెద్దగొడవగా వుండి "సరేలెండి. చాలా పెద్దవిషయమే!" అని చక్కాబోతారు.

నే నెరుగున్న అర్థికశాస్త్రం పఠించి, అధ్యాపకత్వం వహించిన వొక పెద్దమనిషితో ఆయనభార్య "ఏమండోయ్, రూపాయివిలువ తగ్గితే తగ్గిందిగాని, మీ విలువమాత్రం హెచ్చినట్టు కనబడుతోంది. ప్రతీవారూ మిమ్మల్నే అడుగుతున్నారు ఏమిటి సంగతి?" అంటోంది.

"మాకుమాత్రం తెలిసి చచ్చిందీ? ఈమధ్య మా సంఘం అంతా కలిసి యీ డివాల్యుయేషన్‌మీద వొక వ్యాసం రాసి పత్రికలో ప్రకటించాం సామాన్యజనులకోసం. అది చదివిన సామాన్యులకు తెలియకపోగా కొద్దో గొప్పో చదువుకున్న వాళ్లకి కూడా కొత్త సందేహాలు బయలుదేరాయి" అన్నాడు.

—



ఆగ్నేయాసియా ఆరోగ్య మహాసభలో పాల్గొను నిమిత్తం న్యూఢిల్లీ వచ్చిన ఆంగ్‌సాన్ సతికి వెల్లింగ్‌టన్ విమానాశ్రయంవద్ద బర్మా రాయబారి, న్యూఢిల్లీలోని ఇతర ప్రముఖులు స్వాగతం చెప్పినప్పటి చిత్రం.

లేఖలు



గంగడిపాలెంశివారు అడవిపాలెంలాకు

వరదప్రమాదమువల్ల రేపల్లేతాలూకా అడవి పాలెంలాకు-చివర రాజుచానల్ 6 మైళ్లపొడుగునా నీరు పొంగి 36గండ్లున్నూ, బారున తూర్పువైపుకట్ట కోతకోయుటయు, 4వ మైలు 1వ ఫర్లాంగువద్ద సుమారు 1½ ఫర్లాంగు పొడుగున పూడ్చుటకు అలవికానటువంటి గండి ఒకటి షుమారు 10 అడుగుల లోతున పడిపోయినది. సదరు గండ్లద్వారా వచ్చిన నీటి ప్రవాహామునకు షుమారు 2 అడుగులు లగాయతు 1 అడుగువరకు 100 యకరములు మాగాణిభూములు మెరకవేశి పోయినవి. వరదముంపు ఎంతవరకు ప్రవహించినదో ఆ భూములన్నియూ 6 అంగుళములు లగాయతు 1 అడుగువరకు ఒండ్రు వేసినది. సదరు భూములలో 2వ తేదీవరకు నీరు యున్నది. యకరము 1కి 50-0-0 రూపాయలు ఖర్చుతో నాటు వగైరాలున్నూ, గవర్నమెంటువారి ఎరువులు షుమారు యకర్నుకు 1 కి 15-0-0 రూపాయలు ఖరీదుగలవి వేసినామనియూ యకరము 1 కి 15, 16 బస్తాలు ధాన్యం పండునన్న ఆశతో యుండగా హఠాత్తుగా సంభవించిన వరద నష్టమునకు రైతుల గుండెలు అలిసిపోయినవి. మరియూ యిప్పటివరకు పశువుల చావిళ్లు కొట్టుకొనిపోవుటవల్ల వుండు తావు లేకయూ, తినుటకు గ్రాసము లేకయూ చాలా బాధలుపడు తున్నారు. యీ రోజువరకూ అధికారులు ఎవ్వరునూ అక్కడికి వచ్చి విచారించినపాపాన పోలేదు. మనుష్యులుకూడా వరదప్రవాహామునకు కొట్టుకొనిపోయి రెండు మూడు రోజులు అడవిలో చెట్లాధారముతో బ్రతికిబయటపడితిమనియూ, కొట్టుకొనిపోయిన పశువులు కొన్ని యిండ్లకు వచ్చినవనియూ, మిగతా పశువులను వెతికననూ కనపడలేదనియూ, మా బండ్లు నాగళ్లు వగైరా అంతులేకుండా కొట్టుకొనిపోయి నట్లుగా రైతులు తెలిపినారు. ఇంతలో అడవిపాలెంలాకువార్కి సూపరింటెండుఇంజనీయరు, ఎక్జిక్యూటివుఇంజనీయరుగార్లు రేపల్లె వచ్చుచున్నారని తెలిసి మాకు చెప్పగా కొంతమంది రైతులను వెంటబెట్టుకొని రేపల్లే వచ్చుచుండగా గంగడిపాలెం సబ్ఇన్స్పెక్టరుగారు వుప్పల వల్లయ్య అనే రైతును మీరు చచ్చిపోతిరి అని మాకు తెలిసినది ఇదేమి అన్యాయము అని ప్రశ్నించగా, ఆ రైతు నిజమేనండీ వరదకు కొట్టుకుపోయి అడవిలో చెట్లాధారముతో బ్రతికి బయటపడితిని. ఆకారణముచేత వదంతిపడ్డ మాట నిజము యని చెప్పినారు. దారిపొడుగునా యున్న గ్రామాదులవారు వల్లయ్యగార్ని పై మాదిరిగా ప్రశ్నించిరి. రేపల్లెలో శ్రీ. సబ్ డివిజనల్ ఆఫీసరుగారు కూడా పైమోస్తరుప్రశ్న నే వల్లయ్యగారు కనబడగనే ప్రశ్నించిరి. రేపల్లె క్యాంపులో శ్రీ. సూపరింటెండుఇంజినీయర్, శ్రీ. ఎక్జిక్యూటివుఇంజనీయర్లుగార్కి అక్కడ జరిగిన వరదప్రమాదమునుగూర్చి చెప్పుకొని, పిటీషన్ను కూడా అందజేసిరి. యీ విషయములనే శ్రీ. గుంటూరుజిల్లా కలెక్టరుగార్కి స్వయముగా చెప్పుకొని పిటీషన్ను అందజేసిరి. కాన శ్రీ గుంటూరుజిల్లా కలెక్టరుగారున్నూ, శ్రీ. ఎక్జిక్యూటివుఇంజనీయరుగారున్నూ, కలసి వెంటనే సదరు ప్రదేశమునకు వచ్చి స్వయముగా అక్కడి రైతుల కష్టనష్టములను విచారించి, సహాయము చేయించవలసినదిగా ప్రార్థిస్తూ యున్నాను.

దేవభక్తుని రామచంద్రయ్యచౌదరి

నాణెమైన విత్తనముల ఉత్పత్తిస్కీములు

అయ్యా! వ్యవసాయఫారములలో పండించు వరి, జొన్న, రాగి, సజ్జవంగడములను రయితులు బహు మెచ్చుకుందురు. ఫారములలో పండించు విత్తనము చాలదుకావున రయితుల పొలములలో సీడుఫారము లనబడు పద్ధతిని డిమానుస్టేటరుతణిఖిక్రింద పండించు విత్తనము నాణెము అనేక కారణములవలన చాల తక్కువకాబట్టి ఒకొక్కప్పుడు కొన్న విత్తనమును విత్తనముగా ఉపయోగించుట లేదు. ఈ సీడుఫారము పద్ధతి చాల అసంతృప్తికరము అని అందరికి తెలుసును. వేరే పద్ధతి ఏర్పరచకపోవుటవలన ఈరీతిగానే జరుగుచున్నది. యమ్. టి. రాజు *I. C. S.* గారు ఒకప్పుడు వ్యవసాయడైరక్టరు, భూస్వామి. మంచివిత్తనములను డిపార్టుమెంటు అధ్వర్యమున ప్రత్యేకముగా ఫారములలో తయారుకావలసినదేకాని ఇప్పటివలె సీడుఫారంపద్ధతి పనికిరాదని వారి నమ్మకము. అందరియొక్క అభిప్రాయము కూడా ఇదే.

సీడుఫారంపద్ధతి ఈరీతిగానే ఉంచి కొంత సిబ్బందిని ఎక్కువడబ్బు ఖర్చుచేసి ఇప్పుడు గవర్నమెంటు మంజూరుచేసినారు. పై ఉద్యోగములు ఎక్కువచేయుటే జరుగుచున్నది.

క్రింద ప్రాతిపదికముగా తాలూకాలో అన్ని వ్యవసాయపనులు నిర్వహించవలసియున్న డిమానుస్టేటరు, వారి సిబ్బందిమాత్రము యథావిధిగా తక్కువగానే ఉంచుట జరుగుచున్నది.

అన్నిరకములయిన వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడు పనులు గ్రామములలో చేయవలసిన డిమానుస్టేటరు. ఫిర్కాకు అనగా 25 గ్రామములు పల్లెలకు ఒక డిమానుస్టేటరు, 5 గ్రామములకు ఒక కర్షకుని నియమించి కావలసిన పరికరములు, మందులు, విత్తనములు అందుబాటులో రయితులకు ఉంచినయెడల ఆ యవకాశములు కావలసిన రయితులు ఇప్పటివలె గాక, సులభముగా పొందుటకు అవకాశము యుండునుగదా.

వ్యాపారసంబంధమైన పనులు డిమానుస్టేటరు నుండి తీసివెయ్యనంతకాలము, అందుబాటులో రయితులకు కావలసిన చీడపురుగులకు పరికరములు, మందులు, విత్తనములు లేనంతకాలము, వ్యవసాయడిపార్టుమెంటువలన ఏమాత్రము ఉపయోగము, ఖర్చుపెట్టుతున్న డబ్బుకు అనుగుణ్యముగా ఉండబోదు అని ఎన్నడు మంత్రులు తెలుసుకొంటారో అని విచారించుచున్నాను. శాసనసభ్యులకు, కాంగ్రెసులో చిందులుతొక్కడు ఘనులకు నిర్మాణ కార్యక్రమమునందు ఎన్నడు దైవము జ్ఞానిక కలిగించునోకదా! చీడపురుగుల నివారణకు ప్రత్యేకసిబ్బంది ఇప్పుడు ఉన్నది. క్రొపుకటింగుపనులకు ఇప్పుడు ప్రత్యేకసిబ్బంది యున్నది. తిరిగి విత్తనము, సీదుఫారం ఉత్పత్తికి ప్రత్యేకసిబ్బంది ఇప్పుడు గవర్నమెంటు ఏర్పరచినారు. పైచెప్పినవారందరి పనులు గ్రామములలో జరుపుతున్నది ఇప్పటి డిమానుస్టేటరువారి సిబ్బందియే. తృప్తికరముగా పనులు ఎట్లు అగును.

తా॥ పరమానందము, యల్. ఏ. జి

బంజరు భూముల సాగుకు ఉత్తర్వులివ్వాలి.

ఆర్యా!

ఒందరుతాలూకా కోన, పాతీరు, వాడగొయ్యిగ్రామాల్లో వేలకొలదియకరములు బంజరు భూములు సాగులేక ఎంతోకాలమునుండి పడి వుంటూన్నాయి. యీ భూములను సాగు చేసుకుంటామని హరిజనులు యితర వ్యవసాయకూలీలు గతసంవత్సరమునుండి ప్రభుత్వానికి పిటీషన్లు పెట్టుకొన్నప్పటికి వాటివిషయము స్థానికఅధికారులుగాని ప్రభుత్వముగాని యింతవరకు పట్టించుకొనకపోవుట విచిత్రము. ఒకప్రక్క కేంద్రప్రభుత్వము అధికాహారోత్పత్తి కొరకై బంజరు భూముల నన్నింటిని విడువక సాగుచేయవలసినదని కోరుచున్నప్పటికీ మద్రాసుప్రభుత్వము యీవిషయమునందు తగిన శ్రద్ధ తీసుకొనకపోవుట శోచనీయము. యీ భూములలో దోసకాయ, బీరకాయ, పిల్లిపెసర, మొదలైనవి తక్షణము పండించుటకవకాశముండియున్నది. క్రమేపి కాలువ త్రవ్వినపిమ్మట ధాన్యంకూడ సులభముగా పండించవచ్చును. యీ భూములు మెరకభూములక్రిందకు వస్తాయి. 500మంది వ్యవసాయకూలీలు ఇండ్లుకట్టుకొని ఆ భూములను సాగుచేయుటకు సంసిద్ధులై యున్నట్లు ప్రభుత్వమునకు ఇదివరలోనే తెలియపర్చుట మైనది.

కాన మద్రాసుప్రభుత్వము యీపై తెల్పిన విషయాలను సమగ్రముగా నాలోచించి ఆ భూములను అచ్చటికూలీలకు ఇప్పించబూనుకొనుట ప్రభుత్వతక్షణబాధ్యత. ప్రభుత్వం యీ కార్యమును త్వరలో నెరవేరుస్తుందని ఆశిస్తున్నాము.

ఇట్లు.
లంకపల్లి వెంకట్రామయ్య.

పంటరోజుల్లో ధాన్యంధరలు.

ఆర్యా!

ఈ సంవత్సరము అనగా స్న 1359వ ఫసలీ తాలూకు ధాన్యంపంటలు దగ్గరకు వచ్చుచున్నవి. క్రిందటి సంవత్సరము జనవరినెలలో పేదరైతులు సర్కారుపన్నులు చెల్లించుటకై ధాన్యములను అమ్మచూపగా, వర్తకులు గవర్నమెంటువారు నిర్ణయించిన ధరలకు బస్తాఒక్కంటికి రు 2, లు 3, లు కూడ తగ్గించినకాని కొననిసంగతి ప్రభుత్వమునకు తెలిసియే యున్నది. పంటరోజులలో ధాన్యములకు సరియైనధరఇప్పించి కొనిపించుటకు ఉపేక్షించుటయు, యెద్దడిరోజులలో ధాన్యసేకరణకు(ప్రొక్యూరుమెంటుకు)మిక్కిలి కాఠిన్యము వహించుటయు ప్రభుత్వమునకు పరిపాటైపోయినది. ఇట్టి చర్యవల్ల మధ్యతరగతి, క్రిందతరగతి రైతులకు రెండువిధముల నష్టము కలుగుచున్నది. మొదటిది పంటల రోజులలో తమ ధాన్యమునకు సరియైన ధర రాకపోవుట. రెండవది తాము స్వంత ఉపయోగమునకై మిగుల్చుకొన్న ధాన్యమును యెద్దడిరోజులలో ప్రభుత్వమువారు బలవంతపరచి యెంతోకొంత ధాన్యమును తమ ప్రొక్యూరుమెంటుకు తీసుకొనుటవల్ల, ఆ తక్కువైన విధాన్యమును హెచ్చుధర పెట్టి పేదరైతులు తమ స్వంతముకొరకు కొనుక్కోవలసివచ్చుచున్నది.

ఈ సంవత్సరమైనను ఇట్టి అనర్థములు జరుగకుండుటకై ప్రభుత్వము ఇప్పటినుంచి తగిన చర్యలు తీసుకొనవలసియున్నది.

ఇందువిషయములో డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు 1942వ సంవత్సరము ఏప్రిల్ నెల 29వ తేదీని "ఇండియన్ఎక్స్ప్రెస్" లో వ్రాసిన ఆంగ్లవ్యాసములోని విషయములు, నేటికిని వర్తించుచున్నవి.

నల్లమందు, గంజాయి మొదలగు నిషావస్తువుల విషయములో సైతను తగు కట్టుదిట్టములు చేయగలిగిన ప్రభుత్వము. ఎల్లరకు జీవనాధారములైన ధాన్యముల విషయంలో ఏల కట్టుదిట్టము చేయు లేదు?

పంటల రోజులలో అమ్మజూపిన, అమ్మతగిన, ధాన్యములను నిర్ణీతధరలప్రకారము ప్రభుత్వమువారు కొనిపించి నిల్వచేయుటకు ఇప్పటినుంచి తగు జాగ్రత్త తీసుకొనవలసియున్నది.

మరియు, ఏ రైతువద్దగాని గవర్నమెంటువారు నిర్ణయించియున్న లెక్కలప్రకారము ఎకరము ఒకటికి కూలీలకు, విత్తనములకు మినహాయించవలసిన ఖర్చులున్నూ, భోజనవిషయంలో, వారి వారి కుటుంబములబట్టి పెద్దలకు, పిన్నలకు మినహాయించవలసిన ఖర్చులున్నూ, మొత్తం మినహాయించివేయగా, అదనపు ధాన్యంఉండకూడదనియు, అట్లు అదనపు ధాన్యం దాచిఉంచిన రైతునకుగాని, మరి ఇతరులకుగాని (లైసెన్సు పొందిన వర్తకునుతప్ప) జుర్మానాలు గాక, కఠిన శిక్ష (ఖైదు) విధింపబడును అని ప్రభుత్వమువారు వెంటనే ఒకఆర్డినెన్సు ప్రకటింపవలసియున్నది.

లైసెన్సు పొందిన వర్తకులు సయితము ధాన్యములు, బియ్యముల ఖరీదు అమ్మకముల లెక్కలను సరిగా చూపనిఎడల కఠినశిక్షకు పాత్రులగుదురని ప్రకటింపవలసియున్నది.

పై చర్యలను ప్రభుత్వమువారు తగు శ్రద్ధతో నమలుజరిపినయెడల ధాన్యసేకరణ—పంపకములు సంతృప్తికరముగా జరుగుటయేగాక, బ్లాకుమార్కెట్లు, లంచగొండితనములు కూడా చాలావరకు తగ్గుటకు సావకాశ మున్నది.

సారంగు, వరసాలరావు

మనరాష్ట్రం, మనదేశం:

(9-వ పేజీ తరువాయి)

రద్దుచేస్తామని ఒక గడువు నిర్ణయించడం అవసరమన్నారు.

తర్వాత డా॥ అంబేద్కర్ ప్రతిపాదించిన రీతిగా తీర్మానం ఆమోదింపబడెను.

క్రొత్త రాజ్యాంగం ప్రకారం సర్వత్ర ఎన్నికలు జరిపి నూతన ప్రభుత్వాలను స్థాపించేవరకు పాత ఏర్పాట్లనే సాగించడానికి అవకాశం కల్పిస్తూ, కొన్ని క్లాజులు తయారుచేయబడినవి. 312 A మొదలుకొని 312 H తుదగా గల ఈ 7 క్లాజులను పరిషత్తు ఆమోదించినది. క్రొత్త శాసనసభలు, ప్రభుత్వాలు, గవర్నర్లు అధ్యక్షులు ఎంచుకొనబడేవరకు పాతవారే నూతన రాజ్యాంగంకింద పనిచేస్తారని ఈ క్లాజుల తాత్పర్యం.

312 *E* అన్న క్లాజు దరిమిలాను ప్రతిపాదించబడుతుంది. వర్తమానరాజ్యాంగం రద్దవడానికీ, క్రొత్తరాజ్యాంగం అమలులోకి రావడానికీ మధ్యనున్న కాలంలో రాజ్యాంగసంబంధమైన చిక్కులు ఏమైనా వస్తే, వాటిని తీర్చడానికి అధ్యక్షునికి ప్రత్యేకాధికారాలు ఇస్తూ, చేసిన మరోక్లాజుకూడా ఆమోదించబడింది.

313 క్లాజులో ఆ అధికారాలు ఈ విధంగా నిర్వచించబడినవి.

1935 వ సంవత్సరపు చట్టం నుండి నూతన రాజ్యాంగంలోకి ఒక్కసారిగా మారడం సాధ్యంకాదు కాబట్టి నూతనరాజ్యాంగాన్ని ఏ సవరణలతో సక్రమంలో అమలుజరపవలెనో నిర్ణయించి ఆ ప్రకారం నడమంతరంలో ఉత్తర్వులు చేయడానికి అధ్యక్షునికి అధికారం ఇవ్వబడింది. నూతనరాజ్యాంగం ప్రకారం పార్లమెంటు ఎన్నిక అయిన తర్వాత ఈ అధికారం రద్దుఅయిపోతుంది. అధ్యక్షుడు ఈ క్లాజును అనుసరించిచూస్తే ఉత్తర్వులన్నీ కేంద్రశాసనసభకు ఎప్పటికప్పుడు ఆమోదార్థం నివేదించబడుతూ ఉండవలెను.

సారంగపాణి పదములు

(6-వ పేజీ తరువాయి)

అరయక తలిదండ్రుల లాజ్ఞ మీరితిగాని
నిరచిత్తమున హరిని స్మరణసేయ నైతి...
అపకారములకు నేనగ్రగణ్యుడనై
యుపకృతిమాటంటె నుగ్రుడనుచు
అపకీర్తులకు నే నర్హుడైతిగానీ
కపటవామన నీదు కథ చెవుల విననైతి.
యతుల దూషణ చేసి యెదటి మే లోర్వక
కృతులు మానవుల కర్పితము జేసి
గతవాసరము లీ గతి దాటించితిగానీ
పతితపావన సద్గతి జూపు మననైతి...

రాజానుగ్రహము తప్పినది. దారిద్ర్యము చుట్టుకొనినది. బంధువులకు పలుకే బంగారమయినది. గడనుడుగు మగని జూచి కులసతి కోపము వహించినది. కుమారులు చేరదీసి యాదరింపలేదు. మిత్రులు, బుధులు చెలుప జూచుచుండిరి. ఇట్టి దీనావస్థలో కవీశ్వరుడు పాడిన కీర్తన మిది యప్పటి యతని యవస్థను కన్నులకు గట్టుచున్నది.

ధన్యాసి-చాపుతాళము

పల్లవి

నిన్ను నే విడువాను నీ పేరు మరువను
నీ బంటు బంటనైనానూ

అనుపల్లవి

అన్న యెన్నటికి ప్రసన్నుడౌ వేదువో
వెన్న ముచ్చిలి దిన్న వేణుగోపాలా...
నలుగురుబంధువులు దలచక యున్నను
నరనాథు డలిగినాను
కులసతి మెం డొడ్డుకొని పలుకకున్నను
చెలికాండ్రు బుధులు చెరుపవచ్చినాను...
పాపాత్ము డనుచు కృపారహితు డైనాను
భాషించకుండినను
కోపగించి లక్షు కొదవ లెంచినాను
మాపు రే పనుచు యేమరి యూరకున్నాను..
కామక్రోధాదు లెక్కడ వదలకున్నాను
స్వాములు దూరినను
లేమి వచ్చి యొకరు లెక్కసేయకున్నాను
ప్రేమ మరచి సుతులు
యేమరియున్నాను...

మఱియొక్క పదములో గూడ భూపతుల బొగడినందులకై విలపించుచున్నాడు.

కల్యాణి - ఆదితాళము

పల్లవి

నిన్ను గొలిచి యొరుల వేడబోయితే
నీ కపకీర్తి గాదా

అనుపల్లవి

పన్నగవైరివాహ వేణుగో
పాలరాయ యాపన్నసహాయ...

* * *

చేరితీ శుభము లిమ్మనుచు చల
పోరితీ భూపతుల బొగడి గొ
జారితీ అజ్ఞానుడనై బహు
దూరితీ వేసారితీ
కోరితీ హరికథ వీనుల విన
మీరితీ దుష్టనరుల సంగతి
దారితీ మాయ దెలియుటకు మీము
జీరితీ భారతీశనుతపద...

మఱొక్కచోట 'కోపము జేసే నరనాథు కొలువు గొలిచే దొక రోత' యని పేర్కొనినాడు.

పోతన, అన్నమయ్య, త్యాగరాజు మొదలగు మహాభక్తుల చరిత్రము లన్నిట నిట్టి విషాద మేఘము లావరించుట మన మిచట సుఱితింప వలసియున్నది.

ఇతడు ఉంఛవృత్తితో జీవించుచుండినటులు తెలియుచున్నది. భిక్షాటనమునకు పోయినపుడు తనకు గలిగిన యనుభవముల నేకరువుపెట్టుచున్నాడు. చూడుడు.

సౌరాష్ట్రరాగము - చాపుతాళము

పల్లవి

అక్షయపాత్రకు పోతే కల దని వొక
భిక్షము వేయరయ్యా - మాల

అనుపల్లవి

క్షేపము త్రవ్వి నెత్తిన బెట్టేరా
కుక్షింభరులు వేణుగోపాల నాస్వామి...

తెచ్చుకోవలె నని కొందరు రాలే
తేబోయినారంట కొందఱు - ఒట్టి
గచ్చులకై నాను కడకు బోయినా నని
ముచ్చవలెనె తలుపుమూలకు ఒరిగేరు...
లేవ పాలుమాలి కొందఱు - లోన
దేవర వుందని కొందరు - నవన
దోవ కడ్డమై యెట్టి దోశలి ముడుచుక
నీ వోల్లోని రింజ లేవి నూపమునేరు...

* * * *

ఈ ప్రొద్దు పామ్మని కొందఱు - కాని
యింగోనాడైనాని కొందఱు - యిట్టి
పాపాత్ముల యముడు పట్టి కట్టకమును పే
కాపాడే దెలా గోపాల నా స్వామి...

ఉంఛవృత్తితో బ్రతుకువా రిట్టు లిట్టులుండవలె నని తరువాతితరములవారి కొక పథకము తయారుచేసి యొసగినాడు. ఈ పదము చూడుడు:

శంకరాభరణము - ఆదితాళము

పల్లవి

ఉంఛవృత్తితో బ్రతికేవారికి
వ్రతము కా...

అనుపల్లవి

పంచనాయకు నన్న వేణుగో
పాల దేవ యెంచున నగలేక...
అమ్మా, అక్కా, అయ్యా యనవలె
పామ్మంటె తలవంచుక పోవలె
రొమ్మున తంబురమీటుచు పాడుచు
రోసపడక యిల్లిల్లు తిరుగవలె...
ప్రొద్దెక్కక మును పే రారాదు
పాంచాలు విని బైట చెప్పరాదు
హద్దుమీఱి లోనికి పోరాదు
అణంగుల జూచి నవ్వరాదు...
వెంట నొకనిని బిలుచక రారాదు
వేయకుంటె హాలము సేయరాదు
కొంటెలతో వాదుకు పోరాదు
కోరని కోరికలు కోరరాదు
కొంచె మనుచు గోజాడగరాదు
కొట్టాడేచోట నిలువరాదు
సంచి జూచుకొని యెద బడరాదు
చాల దనుచు తిరుగరారాదు...
చెయ్యి దుడుకు సాహసము కారాదు
చేతి తలుపుతట్టి పిలువరాదు
బియ్యము మెక్కెడి తెలియరాదు
భీష్మికరించుక పోరాదు...
ఇచ్చి పెట్టినది దొరికిం దనవలె
యిప్పటి కిది పదిలక్షలనవలె
తెచ్చినందులో ముష్టి వేయవలె
దేవుడే రక్షకు డనుకోవలె...

కార్వేటినగరమునకు సుమారు ఎనిమిదిమైళ్ల దూరమున పల్లిపట్టు అను గ్రామము కలదు. ఆ గ్రామమునందు వరదరాజస్వామిదేవాలయము కలదు. వరదరాజస్వామినామాంకితములుగా నితడు మూడు శృంగారపదములు విరచించినాడు. మచ్చున కొక్కటి—

ముఖారి - ఆదితాళము

పల్లవి

చాలు చాలు వాని నేస్తము యిక
నేలనె మనకూ - ఓ

అనుపల్లవి

బాలరో వరదనారాయణు
డాలతొంగి గూడి మెలగియుండు కొ...
"ఆసజెప్పి గుడిముందర యిచ్చిన
బాస మఱచె కొమ్మా యీ
దోసకారి యెందరినో యీవగ
మోసబుచ్చె నమ్మా
నాసరైన చెలులు విన్న వికవిక
నవ్వరేమమ్మ - విన
దోసమో కలిగినమా టంటె
రోస మెందు కమ్మ - పోవమ్మ
తనువు తనది జేసియున్న నావం
తైన దలచడమ్మా - యేదొక
మనవి దాని కెరిగింపక వినడట
మంచిపనే నమ్మా
నెనరు వాని జాడ లాడకాడకు
నేడు గంటి కొమ్మా - అతి
వినయ మెల్ల ధూర్తలక్షణ మనే
విధ మాయగదమ్మా - లేవమ్మా...
వరదనారాయణసా మెంత
వంచనవా డమ్మ - నా



శ్రీ ప్రకాశం పంతులుగారు, ఆచార్య వినోభాభావే.

సరస జేరి నను గూడి జే చినుచు
సాధించెనమ్మ
యిరవు పల్లిపట్టై తేనె తన
యెక్కు వవరి కమ్మ - యే
మెరుగనట్టివానివలెనె యుండి
యెంత జేసె నమ్మా - వల దమ్మ...

అన్నమసరోవరతీరమున వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామిమీదను, నారాయణవనమున వెలసిన కల్యాణవేంకటేశ్వరస్వామిమీదను తిరుత్తని సుబ్రహ్మణ్యస్వామిమీదను గూడ నితడు పదముల విరచించినాడు. తిరుత్తని చెంగల్వరాయని పై బాడిన పద మిది చూడుడు.

ఆనందభైరవి - ఆదితాళము

పల్లవి

నీ యింటికి నీవు వచ్చేటందుకు
నెలత నంపవలెనా

అనుపల్లవి

రాయబారమా చిలుతని చెంగల్వ
రాయా యిది మాబాగాయె...
ఎపుడు వత్తు వని యెదురే జూచుచు
యెవరు వచ్చిన శకునము లడుగుచు
కపటదవాల కెల్ల మ్రొక్కుచు
కలుగుచున్నను చే బిలుచుచు...
ఒకటి రెం డనుచు దినములు యెంచి
వద్ద దిరుగు చిలుకల నదలించి
సుకము లేక పైపై తమి మించి
సొలయుచున్నను పొందదలంచి...
చెలుల కందరికి లంచము గట్టి
శయ్యమీద చెక్కిట చెయిబెట్టి
వలరాయని రోయబార దిట్టి
వగచుచున్న నాపై వయ బుట్టి...

తిరుత్తనిలో జరుగు దేవోత్సవములను, కార్వేటినగరమున వేణుగోపాలస్వామి తెప్పతిరునాళ్లను, నారాయణవనమున సంతలను, పుత్తూరులో నేటికిని జరగు అగ్గితిరునాళ్లను, ధర్మరాజుతిరునాళ్లను వర్ణించుచు నితడు పదముల విరచించినాడు. తిరునాళ్లను వర్ణించు పదముల నితడు ప్రజాభాషలో ప్రజాభిరుచులకు ప్రతిబింబములుగా ప్రజల పలుకుబడులతో విరచించుట గమనార్హమై యున్నవి. అగ్గితిరునాళ్లను వర్ణించుపదము నదే పలుకుబడితో నభినయించి చూపినచో నది హృదయంగమముగా నుండుననుటలో సందేహము లేదు. * అగ్గితిరునాళ్ల పద మిది చూడుడు.

ఆరభి - చాపుతాళము

పల్లవి

అగ్గితిరునాళాలంట - అర్జుని కతలంట
అవురా యెంతరు సొద్దేమే - భారతకత
జూరా యెన్నెన్నింతలే

అనుపల్లవి

సుగ్గి జయము దినిసుట్టు బలాదూరు
అగ్గురోరపు అయ్యోర్నడిగె నీ సొచ్చిగ...
యిగనేసుపయి నెక్కి యీబీసనూ డొచ్చి
బగుసెగ్గ లెన్నెన్నో బలికీ దుశ్శాసూని
మొగము చూడగానె మొర్చనాయాలటై

సుసగుమిస రనకుండ సుడ్లల సక్కనె...
అనమంతెనకటోడు - అబిమన్నుడంటనె
సనిదూనోలె బట్ట సాముసేయుచు అట్ట
యినరెయ యీరబద్రు నిసనకాయలు వొక్క
కసునెప్పే శేతల్కి కర్ణుని శించనె...
యిరన్నెచ్చు చడ్డకు డింద్ర జితొక రెయ్యి
దురిపోదనుని శేయిలోదూరి ముక్కున నెల్లి
అరశి పిసాశోలె అశ్వద్దామను మింగి
సురిపోదమాయనే - సూడయేడిసన్నె...
బేరిబూరుగ లింట గారదేవలమెద్ద
యీరపతిమెకు మొక్కి యిటు తలెత్తేతల్కి
మారుబాసో మెకడు మొలతి త్తోదలించుకొని
శానైడై దీశడిదో జనుల కిచ్చెనే నిపు...
తేనీగములోలె - తెండె తెండెగ పంజ
కోనచముద్రంసుంట - కొనను నల్బడి సూడె
నానాదించింగల్లె - నానారం చంతోలె
రేణుగోపాలుడు యెటుల గాయించెనె...

ప్రజావ్యావహారికభాషలో ప్రజల పలుకుబడులతో ప్రజావృత్తములను, నభివర్ణించు నితని పదములు సహృదయహృదయంగమములు. ప్రజాభాషలో ప్రజా కవిత్వమును వెలయించిన యీ ప్రజాకవి తన పదములలో గొన్నిట చిత్ర కవిత్వము వెలయించి తన ప్రజ్ఞను చాటుకొనినాడు. తన పదములలో రాగముల పేళ్లు, స్వరస్థానములు, కొమ్మల పేళ్లు, మానుల పేళ్లు, ఊళ్ల పేళ్లు, ఔషధముల పేళ్లు, ఆభరణముల పేళ్లు చిత్రముగా గూర్చి తన కవితాప్రజ్ఞను వెలయించినాడు. దేశీయము అను విభాగములో యితని పదములలో చిత్తూరుమండలమున పలుకుబళ్లు, అందు ప్రచారములో నున్న సామెతలు మనోహరముగా గూర్చినాడు. ఆ యీ పదములలోని పలుకుబళ్లు, సామెతలు సమకూర్చి చిత్తూరు మండలములోని సామెతలు పలుకుబళ్లు సమకూర్చిన ట్లగును.

ఇతని పదములు సులభమై, సుగమమై యుండుటయే గాక యభినయానుకూలముగనుండి శృంగారరసమును పుక్కిలించుచు సహృదయాస్వాద్యములై యున్నవి. ఇతని పదములు కవితకు, కళలకు, గానమునకు కదలుపరానికాణాచి. క్షేత్రయకు తరువాత పదకవులలో నితనికే యగ్రతాంబూలము.


---

* ఈ అగ్గితిరునాళ్లు పుత్తూరులో నేటికిని గొప్ప వైభవముతో జరుగుచుండును. ప్రతిసంవత్సరమునను చిత్తిమాసములో నీ తిరునాళ్లు జరగునట! దీనినే ధర్మరాజుతిరునాళ్లని కూడ చెప్పుదురు. అగ్గితిరునాళ్ల సందర్భమున ద్రౌపది యొడిలో నిప్పుగడ్డ కట్టుదురు. మఱియు అగ్నిగుండములో దూకుటకు ముందు అందు నిమ్మపండును, పుష్పములను పడవైతురు. ద్రౌపది యొడిగా గట్టిన వస్త్రమును కాలక యుండుటయును, నిమ్మపండును, పుష్పములును వాడకుండుటయును అగ్గిలో దుముకువారికి నిదర్శనములు. ఈ అగ్గితిరునాళ్ల సందర్భమున ధర్మరాజుదేవాలయములో మహాభారతశ్రవణము నియతముగా జరగును. పాండవనాటకములను ప్రదర్శింతురు. ఆముచ్చటలనే ఈపదము పేర్కొనుచున్నది.

వార్తా చిత్రాలు



గత నెల 24 న శ్రీనగర్ లో జరిగిన జమ్మూ కాశ్మీర్ జాతీయమహాసభలో ప్రధానామాత్యుడు పండిత నెహ్రూ ఉపన్యసించిన దృశ్యం.



విజయవాడ లంక పేటలో వరదలవల్ల ఇళ్లు కోల్పోయి దక్కించుకోగల సామానుతో పురవీథుల్లో కాలం వెళ్ళబుచ్చుకుంటున్న ప్రజలు.







కృష్ణానదివరదలవల్ల విజయవాడలో ఇళ్లువాకిళ్లు కోల్పోయి నిరాధారులయిన వారికి స్థానిక గాంధీజీ మునిసిపల్ హైస్కూలు ఆవరణలో భోజనవసతులు ఏర్పాటుచేశారు. శ్రీ సౌభాగ్యసమాజ సహాయాధికారిణి సుభద్రమ్మగారు మొదలయినవారు బాధితులకు వడ్డనచేస్తూండడం ఈ చిత్రాలలో కానవసగును.

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.